thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 248 కరీంనగర్ శనివారం, 15 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## వాయుసేనలో ప్రైవేటు భాగస్వామ్యం తప్పనిసరి

న్యూఢిల్లీ : భారత వాయుసేన సామర్థ్యం పెంపునకు ప్రైవేటు భాగస్వామ్యాన్ని తీసుకోక తప్పదని ఉన్నత స్థాయి కమిటీ అభిప్రాయపడింది. స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యల్లో భాగంగా ప్రైవేటు సంస్థల సహకారం తీసుకొని లోటుపాట్లను సరిదిద్దుకో వాల్సి ఉందని తెలిపింది. సకాలంలో యుద్ధ విమానాలు అందక ఇబ్బం దులు ఎదురవుతున్నట్లు సాక్షాత్తూ వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ బహిరంగంగా చెప్పిన నేపథ్యంలో కమిటీ చేసిన ఈ సూచనకు ప్రాధాన్యం ఏర్పడింది. రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలోని సాధికారిక కమిటీ రక్షణ మంత్రికి అందజేసిన నివేదికలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రస్తావించింది. యుద్ధ విమానాల తయారీ, ఇతర అంశాల్లో ప్రైవేటు భాగస్వామ్యం తీసుకోవాలని ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సు చేసింది.




# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం..

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ జయకేతనం ఎగురవేశారు. తన సమీప ప్రత్యర్థి, BRS అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్లకుపైగా మెజార్టీతో ఆయన గెలుపొందారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలోనే ఇది అత్యధిక మెజార్టీ కావడం గమనార్హం. ఓట్ల లెక్కింపు మొదలైన దగ్గరి నుంచే నుంచే నవీన్ యాదవ్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించారు. రౌండ్ రౌండ్‌కూ అది మరింత పెరిగింది. ఏ ఒక్క రౌండ్‌లోనూ BRS అభ్యర్థి మాగంటి సునీత ఆధిక్యం దక్కించుకోలేకపోయారు. ఈ గెలుపు రేవంత్‌రెడ్డి సర్కార్‌కు, కాంగ్రెస్ శ్రేణులకు ఎంతో ఉత్సాహానిచ్చింది.
నవీన్ యాదవ్ విజయాన్ని ఈసీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. భారత రాష్ట్ర సమితి, భాజపా అభ్యర్థులకు 2023 ఎన్నికల కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. భాజపాకు డిపాజిట్ గల్లంతైంది.

**వ్యూహాత్మకంగా వ్యవహరించిన సీఎం రేవంత్...** కాంగ్రెస్ విజయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచారం వరకు దగ్గరుండి పర్యవేక్షించారు. మైనార్టీల్లో మరింత పట్టుకోసం పోలింగ్‌కు కొద్దిరోజుల ముందే అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టారు. డివిజన్ల వారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించి సమన్వయం చేశారు. క్షేత్రస్థాయిలో నేతలు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి శ్రేణుల్లో జోష్ నింపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేలా సీఎం చర్యలు చేపట్టారు.

**ఓటములనే మెట్లుగా చేసుకుని..** 2009లో యూసుఫ్‌గూడ డివిజన్ ఎంఐఎం పార్టీ నుంచి కార్పొరేటర్‌గా నిలిచి తెదేపా అభ్యర్థి మురళీగౌడ్ చేతిలో ఓటమిపాలయ్యారు. 2014లో ఎంఐఎం తరఫున జూబ్లీహిల్స్ నియోజకవర్గం పోటీ చేసి 41,656 ఓట్లు(25.19%) సాధించి రెండో స్థానంలో నిలిచారు. 2015లో ఎంఐఎం అభ్యర్థిగా రహ్మత్‌నగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్ పోటీచేసి ఓడిపోయారు. 2018లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 18,817 ఓట్లు సాధించారు. 2023 నవంబరు 15న అప్పటి పీసీసీ అధ్యక్షుడైన రేవంత్‌రెడ్డి సమక్షంలో నవీన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

**పేరు: వల్లాల నవీన్‌యాదవ్**
**తండ్రి పేరు: వి.చిన్నశ్రీశైలంయాదవ్**
**పుట్టిన తేదీ: 17-11-1983 (42 సంవత్సరాలు)**
**భార్య: వర్షయాదవ్..**
**కుమారుడు: అన్ష్‌యాదవ్**
**విద్యార్హతలు: బీ.ఆర్క్ (ఆర్కిటెక్చర్)**
**వృత్తి: ఆర్కిటెక్ట్, స్థిరాస్తి వ్యాపారం**
**స్వస్థలం: యూసుఫ్‌గూడ, హైదరాబాద్**
**నవ యువ ఫౌండేషన్‌ను స్థాపించి నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.**




## తెలంగాణలో ఎముకలు కొరికే చలి..

హైదరాబాద్ : చలికి జనం వణికిపోతున్నారు. తెలంగాణలో చలి తీవ్రత తారాస్థాయికి చేరుతోంది. నిన్నటి నుంచి ఉష్ణోగ్రతలు మరింత పడిపోతున్నాయి. ఐఎండీ ప్రకారం నవంబర్ 17 వరకు చలి తీవ్రత ఎక్కువగా కొనసాగే అవకాశం ఉంది. తెలంగాణ వ్యాప్తంగా ఈ సీజన్‌లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా రాత్రి ఉష్ణోగ్రతలలో తగ్గుదల ఎక్కువగా ఉంటుందని, నవంబర్ 18 వరకూ చలిగాలులు ఎక్కువగా వీస్తాయని కూడా వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. సిర్పూర్ ప్రాంతంలో 10.2 డిగ్రీల అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్ 11.1 డిగ్రీల వద్ద ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ సగటు కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా పడిపోయాయి. అటు, రాజధాని హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు 13 డిగ్రీల నుంచి 15 డిగ్రీల మధ్య ఉంటున్నాయి. శేరిలింగంపల్లిలో అతి తక్కువగా 13.2డిగ్రీలు, సికింద్రాబాద్‌లో 14.8 డిగ్రీలు ఉన్నాయి.

ఉత్తరాది నుండి కొనసాగుతున్న పొడి గాలులు, క్లియర్ స్కై, రాత్రిపూట చలి తీవ్రతకు కారణమవుతున్నాయని ఐఎండీ అధికారులు అంటున్నారు. వచ్చే నాలుగు రోజుల్లో తెలంగాణలో కనిష్ట ఉష్ణోగ్రతలు 8%-%10 డిగ్రీలకి పడిపోవచ్చని, హైదరాబాద్‌లో నవంబర్ 14 నుంచి 18 మధ్య పశ్చిమ, ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో 11 డిగ్రీల నుంచి 13 డిగ్రీల మధ్య అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెబుతున్నారు. ప్రజలు ముందుగా పలు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# పెట్టుబడులకు నిలయంగా మారనున్న తెలంగాణ

## డిసెంబర్ 8,9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025

హైదరాబాద్, నవంబర్ 14: డిసెంబర్ 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నిర్వహించబోతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ సమ్మిట్ గురించి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, డీజీపీ శివధర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని పలు అంశాల మీద చర్చించారు.




సమీక్షలో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏమన్నారంటే.. 'ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా Telanaga Rising Global Summit - 2025 నిర్వహించుకుంటున్నాం. డిసెంబర్ 8న ప్రజా ప్రభుత్వ రెండో వార్షికోత్సవం వైభవంగా నిర్వహించాలి. డిసెంబర్ 9 న Telanga Rising-2047 పాలసీ డాక్యుమెంట్ ను ఆవిష్కరించుకోబోతున్నాం. తెలంగాణ భవిష్యత్ కు రోడ్ మ్యాప్ రూపొందించుకోబోతున్నాం. పాలసీ ఆధారంగానే భవిష్యత్ నిర్ణయాలను తీసుకునేందుకు వీలుంటుంది. పాలసీ డాక్యుమెంట్ తో పెట్టుబడిదారులకు ఒక స్పష్టత వస్తుంది. శాఖల వారీగా పాలసీలకు సంబంధించి సమ్మిట్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి.

ఈ నెలాఖరులోగా శాఖల వారీగా పాలసీ డాక్యుమెంట్ సిద్ధం చేయాలి. ఈ గ్లోబల్ సమ్మిట్ కు వివిధ దేశాల ప్రతినిధులను ఆహ్వానించండి. వివిధ దేశాల ప్రతినిధులు వస్తున్న నేపథ్యంలో సెక్యూరిటీ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# బిహార్‌లో 'మోదీ టీం' విజయ దుందుభి..



## రాకెట్‌లా దూసుకుపోవడానికి కారణాలు ఇవే..

## కొత్త ట్రెండు సృష్టించిందిగా.. ఇకపై..

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ అంచనాలకు మించి సీట్లు రాబట్టింది. ఎప్పటిలాగే బిహార్‌లో కీలకమైన పలు అంశాలు ఎన్డీఏ విజయానికి బలమైన కారణాలుగా నిలిచాయి.

అంచనాలకు మించి రాణించడానికి మాత్రం ఎన్డీఏ అమలు చేసిన మరికొన్ని ట్రెండ్ సెట్టింగ్ వ్యూహాలే కారణం.

**కుల సమీకరణాలే గెలుపు పాచికలు..** బిహార్‌లో ఎన్నో దశాబ్దాలుగా కుల సమీకరణాలే గెలుపు పాచికలుగా ఉంటున్నాయి. ఎన్డీఏ గెలుపునకు పైకులాలు, ఈబీసీలు, కొన్ని ప్రాంతాల్లోని ఓబీసీ ఓటర్లే ప్రధాన కారణం. వెనుకబడిన వర్గాలే లక్ష్యంగా ఎన్డీఏ అమలు చేస్తున్న పథకాలు, అనేక ప్రాంతాల్లో ప్రాతినిధిత్వం వల్ల ఈ సామాజిక వర్గానికి చెందిన వారు ఈ కూటమి పట్ల ఆకర్షితులవుతున్నారు.

**నితీశ్ కుమార్ పరిపాలన...** పల్టీ రామ్‌గా పేరు తెచ్చుకున్నప్పటికీ సీఎం నితీశ్ కుమార్‌కు పలు విషయాల్లో మంచి పేరు ఉంది. రహదారుల అభివృద్ధి, చట్ట వ్యవస్థను మెరురుపర్చడం, గ్రామాల విద్యుద్దీకరణ, అమ్మాయిల చదువుకు ప్రోత్సాహం, గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేసిన పథకాలు నితీశ్ కుమార్ వైపునకు ఓటర్లను మర్లేలా చేశాయి. మహిళలు, మొదటిసారి ఓట్లు వేస్తున్నవారు నితీశ్ కుమార్ వైపే మొగ్గుచూపుతారు.

**మోదీ ప్రభావం, కేంద్ర పథకాలు..** ప్రధానమంత్రి మోదీకి వ్యక్తిగతంగా ఉన్న ఆదరణ కూడా బిహార్‌లో ఎన్డీఏ గెలుపునకు బాటలు వేశాయి. పీఎం నివాస పథకం, ఉజ్వల, ఉచిత రేషన్, ఆయుష్మాన్ భారత్ వంటివి అత్యంత పేద కుటుంబాలకు ఎంతో మేలు చేశాయి.

**ద్రవ్యోల్బణం, ఉద్యోగ సంక్షోభ సమయంలో..** ద్రవ్యోల్బణం, ఉద్యోగ సంక్షోభ సమయంలో బిహార్‌లోని డబుల్ ఇంజన్ సర్కారు కీలక నిర్ణయాలు తీసుకుంది.

ఉచిత రేషన్, నగదు బదిలీలు, సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు, మహిళలు, కూలీలు, వలస కార్మికులకు బాగా ఉపయోగపడ్డాయి.

**ప్రతిపక్ష ఓటు చీల్చి..** మహాఘట్‌బంధన్‌లో ఉన్న అంతర్గత విభేదాలు, నాయకత్వ గందరగోళం, సీట్ల సర్దుబాటు వివాదాలు ఉన్నాయి. అలాగే, ముస్లిం-యాదవ, కుర్మీ-కొయరీ ప్రాంతాల్లో ప్రతిపక్ష ఓటు చీలిపోయింది. దీన్ని ఎన్డీఏ లాభంగా మార్చుకుంది.

**బలమైన బూత్ స్థాయి వ్యవస్థ...** జేడీయూ, బీజేపీకి సమగ్ర బూత్ కమిటీలు ఉన్నాయి. డిజిటల్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు బాగా ఉండడంతో తమవైపు మొగ్గుచూపే ఓటర్లను పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు రాబట్టాయి. దీనివల్ల సాధారణంగా ఎన్డీఏకి 3-5 శాతం అదనంగా ఓట్ల లాభం వస్తుంది.

**అభివృద్ధి, మహిళా ఓటర్ల కీలక పాత్ర...** ఎన్నికల్లో ఎన్డీఏ తమ ప్రచారాన్ని అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సంక్షేమంపై కేంద్రీకరించింది. మద్యపాన నిషేధం, పంచాయతీల్లో నితీశ్ కుమార్ అమలు చేసిన మహిళా రిజర్వేషన్, అమ్మాయిలకు సైకిళ్లు వంటివి అన్ని కులాల్లో మహిళా ఓటర్లను ఆకర్షించాయి. బిహార్‌లో మహిళా ఓటర్ల హాజరు ఎప్పుడూ ఎక్కువగా ఉంటుంది. ఇది ఎన్డీఏకే ప్రయోజనం.

**నాయకత్వంపై నమ్మకం...** ఉద్యోగాలు, పోటీ పరీక్షల నిర్వహణ తీరుపై యువత అసంతృప్తి ఉన్నా, చాలా మంది ఎన్డీఏ నాయకత్వంపై నమ్మకంతో ఉన్నారు. జాతీయ భద్రత, కేంద్ర నాయకత్వ బలం ప్రభావం యువతపై సానుకూలంగా పడింది.

**సమర్థవంతమైన ఎన్నికల వ్యూహం...** ఎన్డీఏ ప్రచారంలో భాగంగా భారీ సభలు, కులాలవారీగా చేరికలు, కీలక జిల్లాల్లో మోదీ సభలు, పోలింగ్‌కు చివరి వారాల్లో చాలా వేగంగా ర్యాలీలు ఇవన్నీ ఓటర్లను ఆకర్షించాయి.




దిల్లీ: బిహార్ ప్రజలు ఎన్డీయేకు ప్రచండ విజయం అందించారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఫిర్ ఏక్ బార్.. ఎన్డీయే సర్కార్ అంటూ నినదిస్తూ మరోసారి అభివృద్ధికే పట్టం కట్టారన్నారు. ఈ సందర్భంగా జయప్రకాశ్ నారాయణ్, కర్పూరి ఠాకూర్‌కు నివాళు లర్పించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభంజనం సృష్టించిన నేపథ్యంలో దిల్లీలోని భాజపా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విజయోత్సవ సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ విజయం బిహార్‌ను కొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు తమలో ఉత్సాహాన్ని నింపిందన్నారు. కొన్ని పార్టీలు 'ముస్లిం-యాదవ్-%వీ%' అనే బుజ్జగింపు సూత్రాన్ని రూపొందించినప్పటికీ.. తమ అపూర్వ విజయాన్ని మహిళలు, యువత అనే కొత్త '%వీ%' కలయిక సుస్థిరం చేసిందన్నారు. బిహార్‌లో విజయం కోసం అద్భుతంగా కృషిచేసిన ఎన్డీయే నేతలు, సీఎం నీతీశ్ కుమార్ నాయకత్వాన్ని ప్రధాని అభినందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు.

**తర్వాతి టార్గెట్ బెంగాల్!...** ' మరోసారి జంగల్ రాజ్ రావొద్దని యువత నిర్ణయించుకున్నారు. బిహార్ అసెంబ్లీ విజయం.. భారత ప్రజాస్వామ్య విజయం. గతంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల వరకే పోలింగ్ జరిగేది. ఈసారి ఎలాంటి ఘర్షణలు జరగకుండా జరిగాయి. గతంలో 1500 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరిగేది.. కానీ ఈసారి ఒక్క చోట కూడా ఆ అవసరం రాలేదు. గంగానది బిహార్ నుంచి బెంగాల్‌కు ప్రవహిస్తుంది. పశ్చిమ బెంగాల్‌లో భాజపా విజయానికి బిహార్ విజయం మార్గం సుగమం చేసింది. బెంగాల్ నుంచి జంగల్ రాజ్‌ను తొలగిస్తాం. బిహార్ తన యువతకు కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాలు అందించడం ద్వారా ప్రపంచానికి తన శక్తిని నిరూపించుకుంటుంది. కాంగ్రెస్ పార్టీ ఒక పరాన్న జీవి ఆ పార్టీ మిత్ర పక్షాలను హెచ్చరించాను. కాంగ్రెస్‌కు దేశం పట్ల సానుకూల విజన్ లేదు. అదొక 'ముస్లింలీగ్ మావోయిస్టు కాంగ్రెస్‌లా మారింది. ఛఠ్ పూజ గొప్ప సంప్రదాయానికి యునెస్కో గుర్తింపు తీసుకొచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుంది. ఎన్నికల్లో రికార్డు స్థాయిలో ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్యం, ఎన్నికల కమిషన్‌పై విశ్వాసం ఉంచినందుకు ప్రజలకు అభినందనలు.

**'జంగల్‌రాజ్'కు బిహార్ నో ఎంట్రీ బోర్డు: నడ్డా...** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధికి ఓటు వేశారని భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి అపూర్వ విజయాన్ని అందిస్తూ ఇచ్చిన తమ తీర్పుతో 'జంగల్ రాజ్'కు బిహార్‌లో ప్రవేశం లేదనే బోర్డు పెట్టారన్నారు. హరియాణా, మహారాష్ట్ర, దిల్లీ.. ఇప్పుడు బిహార్ వంటి వరుస ఎన్నికల్లో ప్రజలు ప్రధాని మోదీపై అచంచలమైన విశ్వాసాన్ని చూపించారని ప్రశంసించారు. గతంలో చేసిన తప్పులను మళ్లీ చేయకూడదని ప్రజలు నిశ్చయించుకున్నారని.. అందుకే వరుస ఎన్నికల్లో భాజపాకు ఓటు వేస్తున్నారన్నారు. ఇండి కూటమి సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ రాఘోపూర్ సీటులో భాజపా అభ్యర్థిపై కేవలం 14,532 ఓట్ల తేడాతోనే విజయం సాధించారన్నారు. డబుల్ ఇంజిన్ పాలన, సీఎం నీతీశ్ కుమార్ సుపరిపాలనకు అనుకూలంగా బిహార్ తీర్పు స్పష్టమైన సందేశమని పేర్కొన్నారు. విపక్షాలు విభజన, బుజ్జగింపు రాజకీయాలకు ప్రయత్నించినా.. ప్రజలు వారికి తగిన బుద్ధి చెప్పారన్నారు. అన్ని వర్గాల ప్రజలూ ఎన్డీయేకు ఓటేశారని.. ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో తమకు ఓటు వేసినట్లు తెలిపారు. విపక్షాలు బిహార్ ప్రజలను, ఛఠ్ సంప్రదాయాన్ని అవమానించాయని అందుకే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఈ సభలో మోదీని నేతలు గజమాలతో సత్కరించారు. ఈ సభలో కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు.




నిజామాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. 25 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో ఆ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ జయకేతనం ఎగరవేశారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. "జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారు. ఈ విజయం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అంకితం. జూబ్లీహిల్స్ తీర్పుతో ప్రజలు BRS పార్టీకి సెలవు ప్రకటించారు. రాష్ట్రంలో ఆ పార్టీకి చోటులేదని మరోసారి రుజువైంది. రానున్న రోజుల్లోనూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన కొనసాగుతుంది. నవీన్‌ను గెలిపించిన ఘనత.. సీఎం, మంత్రులు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తది" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.




## ఫలితాలు నిరుత్సాహ పరిచాయి.. ప్రతిపక్ష పాత్ర బలంగా పోషిస్తాం: కేటీఆర్

హైదరాబాద్: 'రాజకీయాల్లో గెలుపోటములు సహజం. ముందుకు పోదాం, కార్యకర్తలు సన్నద్ధం కావాలి. మరింత బలంగా పనిచేద్దాం. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే వరకూ శ్రమిద్దాం' అని అన్నారు భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై సుమారు 25వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.

ఈ సందర్భంగా కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు. ఈ ఉప ఎన్నిక పార్టీకి కొత్త ఉత్సాహాన్ని, బలాన్ని ఇచ్చిందని రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయం BRS మాత్రమేనని ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు. ఇకపైనా ప్రజా సమస్యలపై తమ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**ఈ ఉప ఎన్నికలో నిజాయతీగా కొట్లాడాం..** "వ్యక్తిగత సమస్యలు ఉన్నా, పార్టీ నాయకులు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో విజయం కోసం నిర్విరామంగా పనిచేశారు. వారికి పేరు పేరునా ధన్యవాదాలు. ప్రతి బూత్‌లో స్థానిక నాయకత్వం బాగా పనిచేసింది. మాగంటి సునీతకు రాజకీయ అనుభవం లేకపోయినా ఆమె ఎంతో కష్టపడ్డారు. ఒక రకంగా పోరాటమే చేశారు. గత రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ అద్భుతమైన పాత్ర పోషిస్తోంది. ప్రజా సమస్యలు కేంద్రంగా కొట్లాడుతున్నాం. ఈ ఎన్నికల్లో మాకు ఓటు వేసిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు. అటు ప్రజాక్షేత్రం, ఇటు సోషల్‌మీడియాలోనూ మేము పనిచేస్తున్నాం. ఈ ఉప ఎన్నికలో నిజాయతీగా కొట్లాడాం. ఎన్నికలు ఎలా జరిగాయో అందరికీ తెలుసు. వాటి గురించి నేను మాట్లాడను. ప్రచారం ముగిసే వరకూ ఒకరకంగా.. ముగిశాక మరో రకంగా జరిగాయి"

**అప్పుడు కాంగ్రెస్ ఒక్క సీటు గెలవలేదు...** "2014-23 మధ్య ఏడు ఉప ఎన్నికలు జరిగాయి. అప్పటి ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ ఒక్క ఉప ఎన్నికలోనూ గెలవలేదు. మేము ఐదు గెలిచాం. రెండింటిలో ఓడిపోయాం. జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తే కూడా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఒకట్రెండు కార్పొరేట్ సీట్లు మాత్రమే వచ్చాయి. ఈ ఎన్నికల్లో ప్రజల తరఫున వాదనను బలంగా వినిపించగలిగాం. ప్రజా సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాం. కుల, మత రాజకీయాలు, అసభ్య పదజాలం ఉపయోగించలేదు. చాలా హుందాగా పోరాటం చేశాం. ప్రజలకు అవసరమైన పాయింట్లు మాత్రమే చర్చకు పెట్టాం. కాంగ్రెస్, భాజపా ఎన్ని రకాలుగా కవ్వించే ప్రయత్నం చేసినా సంయమనం పాటించాం. పదేళ్ల ప్రభుత్వం నడిపిన ఒక జవాబుదారీ పార్టీగా జూబ్లీహిల్స్‌కు ఏం చేశారంటే. రూ. 5వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశాం"

**ఇదొక చిన్న సెట్ బ్యాక్ మాత్రమే..** "జాతీయ స్థాయిలో చూస్తే బిహార్‌లో కాంగ్రెస్ ఉనికి కోల్పోయే పరిస్థితి వచ్చింది. ఈ ఎన్నిక భారత రాష్ట్ర సమితికి చిన్న సెట్ బ్యాక్ మాత్రమే. ఫలితాలను సమీక్షించుకుంటాం. ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలు పెట్టినా దీటుగా ఎదుర్కొని మంచి ఓటింగ్ సాధించాం. ఒక పార్టీ డిపాజిట్ కోల్పోయే పరిస్థితి వచ్చింది. దొంగ ఓట్ల గురించి స్పష్టమైన ఆధారాలు ఇచ్చాం. పోలింగ్ రోజు మా అభ్యర్థి పట్టుకున్నారు.

ఎన్నికల కమిషన్, పోలీసులు సమాధానం చెప్పాలి. ఓటమికి సాకులు వెతకడం లేదు. చర్చ జరగాలని కోరుకుంటున్నాం. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయమై బెంగాల్‌లో హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. రాష్ట్రంలో కూడా పది చోట్ల ఉపఎన్నికలు రావాల్సిందే. ఒక్క ఉప ఎన్నికకే కాంగ్రెస్ ఇన్ని ఆపసోపాలు పడింది. పది చోట్ల ఉపఎన్నికలు జరిగితే సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలను తీసుకొస్తారేమో" అని కేటీఆర్ అన్నారు.




## జూబ్లీహిల్స్ విజయం మా బాధ్యతను మరింత పెంచింది: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత హైదరాబాద్ ప్రజల్లో కాంగ్రెస్‌పై నమ్మకం పెరుగుతోందన్నారు. జూబ్లీహిల్స్‌లో విజయం అందించిన ప్రజలకు ఈ సందర్భంగా సీఎం ధన్యవాదాలు తెలిపారు. నవీన్ యాదవ్ విజయం కోసం కృషి చేసిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు సరైన ఫలితాలు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనను ప్రజలు నిశితంగా పరిశీలించి తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు.

**రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రులు కలిసి రావాలి..** "2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39శాతం ఓట్లు వచ్చాయి. 6 నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మాకు ఓట్లశాతం 42కు పెరిగింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు 51శాతం ఓట్లను ప్రజలు ఇచ్చారు. సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించారు. గెలుపోటములకు కాంగ్రెస్ పొంగిపోదు, కుంగిపోదు. ప్రజల తరఫున నిలబడటం, పోరాడటమే కాంగ్రెస్ కర్తవ్యం. రాష్ట్ర ఆదాయంలో 65శాతం వరకు హైదరాబాద్ నుంచే వస్తోంది. నగరానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా మరింత అభివృద్ధి చేస్తాం. హైదరాబాద్‌ను సమస్యల రహిత నగరంగా తీర్చి దిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. కేంద్రం నుంచి నిధులు రాకుండా కిషన్‌రెడ్డి సహాయ నిరాకరణ చేస్తున్నారు. మెట్రో, మూసీ ప్రక్షాళన సహా అనేక ప్రాజెక్టులకు అనుమతులను అడ్డుకుంటున్నారు. కిషన్‌రెడ్డి ఎంపీ నియోజకవర్గంలోనే భాజపాకు బాగా ఓట్లు తగ్గాయి. భాజపా ఓట్లు 65వేల నుంచి 17 వేలకు ఎందుకు తగ్గాయో కిషన్‌రెడ్డి ఆలోచించాలి. ఆయన వ్యవహార శైలిని ప్రజలు గమనించారు. భూ కంపానికి ముందు వచ్చే ప్రకంపనగా జూబ్లీహిల్స్ ఫలితాన్ని చూడాలి. తీరు మారకుంటే భూకంపం వంటి ఫలితాలు భాజపాకి వస్తాయి. రాజకీయాలు మాని.. రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రులు కలిసి రావాలి. రాష్ట్ర ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చే బాధ్యత కేంద్రమంత్రులు, భాజపా ఎంపీలపై ఉంది.

**కేటీఆర్.. అహంకారం తగ్గించుకోవాలి..** అసూయ తగ్గించుకోవాలని ప్రతిపక్ష నేతకు సూచిస్తున్నా. అధికారం పోయినా.. కేటీఆర్‌లో అహంకారం, అసూయ పోలేదు. పదవులు ఎవరికీ శాశ్వతం కావు. కేటీఆర్ తన అహంకారాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది. మనం ఇంకా చాలా ఏళ్లు రాజకీయాలు చేయాల్సి ఉంది. ఫేక్ న్యూస్ రాయించి.. ఫేక్ సర్వేలు చేయించుకొని భ్రమలో బతకొద్దు. భారత రాష్ట్ర సమితి ఓడిపోతుంది.. భాజపాకు డిపాజిట్ రాదని ముందే చెప్పా. జూబ్లీహిల్స్‌లో మాకు మద్దతు ఇచ్చిన ఎంఐఎంకు ధన్యవాదాలు. అసదుద్దీన్ ఒవైసీకి కాంగ్రెస్ కార్యకర్తల పక్షాన ధన్యవాదాలు. ఆయా రాష్ట్రాల పరిస్థితులను బట్టి పొత్తులు, మద్దతు ఉంటుంది. బిహార్ ఫలితాలను ఇంకా నేను సమీక్షించలేదు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఈనెల 17న జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. కేసీఆర్ ప్రస్తుతం క్రియాశీల రాజకీయాల్లో లేరు, ఆయన ఆరోగ్యం కూడా అంతగా సహకరించడం లేదు. కేసీఆర్ గురించి ఇప్పుడు స్పందించాల్సిన అవసరం లేదు. వచ్చే పదేళ్లపాటు కాంగ్రెస్ పాలిస్తుంది.. మార్పు చేసి చూపిస్తాం" అని సీఎం అన్నారు. సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పాల్గొన్నారు.




## తెలంగాణ పోలీసు శాఖలో 60 పోస్టులకు నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్: తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీలో 60 పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయింది. సైంటిఫిక్ ఆఫీసర్స్, సైంటిఫిక్ అసిస్టెంట్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, ల్యాబ్ అసిస్టెంట్స్ పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది. ఈనెల 27 నుంచి డిసెంబరు 15 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. నోటిఫికేషన్ పూర్తి వివరాల కోసం https://www.tgprb.inలో చూడాలని అధికారులు తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం.. కవిత ఆసక్తికర పోస్టు

హైదరాబాద్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ఫలితం వెలువడిన తర్వాత తెలంగాణ జాగృతి సంస్థ అధ్యక్షురాలు కవిత ఎక్స్‌లో పెట్టిన పోస్టు ఆసక్తికరంగా మారింది. " కర్మ హిట్స్ బ్యాక్" అంటూ ఆమె ట్వీట్ చేశారు. ఇవాళ వెలువడిన జూబ్లీహిల్స్ ఫలితాల్లో భారత రాష్ట్ర సమితి ఓటమి చవి చూసిన సంగతి తెలిసిందే. ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు 98,988 ఓట్లు, భారత రాష్ట్రసమితి అభ్యర్థి మాగంటి సునీతకు 74,259 ఓట్లు, భాజపా అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి 17,061 ఓట్లు పోలయ్యాయి.




## నాపై దుష్ప్రచారాన్ని ప్రజలు ఓటుతో తిప్పికొట్టారు: నవీన్ యాదవ్

హైదరాబాద్: భారీ మెజార్టీతో గెలిపించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. 24,729 ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన ఆయనకు రిటర్నింగ్ అధికారి ధ్రువీకరణ పత్రం అందజేశారు. అనంతరం నవీన్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. " నా విజయం కోసం కృషి చేసిన కాంగ్రెస్ అధిష్ఠానం, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, సీనియర్ నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు. ప్రజలు నాపై నమ్మకంతో ఓట్లు వేశారు. ఈ రోజుతో ఎన్నికలు ముగిశాయి. అందరం కలిసి మన ప్రాంత అభివృద్ధి కోసం పనిచేద్దాం. భారత రాష్ట్రసమితి నేతలు నాపై తప్పుడు ఆరోపణలు చేశారు. ఆ పార్టీ చేసిందేమీ లేకనే ప్రచారంలో చెప్పుకోలేదు. కేవలం నా గురించి దుష్ప్రచారం చేసి గెలవాలని BRS చూసింది. అన్ని దుష్ప్రచారాలను ప్రజలు ఓటుతో తిప్పికొట్టారు. బెదిరిస్తే ప్రజలు ఓటు వేసే రోజులు ఎప్పుడో పోయాయి. నన్ను నమ్మి ఓట్లు వేసిన ప్రజలందరికీ ధన్యవాదాలు. నియోజకవర్గ సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తా" అని తెలిపారు.



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు 98,988 ఓట్లు, భారత రాష్ట్రసమితి అభ్యర్థి మాగంటి సునీతకు 74,259 ఓట్లు, భాజపా అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి 17,061 ఓట్లు పోలయ్యాయి.

## నేడు బిహార్.. రేపు బెంగాల్: బండి సంజయ్

హైదరాబాద్, నవంబర్ 07: నేడు బిహార్‌లో విజయం సాధించామని.. రేపు పశ్చిమ బెంగాల్‌లో సైతం బీజేపీ విజయం సాధిస్తుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలపై శుక్రవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావుతో కలిసి బండి సంజయ్ విలేకర్లతో మాట్లాడారు. బిహార్‌లో స్వాతహాగా బీజేపీ 92 స్థానాల్లో గెలిచిందన్నారు. ఇక బిహార్‌లో కాంగ్రెస్ పార్టీ ఉప ప్రాంతీయ పార్టీగా మారిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పని అయిపోయిందని.. ఇక ఆయన పబ్జి ఆడుకోవాలంటూ వ్యంగ్యంగా పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుపై మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో గెలిచింది ఎంఐఎం అభ్యర్థి అని చెప్పారు. తెలంగాణలో హిందూ సమాజం ఒక్కటి కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఇక తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ప్రతిపక్ష నేత ఎవరు అంటూ సందేహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రధాన ప్రతిపక్ష నేత ఎలా అవుతారంటూ కేసీఆర్‌ను పరోక్షంగా విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ రాకపోయినా వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఖచ్చితంగా గెలుస్తుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి జరగాలంటే బీజేపీని గెలిపించాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన సూచించారు.



## రాహుల్ గాంధీ ఏ 95 ఓటములు..అవార్డులన్నీ ఆయనకే: భాజపా సెటైర్లు

బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. ఇందులో అధికార ఎన్డీయే కూటమి మ్యాజిక్ ఫిగర్ (122)ను దాటేసి, 192 స్థానాల్లో ముందంజలో ఉంది. ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్ కూటమి వెనుకంజలో ఉండడంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై భాజపా నేతలు సెటైర్లు వేస్తున్నారు.

గత రెండు దశాబ్దాలలో జరిగిన ఎన్నికల్లో రాహుల్ గాంధీ 95 సార్లు ఓడిపోయారని భాజపా నేత అమిత్ మాలవీయ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలో రాహుల్ గాంధీ కీలక స్థానాన్ని చేపట్టినప్పటినుంచి ఇప్పటివరకు వివిధ రాష్ట్రాలలోని ఎన్నికల్లో ఆ పార్టీ 95 సార్లు ఓడిపోయినట్లు సూచిస్తున్న మ్యాప్‌ను కూడా మాలవీయ సోషల్ మీడియాలో షేర్ చేశారు. 2004 నుంచి 2025 వరకు జరిగిన వివిధ ఎన్నికల్లో రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ అనేకసార్లు విఫలమయ్యిందని.. ఇది 'రాహుల్ గాంధీకి మరో ఎన్నిక, మరో ఓటమని మాలవీయ అన్నారు. బిహార్‌లో తాజాగా ఎదురైన ఓటమితో రాహుల్ 95 సార్లు ఓడిన రికార్డును నెలకొల్పారని పేర్కొన్నారు. ఎన్నికల ఓటముల్లో స్థిరత్వానికి అవార్డులు ఉంటే, అవన్నీ ఆయనకే దక్కేవని.. రాహుల్ పరాజయాలను చూసి ఓటమి కూడా ఆశ్చర్యపోక తప్పదని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం వెలువడుతోన్న ఫలితాల సరళి ప్రకారం.. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి దూసుకెళ్తోంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు తగ్గట్టుగానే జోరు చూపిస్తోంది.

ఆధిక్యంలో మ్యాజిక్ ఫిగర్ (122)ను దాటేసి, 192 స్థానాల్లో ముందంజలో ఉంది. మరోవైపు మహాగఠ్ బంధన్ కూటమి 46 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఎన్డీయేలోని కీలక పార్టీలైన భాజపా 80కి పైగా, జేడీయూ 70కి పైగా స్థానాల్లో ఆధిక్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. విపక్ష కూటమి మహాగఠ్‌బంధన్‌లో ప్రధాన పార్టీ ఆర్జేడీ 32 సీట్లలో ముందంజలో ఉండగా కాంగ్రెస్ కేవలం మూడు స్థానాల్లో మాత్రమే ఆధిక్యంలో ఉంది. బిహార్‌లో మొత్తంగా 243 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.

చురకలు

శనివారం 15 నవంబర్ 2025

# ట్రెండ్ సెట్టర్ ఘట్టమనేని కృష్ణ - నవంబర్ 15... ఆంధ్రా జేమ్స్ బాండ్ వర్ధంతి



తెలుగు జాతి గర్వించదగ్గ గొప్ప నటుడు కృష్ణ. నిజానికి తెలుగు చిత్రసీమలో ఆయన ఒక ట్రెండ్ సెట్టర్. నట శేఖరునిగా, సూపర్ స్టార్ గా స్వయం కృషితో తెలుగు సినీ ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని దక్కించుకున్న గొప్పతనం ఆయనది. ఎన్టీఆర్ లాగా పౌరాణికాల, ఏ ఎన్ ఆర్ లాగా సాంఘికాల, కాంతారావు లాగా జానపదాల, శోభన్ బాబు లాగా కుటుంబ కథా భరితమైన, ఉదాత్తమైన వ్యక్తిత్వం కలిగిన పాత్రలలో నటించకున్నా, చిరంజీవి లాగా నృత్యం చేయ లేక పోయినా, ఇవన్నీ పక్కన పెట్టి, మాస్ ఓరియంటెడ్, ఎంటర్టైనర్ కౌబాయ్ జేమ్స్ బాండ్ చిత్రాలలో నటించి, యువతను థియేటర్ బాట పట్టించి, ఎందరికో రోల్ మోడల్ గా నిలిచిన అసాధ్యుడు కృష్ణ. కృష్ణ సాధించింది మామూలు స్టార్ డమ్ కానే కాదు. ఒక సమయంలో ఊరూరా కృష్ణకు రికార్డు స్థాయిలో 2500 అభిమాన సంఘాలు ఉండేవి అంటే అది సామాన్య విషయం కాదు. సినీ పరిశ్రమలోని 24 క్రాఫ్ట్ పై పట్టు ఉన్న కృష్ణ తెలుగు చిత్ర పరిశ్రమలో చేయని ప్రయోగం లేదు. తెలుగు వెండి తెరకు సరికొత్త ఒరవడులు దిద్దుతూ.. ఆయన పరిచయం చేయని కొత్త ప్రయోగం అంటే అతిశయోక్తి కాదు. కృష్ణ (ఘట్టమనేని శివరామ కృష్ణ మూర్తి) తెలుగు సినిమా నటుడు, దర్శకుడు, నిర్మాత. 1942 మే 31 న గుంటూరు జిల్లా, తెనాలి మండలం తెనాలి పట్టణానికి 4 కిలోమీటర్ల దూరంలోని బుర్రిపాలెం గ్రామస్తులైన ఘట్టమనేని వీర రాఘవయ్య చౌదరి, నాగరత్న దంపతుల పెద్ద కొడుకుగా జన్మించాడు. 1964లో ప్రముఖ దర్శక నిర్మాత ఆదుర్తి సుబ్బారావు అందరూ కొత్తవాళ్ళతో తాను తీస్తున్న తేనె మనసులు కోసం కొత్త నటులు కావాలని ఇచ్చిన పత్రికా ప్రకటనకు తన ఫోటోలు పంపించి, పలు వడపోతల తర్వాత ఆదుర్తి సుబ్బారావు ద్వారా కృష్ణన ఇద్దరు కథా నాయకుల్లో ఒకడిగా ఎంపిక కాబడినాడు. అలా తెలుగు చిత్రసీమలో అడుగు పెట్టిన కృష్ణ నట జీవితం ఉదయం, మధ్యాహ్నం మాత్రమే కాక మూడవ షిఫ్ట్ రాత్రి పది గంటల నుంచి తెల్లవారు జామున 2 గంటల వరకు ఉండేది. చివరికి నిద్ర పోతున్న సమయంలో కాస్ట్యూమ్స్ వేసుకుని పడుకుంటే నిద్రిస్తున్న సన్నివేశాలు చిత్రీకరిం చుకున్న సందర్భాలు ఉన్నాయి. 1968లో కృష్ణ నటించిన 10 సినిమాలు, 1969లో రికార్డు స్థాయిలో 19 సినిమాలు, 1970లో 16 సినిమాలు, 1971లో 11 సినిమాలు, 1972లో 18 సినిమాలు, 1973లో 15 సినిమాలు, 1974లో 13 సినిమాలు, 1975లో 8 సినిమాలు విడుదల కావడం గమనార్హం. 1972లో ఒకే ఏడాది 17 సినిమాలను విడుదల చేసి రికార్డు సృష్టించాడు. ప్రపంచం లో మరే సినీ నటుడికీ ఇలాంటి రికార్డు లేదు. తెలుగులో "తొలి జేమ్స్ బాండ్ సినిమా" (గూఢచారి 116), తొలి "కౌబాయ్ సినిమా" (మోసగాళ్ళకు మోస గాడు), తొలి "ఫుల్ స్కోప్ సినిమా" (అల్లూరి సీతారామ రాజు), "తొలి 70 ఎంఎం సినిమా" (సింహాసనం) వంటివి సూపర్ స్టార్ కృష్ణ సినిమాలే. తెలుగులో సాంకేతికం గానూ పలు తొలి తెలుగు సినిమాలు కృష్ణవే. కొల్లేటి కాపురంతో తెలుగులో ఆర్.ఓ. సాంకేతికత పరిచయం చేశాడు. మొదటి ఓఆర్‌డబ్ల్యు కలర్ సాంకేతిక తతో తీసిన సినిమా గూడుపు రాణి. తొలి తెలుగు ఫ్యూజీ కలర్ చిత్రం భలే దొంగలు. తెలుగులో 70 ఎంఎం సాంకేతికత ఉపయోగించిన తొలి సినిమా సింహాసనం. సింహాసనం సినిమా స్టీరియోఫోనిక్ 6 ట్రాక్ సాంకేతికతతో సౌండ్ టెక్నాలజీ వాడిన తొలి తెలుగు సినిమా. అల్లూరి సీతారామరాజు తెలుగులో ఫుల్‌స్కోప్ సినిమాల్లో మొదటిది. బాక్సాఫీస్ రికార్డుల పరంగా చూస్తే, మద్రాస్ నగరంలో వంద రోజులు పూర్తిచేసుకున్న తొలి తెలుగు చిత్రంగా చీకటి వెలుగులు, హైదరాబాద్ నగరంలో ఏడాది పాటు ఆడిన తొలి తెలుగు సినిమాగా అల్లూరి సీతారామరాజు నిలిచిపోయాయి. 1982లో భవనం వెంకట్రామ్ ప్రభుత్వం హైదరాబాద్లో పద్మాలయా సంస్థకు స్టూడియో నిర్మించు కోవడానికి జూబ్లీ హిల్స్ లో 10 ఎకరాల స్థలాన్ని ఇవ్వగా, 1983 నవంబరు 21న నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు చేతుల మీదుగా పద్మాలయా స్టూడియోస్ ప్రారంభింప చేసుకుని కృష్ణ స్టూడియో యజమాని అయ్యారు. స్వంత నిర్మాణ సంస్థ పద్మాలయా పిక్చర్స్ ద్వారా 1971లో తీసిన మోస గాళ్ళకు మోసగాడు మాత్రం భారీ విజయాన్ని, సాహసిగా కృష్ణకు పేరును తెచ్చి పెట్టింది. మోస గాళ్ళకు మోసగాడు సినిమా ఆంగ్లం లోకి ట్రెజర్ హంట్ పేరిట అనువాదమై 123 దేశాల్లో విడుదలైంది, మంచి విజయాన్ని సాధించింది. కృష్ణకు 1997లో ఫిల్మ్‌ఫేర్ సౌత్ జీవిత సాఫల్య పురస్కారం, 2003లో ఎన్టీఆర్ జాతీయ పుర స్కారం, 2008లో ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, 2009లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం వంటి గౌరవాలు లభించాయి. ఆస్ట్రేలియా ప్రభుత్వం కృష్ణను గౌరవిస్తూ ఓ పోస్టల్ స్టాంప్ కూడా విడుదల చేసింది. 1976లో కేంద్ర కార్మిక శాఖ మంత్రి కె.వి.రఘునాథ రెడ్డి చేతుల మీదుగా కృష్ణ "నటశేఖర" బిరుదును అందుకున్నారు. 1972లో జైఆంధ్ర ఉద్యమం జరిగినప్పుడు కృష్ణ ఆ ఉద్యమానికి బహిరంగంగా మద్దతు నిచ్చారు. 1984 అక్టోబరులో ఇందిరా గాంధీ దారుణహత్యకు గురైనప్పుడు కృష్ణ ఆమె అంత్యక్రియలకు ఢిల్లీ వెళ్ళి, రాజీవ్ గాంధీని కలవడం జరిగింది. అలా 1984లో కృష్ణ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1989లో కృష్ణ కాంగ్రెస్ తరఫున ఏలూరు లోక్‌సభ నియోజక వర్గం నుంచి పోటీచేసి విజయం సాధించారు. 2009 ఎన్నికల్లో వై.ఎస్.రాజశేఖర రెడ్డి కోరక మేరకు కాంగ్రెస్ పార్టీకి కృష్ణ కుటుంబం నైతిక మద్దతు అందించింది. కరువు బాధితుల సహాయ నిధికి సినిమా తారల యాత్ర పేరుతో 1972 అక్టోబరు 28 నుంచి నవంబరు 2 వరకు విజయవాడ, తెనాలి, గుంటూరు, రాజమండ్రి, హైదరాబాద్ లలో తోటి నటీనటులు, సాంకేతిక నిపుణులను కూడగట్టి కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చిన డబ్బు సహాయ నిధికి అందించారు. ప్రముఖ నటుడు, నిర్మాత, దర్శకుడు, పద్మాలయా స్టూడియో అధినేత, మాజీ ఎంపీ, సూపర్‌స్టార్ కృష్ణ (80) 2022 సంవత్సరం నవంబర్ 15న కార్డియాక్ అరెస్టుకు గురై, గచ్చిబౌలి లోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించబడి చికిత్స పొందుతూ తనువు చాలించి, ఆయన తుదిశ్వాస విడిచి, అశేష అభిమానులను శోక సంద్రంలో ముంచి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# వరుణ గ్రహాన్ని కనుగొన్న ఖగోళ శాస్త్రవేత్త విలియం హెర్షెల్

## నవంబర్ 15... ఫ్రెడెరిక్ విలియం హెర్షెల్ జయంతి



సర్ ఫ్రెడెరిక్ విలియం హెర్షెల్ (నవంబర్ 15, 1738 – ఆగష్టు 25, 1822) ఖగోళ శాస్త్రవేత్త. ఆధునిక పరికరాలు లేని కాలంలోనే అంతరిక్షంలోని అద్భుతాలను ఆవిష్కరించిన ఖగోళ శాస్త్రవేత్త సర్ ఫ్రెడెరిక్ విలియం హెర్షెల్. ఆయన వరుణ (యురేనస్) గ్రహాన్ని కనుక్కొన్నారు. మొదట మిలటరీ లోని బ్యాండు మేళంలో పనిచేసి, తన పరిశోధనలతో ప్రపంచంలోని మేటి ఖగోళ శాస్త్రవేత్తలలో ఒకరిగా ఎదిగారు. సర్ ఫ్రెడెరిక్ విలియం హెర్షెల్ తొమ్మిది గ్రహాలలో ఒకటైన యురేనస్‌తో పాటు దానికున్న రెండు ఉపగ్రహాలను, శని, గురు గ్రహాలకు చెందిన రెండేసి ఉపగ్రహాలను కనుక్కున్నారు. స్వయంగా రూపొందించుకున్న టెలిస్కోపుల తోనే ఆయన నక్షత్ర మండలాల (గెలాక్సీలు) ఆకారాలతో పాటు, విశ్వం స్వరూపాన్ని కూడా అంచనా వేయడం విశేషం. దాదాపు 2500 నక్షత్ర సముచ్ఛయా (నెబ్యులా)లను, వాటికి సంబంధించిన సిద్ధాంతాలను వెలువరించారు. నక్షత్ర వర్ణపటాల తరంగదైర్ఘ్య పంపిణీని కొలవడానికి ప్రిజమ్స్, ఉష్ణోగ్రత కొలిచే పరికరాలను ఉపయోగించి, హెర్షెల్ ఖగోళ స్పెక్ట్రోఫోటోమెట్రీని ఉపయోగించారు. ఈ పరిశోధనల సమయంలో, హెర్షెల్ పరారుణ వికిరణాన్ని కనుగొన్నారు. సూర్యుని చలన మార్గాన్ని నిర్ధరించి, పరారుణ ఉష్ణతరంగాల ఉనికిని చెప్పినది కూడా ఆయనే. ఆయన సుమారు 400కు పైగా టెలిస్కోపులను ఆయన తయారు చేశారు. జర్మనీలోని హెనోవర్‌లో 1738 నవంబర్ 15 న జన్మించిన విలియం చిన్నప్పట్నించే వయోలిన్ వాయించడం నేర్చుకున్నారు. తండ్రితో కొంతకాలం మిలటరీ బ్యాండ్‌లో పనిచేసి, తరువాత అన్నతో ఇంగ్లండ్ వెళ్లిపోయారు. కొన్నేళ్లపాటు సంగీతం మీదనే ఆధారపడి బతికిన ఆయన తరువాత ఖగోళశాస్త్రంపై ఆసక్తిని పెంచుకుని టెలిస్కోపులతో అంతరిక్ష పరిశీలన చేసేవారు. 1774 లో హెర్షెల్ తన మొట్టమొదటి పెద్ద టెలిస్కోప్‌ను నిర్మించారు. అలా 1781లో యురేనస్‌ను కనుగొన్నారు. ఆ ఏడాదే కోప్లీ అవార్డుతో పాటు, ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీగా ఎంపికయ్యారు. 'సర్' బిరుదును కూడా పొందారు. అప్పటి చక్రవర్తి జార్జి3 ఆయనను 'రాజ ఖగోళ పరిశీలకుడి' (రాయల్ ఆస్ట్రానమర్)గా నియమించారు. కొద్ది కాలానికే యురేనస్, శని, గురు గ్రహాల ఉపగ్రహాలను కూడా కనుగొన్నారు. చంద్రునిపై గల పర్వతాలను చూడడమే కాదు, వాటి ఎత్తును కూడా కనుగొన్నారు. 1820 లో స్థాపించ బడినప్పుడు రాయల్ ఆస్ట్రోనామికల్ సొసైటీకి మొదటి అధ్యక్షులు. ప్రతిష్ఠాత్మకమైన నైట్‌హుడ్ సహా అనేక పురస్కారాలు పొందిన ఆయన, 1822 ఆగష్టు 25న తన 84వ ఏట మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# నగరానికి నిజాం కట్టడాల ప్రతిభా సాక్ష్యం

## సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకట రమణ శోధన ఫలితం



"వరంగల్ చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించే నూతన ఆవిష్కృత కాఫీ టేబుల్ బుక్ చరిత్ర పరిశోధకులకు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఎంతో ఉపయోగకర మవుతుందని, చారిత్రక అంశాలపై ఒక పౌర సంబంధాల అధికారి ఇంత విలువైన కృషి చేయడం నిజంగా అభినందనీయమైన విషయం." అని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సమాచార, పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకట రమణ రచించిన JEWELS OF ASAF JAHI%µ%S - The Glory of Warangal అనే కాఫీ టేబుల్ బుక్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి వేర్వేరు కార్యక్రమాల్లో ఆవిష్కరించారు. డా. బీ.ఆర్. అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలోని సి.ఎస్ ఛాంబర్‌లో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమానికి సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సి. హెచ్. ప్రియాంక కూడా హాజరయ్యారు. అనంతరం డీజీపీ కార్యాలయంలో ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణ రావు మాట్లాడుతూ, వరంగల్ చరిత్ర, నిజాం కాలపు వారసత్వం, అసఫ్‌జాహీ వంశపు నిర్మాణ వైభవం అన్నీ కలగలసిన ఈ పుస్తకం తెలంగాణ చరిత్రలో విలువైన మార్గదర్శక గ్రంథంగా నిలుస్తుందని అభినందించారు. రచయిత కన్నెకంటి వెంకట రమణ మాట్లాడుతూ, "వరంగల్ అనగానే కాకతీయుల వైభవం, వేయి స్థంభాల ఆలయం, ఖిలా వరంగల్, భద్రకాళి ఆలయం వెంటనే మనకు గుర్తొస్తాయి. కానీ అదే నగరంలో కాజిపేట నుండి మామునూర్ వరకు నిజాం నవాబులు నిర్మించిన ఎన్నో అద్భుత భవనాలు, కళాత్మక కట్టడాలు, ఆధునికతకు మార్గదర్శకమైన నిర్మాణాలు ఉన్నాయని చాలా మందికి తెలియదు" అని వివరించారు. ఈ పుస్తకంలో వరంగల్ కేంద్రంగా ఏర్పడిన అసఫ్ జాహీ పాలనా విభాగమైన "వరంగల్ సుబా" చరిత్ర, అందులో భాగమైన ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం ప్రాంతాల పరిపాలన, అక్కడి సుబేదారుల వివరాలు, వారి ప్రత్యేకతలతో పాటు అరుదైన పత్రాధారాలు సమగ్రంగా పొందుపరిచారు. ఆ కాలపు పాలనా శైలి, నిర్మాణ శిల్పం, సామాజిక–సాంస్కృతిక పరిణామాలు, నిజాం యుగపు హెరిటేజ్ భవనాల ఫోటోలు ఈ గ్రంథాన్ని అరుదైన చరిత్ర పత్రంగా నిలిపాయి. నిజాం కాలంలో నిర్మితమైన కాజిపేట రైల్వే స్టేషన్, ప్రస్తుత మిషన్ భగీరథ పథకానికి మూలమైన ధర్మసాగర్ ఫిల్టర్ బెడ్, పలు కోటలు, ప్రభుత్వ భవనాలు, మసీదులు, విద్యాసంస్థలు ఈ గ్రంథంలో విశదీకరించబడ్డాయి. ప్రతి చిత్రానికి వెనుక చరిత్రాత్మక నేపథ్యం, ఆ కాలపు శైలీ సౌందర్యం వివరించబడింది. JEWELS OF ASAF JAHI%µ%S - The Glory of Warangal పుస్తకం కేవలం చిత్రసంపుటం మాత్రమే కాదు ు అది వరంగల్ నగర చరిత్రలో మానవ కృషి, కళ, సాంస్కృతిక పరిపుష్టి, నిర్మాణ వారసత్వం ప్రతిబింబించే విలువైన గ్రంథం. చరిత్రాభిమానులు, విద్యార్థులు, పరిశోధకులు, వారసత్వ సంరక్షణకారులు అందరికీ ఇది ప్రేరణగా నిలుస్తుందని సి.ఎస్, డీజీపీలు అభిప్రాయపడ్డారు. చారిత్రక అవగాహనను విస్తరించి, నిజాం యుగపు నిర్మాణ సంపదను వెలికితీస్తూ, వరంగల్ నగర మహిమాన్విత చరిత్రను కొత్త దృక్కోణంలో పరిచయం చేసిన ఈ గ్రంథం తెలంగాణ సంస్కృతి, వారసత్వ గాథలో చిరస్మరణీయంగా నిలవనుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# జూబ్లీ హిల్స్ ఫలితం రాష్ట్ర రాజకీయాలకు దిక్సూచి !?




జూబ్లీ హిల్స్ ఉపఎన్నిక రాష్ట్ర రాజకీయాల్లో ఒక ముఖ్యమైన మలుపు తిరిగిన సందర్భంగా నిలిచింది. గత దశాబ్ద కాలంగా నగర ప్రాంతాల్లో తన పాదముద్రను స్పష్టంగా నిలిపిన భారాస, ఈసారి తారుమారైన కేడర్ స్థితి, నాయకత్వ మౌనం, అంతర్గత అసమ్మతి, ప్రత్యర్థి పార్టీల సమన్విత వ్యూహాలు, మైనారిటీ ఓటు సంకలనాలు, ప్రభుత్వ పథకాల అమలు విషయంలో పెరిగిన ప్రజా విశ్వాస కలయికతో ఇంత పెద్ద పరాభవాన్ని ఎదుర్కొంది. మూడు సార్లు వరుసగా ఈ నియోజకవర్గాన్ని గెలుచుకున్న మాగంటి గోపీనాథ్ మరణంతో చోటు చేసుకున్న భావోద్వేగ తరంగం ఎన్నికకు ప్రత్యేక పునర్భూమికగా మారింది. ఆయన తల్లి బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు పార్టీ నాయకత్వం తన కుమారుడిని నిర్లక్ష్యం చేసిందనే ఆరోపణలు, గతంలో ఎం ఐ ఎం తో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగాడని వచ్చిన విమర్శలు, ఆ పార్టీ ఆధిపత్యం ఉన్న బస్తీల్లో భారాస కేడర్ పటిష్టతకు ఆయన చేసిన ప్రయాసల పట్ల పార్టీ చూపిన నిర్లక్ష్యంస్థానిక కేడర్‌లో గంభీరమైన చీలికను కల్పించాయి. ఈ వ్యాఖ్యలు ప్రచారంలో ప్రత్యర్థుల ఆయుధాలుగా మారాయి. ఇంతకాలం తమకు ఓటు వేస్తున్న వర్గంలో కూడా సందిగ్ధతను రేకెత్తించాయి. ఉప ఎన్నికలో ఏకదృష్టంగా ఫలితాలు కనిపించాయి: కాంగ్రెస్ 98,988 ఓట్లు (50.83 %), భారాస 74,259 ఓట్లు (38.13 %), బి జె పి 17,061 ఓట్లు (8.76 %) అనే ఫలితాలు నమోదు అయ్యాయి. ఓటు హాజరు సుమారు 48.49%గా నమోదయి ఉంది. భారాసకు ఈ ఉపఎన్నికలో ఏర్పడిన అతిపెద్ద లోపం కేసీఆర్ సంపూర్ణ మౌనం. పార్టీ స్థాపకుడు ప్రచారానికి దూరంగా ఉండటం కేడర్‌లో ఉత్సాహాన్ని బలహీన పరిచింది. హరీష్ రావు కుటుంబ దుఃఖ కారణంగా కీలక సమయాల్లో రాలేక పోవడం, ఇతర అగ్రనేతలు చురుగ్గా వ్యవహరించక పోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. నిధుల వినియోగం, అభివృద్ధి పథకాల అమలులో జాప్యం, మున్సిపల్ సేవల పట్ల అసంతృప్తిఇవన్నీ కలసి ప్రజల్లో "భారాస ఇక పాత ఉత్సాహంతో లేదనే" భావనను పెంచాయి. అంతేకాదు పలువురు ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ వైపు చేరిపోవడం, కొందరు నేతలపై ఉన్న విచారణలు, క్రమశిక్షణా లోపాలుఇవన్నీ ఓటర్లకు పార్టీ స్థిరత్వంపై తీవ్రమైన సందేహాన్ని కలిగించాయి. ఈ సంక్షోభంలో పార్టీ అభ్యర్థి కేడర్‌కు కావాల్సిన దిశానిర్దేశం, ఓటర్లకు కావాల్సిన నమ్మకం అందించలేక పోయారు. దీనికి విరుద్ధంగా కాంగ్రెస్ ఈ ఉపఎన్నికను ప్రతిష్టాత్మకంగా స్వీకరించింది. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కేంద్ర నాయకత్వం వరకు ప్రచారంలో నేరుగా పాల్గొనడం, ఎం ఐ ఎం పూర్తి మద్దతుతో మైనారిటీ ఓట్లు ఒకే దిశగా సమీకరించడం కాంగ్రెస్ విజయానికి కీలకమైన బలంగా మారింది. స్థానికంగా ప్రభావం కలిగిన నాయకుడికి టికెట్ ఇవ్వడం, అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా ముస్లింల ఓటింగ్ మూడ్‌ను కచ్చితంగా ఆకర్షించడం, ఇంటింటా ప్రచారం, డిజిటల్ ప్రచారం, బూత్ మైక్రో మేనేజ్‌మెంట్అన్నీ కలిపిఓటర్లలో కాంగ్రెస్ పట్ల ఒక కొత్త విశ్వాసాన్ని నెలకొల్పాయి. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిత పథకాలురైతు రుణాల మాఫీ, మహిళలకు ఆర్థిక సహాయం, వైద్యరంగ సేవల మెరుగుదల, విద్యుత్ పరిస్థితుల పునరుద్ధరణ, పాఠశాలల శ్రేయస్సుకు చేపట్టిన పథకాలుఈ ఎన్నికలో ఎక్కువ ప్రాధాన్యం పొందాయి. నగర ప్రాంతాల్లో సేవల మెరుగుదల, రోడ్ల పునరుద్ధరణ, డ్రైనేజ్ అభివృద్ధి వంటి అంశాల్లో ప్రభుత్వం చేపట్టిన చర్యలు కూడా మధ్యం వర్గ ఓటర్లను కాంగ్రెస్ వైపుకు మళ్లించాయి. ఈ ఉపఎన్నికలో ప్రభుత్వంపై ఏర్పడిన ఓటర్ల విశ్వాసం నేరుగా కాంగ్రెస్ ఓట్లలో ప్రతిబింబించింది. భారతీయ జనతా పార్టీ మాత్రం ఈ ఉపఎన్నికలో అంచనాలకు తగిన విధంగా ప్రాభవం చూపలేక పోయింది. నగరంలో బలమైన ఓటు బ్యాంక్ ఉన్నప్పటికీ, సరైన అభ్యర్థి ఎంపిక, ప్రచార దిశ, స్థానిక సమస్యలపై స్పష్టమైన ప్రత్యామ్నాయ దృక్కోణం లేకపోవడం కారణంగా బి జె పి ఓట్లు స్థిరంగా పెరగలేదు. కేడర్ చైతన్యం ఉన్నప్పటికీ, ఓట్లను మార్పుకు దోహదం చేసేవిధంగా బలమైన రాజకీయ తరంగం సృష్టించలేక పోయింది. ఈ విధంగా ఓటర్ల దృక్కోణంలో ప్రభుత్వ పథకాల అమలే ప్రధాన నిర్ణాయక అంశంగా మారింది. ఎందుకంటే నగర ఓటరు వాగ్దానాల కన్నా సేవల నాణ్యతను, నేతృత్వ సంకల్పాన్ని, పరిపాలనా క్రమశిక్షణను ప్రాధాన్యంగా చూస్తాడు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో కొన్ని అమలైన తీరు, అభివృద్ధి పనులకు తీసుకున్న వేగవంతమైన చర్యలు ఓటర్లలో "కాంగ్రెస్ పాలనలో మార్పు కనిపిస్తోంది" అనే భావనను పెంచాయి. ఇక భారాస పాలన చివరి దశలో కనిపించిన అచేతనత, మౌలిక సమస్యల పట్ల నిర్లక్ష్యం, నాయకత్వ అస్పష్టత ఓటరులను దూరం చేసింది. ఈ ఎన్నిక ఫలితాలు సంఖ్యల్లో కూడా ఇదే సందేశాన్ని అందిస్తున్నాయికాంగ్రెస్ దాదాపు 51 శాతం ఓట్లు సాధించగా, భారాస 38 శాతం వద్ద నిలిచింది, బి జె పి 9 శాతం దాటలేక పోయింది. 48 శాతం మాత్రమే నమోదైన తక్కువ పోలింగ్‌లో మైనారిటీ ఓట్లు, కాంగ్రెస్ లక్ష్య బద్ధమైన బూత్ మేనేజ్‌మెంట్ నిర్ణయాత్మక ఆధిక్యాన్ని ఇచ్చాయి. తక్కువ పోలింగ్ సాధారణంగా కేడర్ బలమైన పార్టీకి ప్రయోజనం చేకూర్చాలిబీ కాని భారాస కేడర్ నిరుత్సాహంతో ఉండటంతో ఆ ప్రయోజనం పూర్తిగా కాంగ్రెస్‌కు మళ్లి పోయింది. ఈ ఉపఎన్నిక మూడు ముఖ్యమైన సంకేతాలను ఇస్తుందిఒకటి, నాయకత్వంలో స్పష్టత, ప్రచారంలో చురుకుదనం, కేడర్‌తో అనుసంధానం లేకుండా నగర నియోజక. వర్గాల్లో విజయం సాధ్యం కాదు. రెండోది, మైనారిటీ సమీకరణ నగర రాజకీయాల్లో గణనీయ ప్రభావం చూపిస్తుంది. మూడోది, ప్రజల జీవన ప్రమాణాలను నేరుగా తాకే ప్రభుత్వ పథకాల అమలు ఓటు తీరు నిర్ణయిస్తుంది. జూబ్లీ హిల్స్ ఉపఎన్నిక ఫలితాలు హైదరాబాద్ నగర రాజకీయాలకు రాబోయే సమీకరణాల్లో కీలక దారిచూపుగా నిలవనున్నాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# మహాత్ముని హత్య సంఘటన పూర్వాపరాలు - నాథూరామ్ గాడ్సే వర్ధంతి సందర్భంగా...



నాథూరామ్ గాడ్సే (మే 19, 1910 – నవంబరు 15, 1949) గాంధీని హత్య చేసిన వారిలో ప్రధాన పాత్రధారుడు. గాంధీని హత్య చేసిన వ్యక్తిగా గాడ్సే ప్రపంచ వ్యాప్తంగా చిర పరిచితుడు. ఆయన మహా రాష్ట్రలోని పూనే జిల్లా బారామతి పట్టణంలో జన్మించాడు. ఆయన తల్లి పేరు లక్ష్మి, తండ్రి పేరు వినాయక్ వామన్ రావు గాడ్సే. మొదట్లో గాంధీని అభిమానించే వాడు. తరువాత గాంధేయవాదం నుండి విడిపోయి ఆర్.ఎస్.ఎస్.లో చేరాడు. 1948లో పూనా నుండి ప్రచురించ బడిన హిందు మహాసభ వారి హిందూ రాష్ట్ర అనే వారపత్రికకు సంపాద కుడుగా పనిచేసాడు. గాడ్సే గాంధీని హతమార్చడం వెనక భారత్ – పాకిస్తాన్ విభజన ప్రధానాంశ నేపథ్యం ఉంది. సంబంధిత పూర్వా పరాలను చూస్తే... స్వాతంత్ర్యానంతరం గాంధీ ప్రయత్నాలు హిందూ – ముస్లిం విద్వేషాలను నివారించడానికి పరిమిత మయ్యాయి. ముస్లిం నాయకుడైన మహమ్మద్ ఆలీ జిన్నాను ప్రధాన మంత్రిగా చేసైనా దేశ విభజనను ఆపాలని గాంధీ భావించారు. ఇది హిందూ – ముస్లింల మధ్య మరింత చిచ్చు రాజేసింది. నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ లు గాంధీ విధానాన్ని వ్యతి రేకించారు. విభజన జరిగితేనే అల్లర్లు సమసి పోతాయని వారు భావించారు. దేశ విభజనో..అంతర్గత యుద్ధమో తేల్చుకోండని జిన్నా పిలుపు నివ్వడం గాంధీని ఇరకాటంలో పడేసింది. దేశ విభజన ప్రతిపాదన, దానికి వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లు, అవి దారితీసిన ఉద్రిక్తతలు, మత ఘర్షణల ఫలితంగా అనూహ్యామైన రీతిలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. నాటి పాలక వ్యవస్థ పరిస్థితిని అదుపు చేయలేని అసహాయ స్థితిలో పడింది. మొత్తం పోలీసు బలగాలు దేశ పశ్చిమ ప్రాంతానికి పంప బడ్డాయి. తూర్పు ప్రాంతంలో కల్లోలాలను అదుపు చేసే భారం గాంధీ పై పడింది. దేశ విభజనతో ముఖ్యంగా పంజాబు, బెంగాలు లలో పెద్దఎత్తున సంభవించిన వలసల వల్ల మత కలహాలు, మారణ కాండలు ప్రజ్వరి ల్లాయి. 1947లో కాశ్మీరు విషయమై భారత్ – పాకిస్తాన్ యుద్ధం తరువాత ఇంటా, బయటా పరిస్థితి మరింత క్షీణించింది. ముస్లిము లందరినీ పాకిస్తాను పంపాలనీ, కలసి బ్రతకడం అసాధ్యమనీ వాదనలు నాయకుల స్థాయి లోనే వినిపించ సాగాయి. ఈ పరిస్థితి గాంధీకి మింగుడు పడని అంశంగా మారింది. దీనికి తోడు విభజన ఒప్పందం ప్రకారము పాకిస్తానుకు ఇవ్వవలసిని 55 కోట్లు రూపాయలను ఇవ్వడానికి భారత ప్రభుత్వం నిరాకరిం చింది. ఆ డబ్బు భారతదేశంపై పాకిస్తా న్ యుద్ధం చేస్తే యుద్ధా నికి ఉపయోగ పడుతుందని సర్దార్ పటేల్ వంటి నాయకుల అభిప్రాయం. కాని అలా కాకుం టే పాకిస్తాన్ మరింత ఆందోళన చెందుతుందనీ, దేశాల మధ్య విరోధాలు ప్రబలి మత విద్వేషాలు సరిహద్దులు దాటుతాయనీ, అంతర్యుద్ధానికి దారితీస్తుందనీ గాంధీజీ అభిప్రాయం. జనవరి 12, 1948 రోజు సాయంత్రం తన రోజువారీ ప్రార్థన సమావేశంలో, మరుసటి రోజు ఉదయం నుండి ఆమరణ ఉపవాసం కూర్చుంటానని గాంధీ ప్రకటించారు. 1948 జనవరి 13న మధ్యాహ్నం సుమారు 12 గంటలకు గాంధీజీ రెండు డిమాండ్లతో నిరాహార దీక్షలో కూర్చున్నారు. మొదటి డిమాండ్ పాకిస్తాన్‌కు భారత్ విభజన ఒప్పందంకు సంబంధిం చిన మిగిలిన రూ.55 కోట్లు ఇవ్వాలి. రెండోది ఢిల్లీలో ముస్లిం లపై జరుగుతున్న దాడులు ఆగాలి. దీనికి ముందు గాంధీ తన రోజువారీ పనులను పూర్తి చేశారు. నెహ్రూ, పటేల్, ఆజాద్‌లతో ఆయన సుదీర్ఘ చర్చలు జరిపారు. అలా ఆయన ఢిల్లీలో తన జీవితం లో చివరి ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. ఎవరెంతగా ప్రాధేయపడినా ఆయన తన దీక్ష మానలేదు. చివరకు భారత ప్రభుత్వం దిగివచ్చి పాకిస్తానుకు 55 కోట్ల డబ్బు ఇవ్వడానికి అంగీకరిం చింది. 1948 జనవరి 18న ఒక శాంతి కమిటీ ఏర్పాటైంది. ముస్లింలు ఢిల్లీలోని తమ ఇళ్లలోకి వెళ్లవచ్చని, హిందువులు, సిక్కుల ఆక్రమణ నుంచి మసీదులను విడిపిస్తామని, అక్రమ కబ్జాల నుంచి ముస్లింల ప్రాంతాలను విడిపిస్తామని, ఇళ్ల నుంచి భయపడి వెళ్లిపోయిన ముస్లింలు తిరిగి రావడానికి హిందువుల నుంచి ఎలాంటి అభ్యంతరం ఉండదని ఆ కమిటీ మహాత్మా గాంధీకి హామీ ఇచ్చింది. హిందూ, ముస్లిమ్, సిక్కు వర్గాల నాయకులు సఖ్యంగా ఉండటానికి కట్టుబడి ఉన్నామని ఆయనవద్ద ప్రమాణం కూడా చేశారు. జనవరి 18న మధ్యాహ్నం 12.45కు మౌలానా ఆజాద్ ఇచ్చిన నారింజ రసం తాగిన మహాత్మా గాంధీ తన నిరాహార దీక్షను విరమించారు. కాని ఈ వ్యవహారంలో గాంధీ పట్ల మతోన్మాదుల ద్వేషం బలపడింది. మత ప్రాతిపదికన పాకిస్తాన్ ప్రత్యేక దేశం ఏర్పాటుకు గాంధీ వ్యతిరేకిస్తున్నారని ముస్లింలు భావించగా, ముస్లింల వేధింపులపై ప్రతీ కారం తీర్చుకు నేందుకు గాంధీ తమకు అడ్డుపడు తున్నాడని హిందు తీవ్రవాదులు భావిం చారు. ఈ నేపథ్యంలో గాంధీ హత్యకు దారితీసింది హిందు– ముస్లింల మధ్య నెలకొన్న కలహాలే అనే వాదన బలంగా ఉంది. ఈ క్రమంలోనే నాథూరామ్ గాడ్సే పథకం ప్రకారం 1948 సంవత్సరం జనవరి 30వ తేదీ నాడు బిర్లా మందిర్ ప్రార్థన మందిరం మైదానం లో హత్య చేయడం జరిగిందని స్పష్ట మయింది. నాథూరాం గాడ్సే నారాయణ్ ఆప్తే, గోపాల్ గాడ్సే మరి కొందరు సహాయంతో గాంధీని హత్య చేశాడు. హత్య చేసిన తరువాత పారిపోకుండా ఘటనా స్థలంలోనే పోలీసులకు లొంగి పోయాడు. గాడ్సేని హర్యానాలోని అంబాలా జైలులో 1949 నవంబరు 15న ఉరి తీశారు. "గాంధీ సమ్మతితో కాంగ్రెస్ లోని అగ్రనేతలు అంతా కలిసి దేశాన్ని చీలికలు – పేలికలుగా మార్చారని, దేశ విభజనకు సమ్మతి తెలిపి పెద్ద కుమారుడు వంటి గాంధీ భారత దేశానికి ద్రోహం చేయడం ద్వారా ఆయన తన ధర్మాన్ని నెరవేర్చడం లో ఘోరంగా విఫలం అయ్యాడని, అన్ని అంశాలు పరిగణన లోకి తీసుకున్న తర్వాతనే నేను తుది నిర్ణయానికి వచ్చానని, అందుకే తానే గాంధీని కాల్చి చంపానని"... గాడ్సే కోర్టులో వివరించాడు. స్వతంత్ర భారత దేశంలో ఉరితీయ బడిన మొదటి వ్యక్తిగా గాంధీని చంపిన నాధురాం వినాయక్ గాడ్సే చరిత్రలో నిలిచి పోయాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

చురకలు

## సంపాదకీయం

# బాంబు బ్లాస్టింగ్.... అదే ముహూర్తం ?

ఏంటో శుభాలే కాదు దుర్మార్గాలకు కూడా ముహూర్తాలేనట. మరి అది యాంటీ సెంటిమెంట్ గా భావిస్తారో లేక అచ్చి వస్తుందని అనుసరిస్తారో లేక చీకటి తోడుగా చేసుకుని లోకానికి భయం పుట్టించాలని ఎంచుకుంటారో తెలియదు కానీ భారత దేశంలో జరిగిన బాంబు బ్లాస్టింగ్స్ అన్నీ ఒకే ముహూర్తంలో సాగడమే విశేషం. చిత్రమేంటి అంటే అన్నీ సాయం సమయం దాటిన తర్వాత రాత్రి వేళలోనే జరిగాయి. అంటే దీని భావమేంటో ఉగ్ర వాదులకే తెలియాలి మరి.

**నిశాచర ముష్కరులు :** నిశిలో సంచరించే వారు అంతా ముష్కరులు కాదు కానీ బాంబు దాడులు నిశిలో చేసి లోకాన్ని మసి చేయాలనుకున్న వారు అంతా ముష్కరుల కిందనే లెక్క. అలాంటి వారే దేశంలో రాత్రి వేళలలో ఈ తరహా ఘాతుకాలకు పాల్పడ్డారు. తాజాగా ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో సోమవారం జరిగిన బాంబు బ్లాస్టింగ్ చూస్తే కనుక ఏకంగా 12 మంది దాకా మరణించారు. ఇరవై మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఇక్కడ ముహూర్తం చూస్తే కనుక సాయం సమయమే కావడం విశేషం. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు సూత్రధారిగా చెబుతున్న వారు డాక్టర్ ఉమర్ మహ్మద్. ఆయన భయంతో ఆందోళన చెంది మరీ ఈ విధంగా ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు అని విచారణ బృందం అనుమానిస్తోంది.

**ఆ ఇద్దరూ అరెస్టు తో :** ఇక ఫరీదాబాద్ లో ఉగ్ర కుట్రని చేదించారు భద్రతా సంస్థలు. అదే సమయంలో ఉమర్ అహ్మద్ సహచరులు అయిన డాక్టర్ ముజామిల్ షకీల్, అలాగే డాక్టర్ అదీల్ అహ్మద్ రథర్ అరెస్టు కావడంతో నే ఉమర్ ఈ విధంగా ఢిల్లీ ఎర్ర కోట వద్ద ఈ భారీ పేలుడుకు పాల్పడ్డారు అని అంటున్నారు. ఆయన తనతో పాటు ఉన్న భారీ పేలుడు పదార్థాలతో చిక్కితే సీన్ సితారే అని భావించే ఈ విధంగా పేలుడుకు పాల్పడ్డాడు అని అంటున్నారు.

**ఒకే టైం లోనే :** సరే ఉమర్ చేసిన ఈ ఘాతుకం వెనక ఎవరు ఉన్నారు అన్నది దర్యాప్తులో తేలుతుంది. కానీ ఎర్రకోట నుంచి వెనక్కి వెళ్ళి చూస్తే బాంబు బ్లాస్టింగ్ అన్నీ ఒకే సమయంలో చోటు చేసుకోవడం అని అంటున్నారు. గత రెండు దశాబ్దాలుగా ఇదే జరిగింది అని అంటున్నారు. ఈ పేలుళ్ళ ఘటనలు అన్నీ సాయంత్రం ఆరు నుంది రాత్రి ఏడు గంటల మధ్యనే చోటు చేసుకున్నాయని అంటున్నారు. లేటెస్ట్ బాంబు బ్లాస్ట్ లో నిందితుడు ఉమర్ అయితే ఎర్ర కోట వద్దకు మధ్యాహ్నమే వచ్చాడుట. కానీ ఎందుకో సాయంత్రం కావాలని పొద్దు పోవాలని వేచి చూసి మరీ ఈ ఘాతుకానికి దిగాడు అంటే ఈ పేలుళ్లకూ ఒక దుర్ముహూర్తం ఉందని అంటున్నారు.

**రీజన్లు గట్టివే :** చీకటి పడితే చాలా మూసుకుంటాయి. చీకటిలోనే అఘాయిత్యాలకు తెర తీయవచ్చు. అంతే కాదు సాయంత్రం ఆరు నుంచి ఏడు సమయం జన సమ్మర్దం ఉండే సమయం. అంతే కాదు ఎక్కువ మందిని టార్గెట్ చేయవచ్చు. ఇంటికి వెళ్ళే వారు ఎక్కువ మంది ఉంటారు. ఇక మార్కెట్లు కళకళలాడతాయి. మాల్స్ ఇతర కేంద్రాలు అన్నీ రద్దీగా ఉంటాయి. అందుకే ఎక్కువ మందిని చంపాలి అనుకున్న వారికి తాము తప్పించుకోవచ్చు ఏ సీసీ కెమెరా సరిగ్గా రికార్డు చేయలేదు అన్న ధీమాతోనే ఈ సమయాన్ని ఎంచుకుంటున్నారు అని అర్థం అవుతోంది.

**ఈ లిస్ట్ చూస్తే కనుక :** ఈ విధంగా భారత దేశంలో సాయంత్రం జరిగిన కీలకమైన బాంబు పేలుళ్ళ జాబితా చూస్తే మతి పోతుంది. 2005 అక్టోబర్ 29వ తేదీన ఢిల్లీలో సాయంత్రం 5.45 నుంచి 6 గంటల మధ్యలో బాంబు పేలుళ్ళు జరిగాయి. డెబ్బై మంది దాకా మరణించారు. అలాగే 2006 మార్చి ఏడున వారణాసిలో సాయంత్రం 6 గంటల 20 నిముషాలకు బాంబు పేలుళ్ళు జరిగితే 28 మంది మరణించారు. 2006 జూలై 11న ముంబైలో 6 గంటల 24 నిముషాల నుంచి ఏడు గంటల 50 నిముషాల మధ్యలో ఏడు సార్లు బాంబు పేలుళ్ళు జరిగాయి. ఏకంగా 209 మంది మరణించారు. 2007 ఆగస్ట్ 28న హైదరాబాద్ లో సాయంత్రం 7.45 కి అలాగే 7.50 కి రెండు సార్లు బాంబు పేలుళ్ళు పేలితే ఏకంగా 42 మంది మరణించారు. ఇక 2008 మే 13న జైపూర్ లో సాయంత్రం 7.30 కి తొమ్మిది సార్లు బాంబు పేలుళ్ళ జరిగాయి ఈ ఘటనలో 63 మంది మరణించారు. 2008 జూలై 26న అహ్మదాబాద్ లో 21 సార్లు బాంబు పేలుళ్ళు జరిగాయి. సమయం చూస్తే సాయంత్రం 6.30 నుండి స్టార్ట్ అయింది. ఈ దుర్ఘటనలో 51 మంది మరణించారు. 2008 సెప్టెంబర్ 13న – ఢిల్లీలో 5 సార్లు బాంబు పేలుళ్ళు జరిగితే అది కూడా సాయంత్రం 6.07 నుండి ముహూర్తంగా ఎంచుకున్నారు. మొత్తం 25 మంది చనిపోయారు. ఇక 2010 ఫిబ్రవరి 13న పూణెలో సాయంత్రం 7.15కి బాంబు పేలుళ్ళు జరిగాయి 17 మంది మరణించారు. అదే విధంగా 2010 డిసెంబర్ 7న వారణాసిలో బాంబు పేలుళ్లు సాయంత్రం 6.30 కి జరిగితే ఏకంగా 33 మంది మరణించారు. హైదరాబాద్ లో 2013 ఫిబ్రవరి 21న సాయంత్రం 6.58, అలాగే రాత్రి 7.-01 నిమిషాలకు రెండు సార్లు బాంబు పేలుళ్ళు జరిగితే 17 మంది మరణించారు. ఈ రికార్డు అంతా సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల మధ్యనే యమ దూతలు మాదిరిగా ఉగ్ర మూకలు రెచ్చిపోతున్నాయని వందల మందిని పొట్టన పెట్టుకుంటున్నాయని అర్థం అవుతోంది.

# గోరా జీవిత సర్వస్వం హేతువా దానికే అంకితం - నవంబర్ 15... నాస్తిక వాది గోపరాజు జయంతి


హేతువాదం అనే తాత్విక విధానాన్ని విశ్వసించి అనుసరించే వారిని హేతువాదులు అంటారు. హేతువు అంటే కారణం అని అర్థం. ఏదైనా ఒక విషయాన్ని గుడ్డిగా విశ్వసించకుండా దానికి కారణాలను అన్వేషించడం లేదా ఆరా తీయడాన్ని హేతువాదం అంటారు. జ్ఞానానికి లేదా ఋజువుకు "హేతువు" లేదా "కారణం" అనేది మాత్రమే నమ్మదగిన ఆధారం అని భావించే తాత్విక ధోరణిని హేతువాదం అంటారు. హేతువాదానికి శాస్త్రీయ దృక్పథం పునాది. మానవుడే కొలమానం, మనిషి అన్నిటికీ మూలం అనే మూల సూత్రాలతో హేతువాదం ఆవిర్భవించింది. గోరా'గా ప్రసిద్ధులైన గోపరాజు రామచంద్రరావు నాస్తికుడిగా, హేతువాదిగా, గాంధేయవాదిగా తెలుగు వారందరికీ సుపరిచితులు. ఆయన దృష్టిలో ఆస్తికత, హేతు వాదం రెండు భిన్న ధ్రువాలు. నేటి సమాజంలో అగ్ర, నిమ్న జాతులనే వర్ణ బేధాలు, అంధ విశ్వాసాలు పెరగటానికి ఆస్తికతే కారణం అని ఆయన గట్టి నమ్మకం. మానవులందరూ ఒకటే అన్న భావం పెరగాలంటే , అది ఒక్క నాస్తికవాదం వల్లనే సాధ్యమని విశ్వసించి, నాస్తికభావాల ప్రచారం కోసం తన జీవితమంతా వెచ్చించారు గోరా. పెళ్ళికి ముందే సెక్స్ పై అవగాహనలు, కుటుంబ నియంత్రణ, వీటితో పాటు అప్పటి తెలుగు సమాజంలో ఎన్నో విప్లవా త్మక మార్పులను తెచ్చిపెట్టిన ఘనత గోరాదే. గోరా ప్రస్తుత ఒరిస్సా రాష్ట్రంలో ఉన్న ఛత్రపూర్ అనే కుగ్రామంలో, 1902, నవంబరు 15 న ఉన్నత కుల హిందూ కుటుంబంలో వెంకట సుబ్బారావు, రాజ్యలక్ష్మి దంపతులకు జన్మించారు. పర్లాకిమిడిలో ప్రాథమిక విద్యాభాసం పూర్తిచేసిన తర్వాత 1913లో పిఠాపురం రాజా కళాశాల ఉన్నత పాఠశాలలో చదివారు. 1920లో పిఠాపురం రాజా అనుబంధ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన గోరా, అప్పుడే ప్రారంభమౌతున్న సహాయ నిరాకరణోద్యమంలో కాలూనారు. 1922లో మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో వృక్షశాస్త్రంలో బి.ఏ చేశారు. రామచంద్రరావు వృక్ష శాస్త్రంలో డిగ్రీ చదివి, మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో అదే శాస్త్రంలో మాస్టర్ డిగ్రీలో ఉత్తీర్ణుడయ్యారు. 1922 లో సరస్వతిని ఆమె 10 ఏళ్ళ ప్రాయంలోనే వివాహం చేసుకున్నారు. మధురలోని మిషన్ కళాశాలలో అధ్యాపకుడిగా చేరాడు. కోయంబత్తూరు వ్యవసాయ కళాశాలలో ప్రత్తి పరిశోధనా సహాయకుడిగా, తర్వాత కొలంబోలోని




ఒక కళా శాలలో జీవశాస్త్ర అధ్యాపకునిగా, 1928లో కాకినాడ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేశారు. తాను నడిచే మార్గం తండ్రికి ఇష్టం లేకపోవడంతో 1928 లో భార్య, పిల్లలతో ఇంటిని వదిలేసి వచ్చారు. స్వతంత్ర భావాలుగల గోరా ఎక్కడా ఉద్యోగంలో నిలువలేక పోయారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా లాంటి ఉద్యమాలలో పాల్గొని బ్రిటిష్ ప్రభుత్వపు జైళ్లలో కఠిన శిక్షలు అనుభవించారు. గోరా అనేక రచనలను చేశారు. సంఘం, ఆర్థిక సమత అనే పత్రికలను నడిపారు. వర్ణవ్యవస్థ, అంటరానితనం మీద తన యుద్ధాన్ని ప్రకటించిన గోరా 1940 లోఆయన భార్యతో కలసి నాస్తిక కేంద్రాన్ని, కృష్ణా జిల్లాలోని ఒక గ్రామంలో ప్రారంభించారు. దేశ స్వాతంత్ర్యం సందర్భంగా, 1947 లో, కేంద్రాన్ని విజయవాడకు తరలించారు. 1944లో మహాత్మా గాంధీ కోరిక మేరకు అఖిల భారత కాంగ్రేస్ ఆర్గనైజర్గా అలహాబాద్, ఢిల్లీలలో పనిచేశారు. స్వాతంత్ర్య సమరయోధుని గానేకాక, సాంఘిక, ఆర్థిక సమానత్వ సాధనకు, మూఢ నమ్మకాల నిర్మూలనకు, ప్రజల్లో శాస్త్రీయ దృష్టిని పెంపొందించ డానికి, వయోజన విద్యా వ్యాప్తికి, కుల, మత తత్వాల నిర్మూలనకు అనితర కృషి గోరా సల్పారు. గాంధీతో నాస్తికత్వంపై చర్చలు జరిపి, అస్పృశ్యతా నిర్మూలన కోసం కృషి చేసారు. దళితుల దేవాలయ ప్రవేశాన్ని, సమష్టి భోజనాలను, వివాహాలను విస్తృతంగా ఆయన నిర్వహించారు. ఆయనకు తొమ్మిది మంది సంతానం. సంతానానికి ఆయన సందిర్భోచితంగా పేర్లు పెట్టారు. ఉప్పు సత్యాగ్రహం కాలంలో పుట్టినందున లవణం, భారతీయులు చట్టసభలలో నిలిచి గెలిచిన కాలంలో పుట్టినందున విజయం, రెండవ ప్రపంచ యుద్ధకాలంలో పుట్టినందున ఒక కుమారునికి సమరం, మరొక కుమారునికి నియంత. తొమ్మిదవ సంతానానికి నౌవ్ గా పేర్లు పెట్టారు. హిందీ భాషలో నౌవ్ అంటే తొమ్మిది అని అర్థం. కుమార్తెలు మనోరమ, మైత్రి, విద్య. గోరా 25 ఏళ్ళ వయసు వరకు అస్తికుడే. తరువాత నాస్తిక సిద్ధాంతాలతో జీవితాంతం కృషి సల్పిన గోరా జీవితమే ఒక ఆదర్శం. ఆయన తన భార్యకి గర్భం వచ్చిన ప్రతిసారీ గ్రహణ సమయంలో గర్భవతిగా ఉన్న ఆమెను బయటకి తీసుకొని వెళ్లి తిప్పేవారు. గ్రహణం సమయంలో గర్భిణులు బయట తిరిగినంత మాత్రాన పుట్టబోయే పిల్లలకు గ్రహణం మొర్రి రాదు, అని నిరూపించటానికి. గోరా తన సంతానం అందరికీ, వారివారి అభీష్టం మేరకు, వర్ణాంతర వివాహాలు 'నాస్తిక పద్ధతిలో' జరిపించారు. ప్రముఖ కవి, దళిత కులానికి చెందిన గుర్రం జాషువా కూతురైన హేమలతను, తన కుమారుడైన లవణంకు వివాహం జరిపించిన ఆదర్శవాది గోరా. చెప్పింది చేసి చూపించిన మహనీయుడు ఆయన. 1970 లో బోస్టన్ లోనూ,1974లో హాలండ్ లోని అంష్టర్డాంలో జరిగిన అంతర్జాతీయ హ్యూమనిష్టు మహాసభలలో గోరా పాల్గొన్నారు. తెలుగులో ఒక వార పత్రిక 'సంఘం' ను స్థాపించి, దాని ద్వారా తన ఆశయాలను, లక్ష్యాలను ప్రజలలో విశేషంగా ప్రచారం చేశారు. గొప్ప సంఘసంస్కర్త, మానవతావాది, నాస్తిక ఉ ద్యమ నాయకుడు, హేతువాది అయిన గోరా, 26 -07 -1975 న విజయవాడ లోని నాస్తిక కేంద్రంలో ప్రసంగిస్తూ మర ణించారు. గోరా శతజయంతి సందర్భంగా 2002 లో భారత ప్రభుత్వం, తపాలా బిళ్ళను విడుదల చేసింది. నాస్తికత్వం (దేవుడు లేడు), దేవుని పుట్టు పూర్వోత్తరాలు, జీవితం నేర్పిన పాఠాలు, నేను నాస్తికుడిని, సృష్టి రహస్యం, సంఘ దృష్టి, ఆర్థిక సమానత్వం, నాస్తికత్వం – ప్రశ్నోత్తరాలు, నాస్తికత్వం – ఆవశ్యకత తదితర రచనలు చేశారు. ఆయన కోడలైన శ్రీమతి హేమలతా లవణం తన తండ్రి జాషువా రచనలను వెలుగులోకి తెస్తూ, మామగారైన గోరా స్థాపించిన 'నాస్తిక కేంద్రాన్ని' కూడా సమర్థవంతంగా నడిపారు. ఆమె కూడా 19 -03 -2008 న నాస్తిక కేంద్రం, విజయవాడ లోనే మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# సంఘ సంస్కర్త ఆచార్య వినోబా భావే - నవంబర్ 15...వినోబా భావే వర్ధంతి




వినోబా భావే (1895-1982) భారత దేశంలో ఆధ్యాత్మికత, సామాజిక, గ్రామీణ పునరుద్ధరణకు అపార కృషి చేసిన మహనీయుడు. ఆయన గాంధీయేతర కాలంలో కూడా గాంధీజీ ఆశయాలను జీవితమంతా పాటిస్తూ, సమాజ సుభిక్షత కోసం తన జీవితాన్ని అంకితమిచ్చారు. వినోబా భావే మహాత్మా గాంధీ శిష్యుడిగా, సార్వజన సౌభ్రాతృత్వం, శాంతి, సామాజిక సమానత్వం కోసం తన జీవితంలో ఎన్నో కార్యక్రమాలు చేశారు. వినోబా భావే 1895 సెప్టెంబర్ 11న మహారాష్ట్ర లోని గగోడా గ్రామంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే ఆయనలో ఆధ్యాత్మికత పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండేది. ఆయన తల్లి రుక్మిణీదేవి తనకు ఆధ్యాత్మికత మరియు మతంపై ప్రేమను పెంచగా, తండ్రి నారహరి శాస్త్రి గణితం, శాస్త్రాల పట్ల ప్రేరణను అందించారు. ఆయన ముంబైలో విద్య నభ్యసించి నప్పటికీ, గ్రంథాలపై, భక్తి మార్గంపై ఉన్న ఆసక్తి కారణంగా ఆయా రంగాల్లో అభ్యాసం కొనసాగించారు. 1916లో వినోబా మహాత్మా గాంధీని కలుసుకున్నారు. గాంధీజీ ఆత్మనిబద్ధత, సత్యం, అహింసా వంటి సిద్ధాంతాల పట్ల వినోబాను ప్రేరేపించారు. ఈ కలయికతో వినోబా తన జీవితాన్ని సార్వజన సేవకు అంకితం చేస్తూ గాంధీజీ ఆశయాలను స్వీకరించి నడిచారు. గాంధీజీ వినాయక నరహరి భావేను "వినోబా" అని నామకరణం చేశారు. గాంధీజీ మరణం తర్వాత వినోబా భావే భారత స్వాతంత్ర్యోద్యమంలో, ఆత్మ నిర్భర గ్రామాల రూప కల్పనలో మరింత చురుకుగా పాల్గొన్నారు. 1951లో వినోబా భావే ఆంధ్రప్రదేశ్ లోని పొచంపల్లి గ్రామంలో భూదాన్ ఉద్యమాన్ని ప్రారంభించారు. భూస్వాముల వద్ద ఉన్న భూమిలో కొంత భాగాన్ని పేదలకు దానం చేయాలని ప్రజలను కోరుతూ వినోబా భారత దేశమంతా యాత్ర చేశారు. ఇది సామాజిక న్యాయానికి, భూముల పునరాగమనం కోసం వినూత్న మార్గం అయింది. ఈ ఉద్యమం వల్ల దేశ వ్యాప్తంగా దాదాపు 40 లక్షల ఎకరాల భూమి పేదలకు లభించింది. భూదాన్ ఉద్యమం వినోబా భావేకు భారతీయ సమాజంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కలిగించింది, కేవలం సామాజిక సమానత్వం మాత్రమే కాదు, సామాజిక బాధ్యత మరియు దాన ధర్మాన్ని ప్రోత్సహించే ఉద్యమంగా గుర్తింపు పొందింది. వినోబా భావే సర్వోదయ ఉద్యమం ద్వారా సర్వజన సమానత్వాన్ని ప్రోత్సహించారు. "సర్వోదయం" అనగా సర్వ ప్రజల ఉజ్వలత అని అర్థం. ఈ ఉద్యమం ద్వారా ఆయన సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఆయన లక్ష్యం సర్వ సమాజం ఒకటిగా ముందుకు సాగాలని, సమాజంలోని ప్రతిఒక్కరికీ సమాన హక్కులు, అవకాశాలు ఉండాలని స్పష్టం చేశారు. వినోబా భావే గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక, సామాజిక సుభిక్షత సాధించాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను ప్రారంభించారు. అతని గ్రామస్వరాజ్య కల నేడు స్ఫూర్తిగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, మరియు స్వయం–పోషణకు ప్రాముఖ్యతనిస్తూ ఆయన అనేక కార్యక్రమాలను నిర్వహించారు. వినోబా భావే అనేక గ్రంథాలను రచించారు, ఇందులో ప్రముఖమైనది "గీతా ప్రవచన్", ఇది భగవద్గీత పై ఉన్న ఆయన ప్రత్యేకమైన దృక్పథాన్ని వ్యక్తం చేస్తుంది. భగవద్గీత పై ఆయనకు ప్రత్యేక అభిమానం ఉండేది, మరియు ఆయన దానిని ఆచరణలోకి తీసుకురావడం, జీవితంలో సత్యం, ధర్మం, అహింస వంటి విలువలను పాటించడం ఎంతో ముఖ్యమని నమ్మారు. ఈ రచనలలో వ్యక్తిత్వ పరిపూర్ణత, సామాజిక సవరణ వంటి అంశాలు ప్రతిఫలిస్తాయి. వినోబా భావే చివరి రోజులను మధ్య భారత దేశంలోని పావ్నార్ లోని తన ఆశ్రమంలో గడిపారు 15 నవంబర్ 1982న అక్కడే తుది శ్వాస విడిచారు. ఆయన మరణించినప్పటికీ ఆయన చూపించిన మార్గం భారతదేశానికి ఒక దీపంగా నిలిచింది. ఆయన ఆదర్శాలు, ముఖ్యంగా భూదాన్ ఉద్యమం, సర్వోదయ ఉద్యమం, గ్రామస్వరాజ్యం %–% ఇవన్నీ భారతీయ సమాజంలో సతత మార్పులకు దారి చూపిస్తున్నాయి. వినోబా భావే చూపించిన మార్గంలో నడుస్తూ, సమాజసేవ, సామాజిక సవరణ కోసం యత్నించే వారందరికీ ఆయన ఒక స్ఫూర్తి. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# నిష్కామ కర్మ యోగి కల్లూరి చంద్రమౌళి - నవంబర్ 15...కల్లూరి చంద్ర మౌళి జయంతి

ఆయన తొలితరం ఆంధ్ర ప్రదేశ్ రాజకీయ నాయకుడు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. గాంధేయవాది. అంతే కాకుండా మహాత్మా గాంధీకి అత్యంత సన్నిహితుడు. సంయుక్త మద్రాసు రాష్ట్రం, ఆంధ్ర రాష్ట్రం, ఆంధ్రప్రదేశ్ మూడింటిలో మంత్రిపదవులు నిర్వహించిన గొప్పతనం ఆయనది. భారత రాజ్యాంగ పరిషత్ (మొదటి పార్లమెంట్) సభ్యునిగా ఎన్నికైన ఘనత ఆయనది. దేవాదాయ శాఖా మంత్రిగా, తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షునిగా, శ్రీశైలం, భద్రాచలం దేవాలయాల జీర్ణోద్ధారకునిగా, భద్రాచల దేవస్థాన అధ్యక్షునిగా, పుణ్యక్షేత్ర పునఃనిర్మించిన కీర్తి ఆయనకే దక్కింది. సమగ్ర పంచాయితీ రాజ్ చట్టం మొదటిసారి రూపొందించి మద్రాసు శాసన సభలో అమోదింప జేసిన వ్యక్తిగా చిరకాలం గుర్తుండే పనితనం ఆయనది. ఆయనే మహాత్మాగాంధీకి అత్యంత సన్నిహితులలో ఒకరైన కల్లూరి చంద్రమౌళి. మహాత్మాగాంధీ చూపిన బాటలో నడిచి ఆనాటి మేటి ఉద్యమాలైన సైమన్ గో బ్యాక్, ఉప్పు సత్యాగ్రహం. విదేశీ వస్త్ర బహిష్కరణ, శాసనోల్లంఘన, హరిజనోద్ధరణ, సహాయ నిరాకరణ ఉద్యమాలలో చురుకుగా పాల్గొని ప్రజలకు నాయకత్వం వహించి పలుమార్లు జైలు జీవితం అనుభవించాడు. కల్లూరి చంద్రమౌళి (నవంబరు 15, 1898 – జనవరి 2, 1992) 1898 నవంబరు 15న గుంటూరు జిల్లా, అమృతలూరు మండలంలోని మోపర్రు గ్రామంలో వెంకమాంబ, సుదర్శనంలకు జన్మించాడు. బాల్యం నుండి భారతీయ సంస్కృతి సంప్రదాయాలంటే ఇష్టం కాగా, ప్రాథమిక విద్య తుళ్ళూరు, తెనాలి, బాపట్ల లో ఉన్నత విద్య కలకత్తా లోనూ చదివాడు. 1920లో ఇంగ్లాండు వెళ్ళి స్కాట్లాండు లోని ఎబర్డీన్ విశ్వవిద్యాలయం నుండి వ్యవసాయ శాస్త్రంలో పట్టా పొందాడు. 1926లో వార్ధా సేవాగ్రాం వెళ్ళి తొలిసారి గాంధీజీని కలిసాడు. అక్కడ మూడు నెలలు ఉండి కాంగ్రెస్ కార్యకర్తగా ఖద్దరు దరించి, గుంటూరు వచ్చాడు. ఊరురూ తిరిగి యువజన సంఘాలను పెట్టి వారిలో స్వతంత్ర భావాలను నాటాడు. 1929 లో గాంధీజీ గుంటూరు జిల్లా పర్యటనలో తోడుగా ఉండి స్వాతంత్ర్య సమరానికి విరాళాలు పోగుచేసాడు. మహాత్మా గాంధీ నాయకత్వంలో అన్ని జాతీయోద్యమాలల్లో పాల్గొని అనేకసార్లు జైలు కెళ్ళాడు. ఉప్పు సత్యాగ్రహం లో పాల్గోని అరెస్టై 18-6-1930 నుండి 12-3 1931 వరకు రాయవెల్లూరు జైల్లో గడిపాడు. గుంటూరులో కొండా వెంకటప్పయ్య ఇంటిలో ఉప్పు తయారు చేసి శాసనోల్లఘన చేసినందులకు 25-2-1932 నుండి 24-2-1933 వరకు కడలూరు జైల్లో గడిపాడు. 1933 డిసెంబరులో గాంధీజీ ఆంధ్రలో హరిజన యాత్ర సాగించాడు. గుంటూరు పర్యటనలో చంద్రమౌళి అన్ని తానై దానిని విజయవంతం చేసాడు. గాంధీజీ చేత 1933 డిసెంబరు 23 న కావూరు వినయాశ్రయానికి ప్రారంబోత్సవం జరిపించాడు. అనేక గ్రామాలలో హరిజనులచేత దేవాలయ ప్రవేశం చేయించాడు. 1934 లో గుంటూరు జిల్లా కాంగ్రెసు కమిటీకి, 1938లో జిల్లా బోర్డ్ అధ్యక్షుడైనాడు. 1937, 1946, లలో శాసనసభకు ఎన్నికై మద్రాసు ప్రావిన్సులో శాసన సభ్యునిగా పనిచేసాడు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఓ,పి రామస్వామి రెడ్డియార్ మంత్రివర్గంలో చంద్రమౌళి స్ధానిక సంస్థలు, సహకార శాఖామాత్యులుగా (1947 - 1949) పనిచేసాడు. 1946 లో ఏర్పడిన భారత రాజ్యాంగ పరిషత్ (మొదటి పార్లమెంట్) సభ్యునిగా మద్రాస్ ప్రావెంషియల్ నుండి ఎన్నికై భారత రాజ్యాంగ సభ్యులుగా రెండు ఏళ్ళు పనిచేసాడు. 1933లో ఆయన రాసిన నానా దేశ రాజ్యాంగాలు, రైతు రాజ్యాంగం పుస్తకాలు, వివిధ దేశాల రాజ్యాంగాలపై ఉన్న పట్టుకి నిదర్శనాలుగా నిలిచినందునే ఆయనను భారత రాజ్యాంగ పరిషత్తుకి సభ్యునిగా ఎన్నుకొన్నారు. 1949- 52 లలో పి.యస్. కుమారస్వామి రాజా మంత్రివర్గంలో స్థానిక స్వపరిపాలన, సహకార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించాడు. 1955 లో జరిగిన తొలి శాసన సభ ఎన్నికలో చంద్రమౌళి అమృతలూరు నుండి ఎన్నికై బెజవాడ గోపాలరెడ్డి మంత్రి వర్గంలో రెవెన్యూ, దేవాదాయ శాఖా మంత్రిగా (1955-56) పనిచేసాడు. దామోదరం సంజీవయ్య గారి మంత్రి వర్గంలో దేవాదాయ శాఖా మంత్రిగా (1960- 62) పనిచేసాడు. 1964లో తిరుమల తిరుపతి దేవస్థానం అధ్యక్షునిగా, రామాలయ జీర్ణోద్ధరణ సంఘం అధ్యక్షునిగా పనిచేశాడు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యునిగా పనిచేసాడు. చంద్రమౌళి అధ్యక్షులుగా భద్రాచల రామాలయ జీర్ణోద్ధరణ సంఘం ఆలయాన్ని ఆగమ విరుద్ధంగా నిర్మిస్తున్నారని దానిని నిలువరించాలని కాంగ్రెస్ లోని వీరి ప్రత్యర్థులు ఆందోళన చేసి, అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవ రెడ్డిచే విచారణ కమిటీని ఏర్పాటు చేయించారు. తనను కనీసం సంప్రదించకుండా సంజీవ రెడ్డి కమిటీ నియమించినందులకు నిరసించాడు. ఆత్మాభిమానంతో



రామాలయ జీర్ణోద్ధరణ సంఘానికి, తర్వాత స్వార్థ రాజకీయాలకు నిరసనగా 1965 లో తన శాసన సభ సభ్యత్వానికి, టి.టి.డి అధ్యక్ష పదవికి కూడా రాజీనామా చేసాడు. నమ్మిన సిద్ధాంతం కొరకు పదవిని తృణప్రాయంగా విసర్జించిన పరిశుద్ధ గాంధేయ వాది చంద్రమౌళి. భద్రాచలం గుడి 1960 నాటికి గుడి బాగా శిథిలమైంది. చంద్రమౌళి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిగా నియమితులైన, వెంటనే గుడి పునఃనిర్మాణానికి నడుం కట్టారు. తమ అధ్యక్షతన రామాలయ జీర్ణోద్ధరణ సంఘం ద్వారా చంద్రమౌళి రాష్ట్రం నలుమూలల తిరిగి లక్షలాది రూపాయల విరాళాలు పోగుచేశాడు. తమిళనాడులోని రామనాథపురం జిల్లాకు చెందిన శిల్పాచార్యులు గణపతి స్థపతిని ఆహ్వానించి, ముందుగా కల్యాణమండపం కోసం సరైన రాయిని తమిళనాడులోని దిండివనంలో గుర్తించి, కొత్తగూడెం వరకు రైళ్ళలో తెచ్చి అక్కడినుండి గోదావరి వరకు లారీలలో తరలించారు. పెద్ద పెద్ద రాతి శిలలను ఇసుకలో నెట్టుకు వచ్చి, లాంచీలలో కెక్కించి అతికష్టంతో భద్రాచలం చేర్పించారు. 500 శిల్పులు 3 లక్షల ఖర్చుతో సకల కళాశోభితమైన కళ్యాణ మండపం, రామాలయానికి దక్షిణాన ఉన్న రంగనాయకుల గుట్టపై రామదాసు ధ్యానమందిరం, శిల్ప శోభాయమానమైన గోపురాలు నిర్మించారు. దీనిలో ఆరు అడుగుల పచ్చరాయి రామదాసు విగ్రహం ప్రతిష్ఠించారు. సమీపంలోని తాటియాకుల గూడెంలో సేకరించిన పూర్తిగా నల్లరాతితో ప్రధాన ఆలయాన్ని సౌందర్య శిల్పాలతో నిర్మించారు మహామండపాన్ని అష్టలక్ష్ములు, దశావతారాలు, ఆళ్వారుల శిల్పాలతో అలంకరించారు. 32 టన్నుల ఏకశిలతో మూడు అంతస్తులు కలిగి అన్ని దేవతామూర్తుల శిల్పాలతో శోభాయమానమైన ఆలయ విమానం ఏర్పాటు చేశారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా పదవి చేపట్టగానే 1974 లో తిరిగి రామాలయ ధర్మకర్తల సంఘానికి అధ్యక్షులుగా నియమించాడు. వెంటనే విశేషంగా విరాళాలు సేకరించి చిత్రకూట మంటపాన్ని 127 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పుతో నిర్మించాడు. స్తంభాలపై అద్భుతమైన శిల్పాలు చెక్కించాడు. నిడారంబత, నిష్కలంక నిస్వార్ధ నిర్మల జీవనం గడిపిన ఆర్ష విద్యాలంకార బిరుదాంకితు డయిన కల్లూరి చంద్రమౌళి 94 ఏళ్ళ వయస్సులో మోపర్రులో 1992 జనవరి 2న ఒక కర్మయోగిగా ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# నాణ్యత లేమి.. తనిఖీలు మాని..

భానుపురి : ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆహారశాలలపై తనిఖీలు నామమాత్రం అవుతున్నాయి. మరోవైపు వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరించి రంగులు, టేస్టింగ్ సాల్ట్‌ను కలుపుతున్నారు. శుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. ఇది ప్రజారోగ్యం పాలిట శాపంగా మారుతోంది. ఇష్టమొచ్చినట్లు కల్తీ వ్యాపారం చేస్తున్నా ఆహార తనిఖీ విభాగం అధికారులు(ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు) పట్టించుకోవటం లేదు. వారి నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఫిర్యాదు చేస్తేనే దాడులు**

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 263 ఆహారశాలలపై దాడులు నిర్వహించారు. 52 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయగా, 133 ఆహారశాలలకు జరిమానా విధించారు. అడపాదడపా తనిఖీలు చేపట్టడంతో ఆహారశాలల నిర్వాహకులు నాణ్యత పాటించడం లేదు. పుర అధికారులే ఎవరైనా ఫిర్యాదు చేసే వాటిపై దాడులు జరిపి జరిమానా విధిస్తున్నారు. కానీ ఆహార తనిఖీ విభాగం అధికారులు ఎవరూ తమకు తాము స్పందించడం లేదు.



**వేధిస్తున్న ఖాళీలు**

సిబ్బంది కొరత కారణంగా అధికారుల తనిఖీలు మొక్కుబడిగా మారాయి. జిల్లాకు ఇన్‌ఛార్జి అధికారులను నియమించడం వల్ల పనిభారంతో చర్యలు తీసుకొనే పరిస్థితి ఉండటం లేదు. వాస్తవానికి ఫుడ్‌సేఫ్టీ అధికారి ప్రతి నెలా ఆయా హోటళ్లు, దాబాలు, కిరాణా దుకాణాల్లో తరచూ తనిఖీలు నిర్వహించి 12 వరకు నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించాలి. కానీ ఉమ్మడి నల్గొడ జిల్లాలో అలా జరగడం లేదు.

**కఠినంగా వ్యవహరిస్తాం**

ఇక నుంచి ఉమ్మడి జిల్లాలో ఆహారశాలలపై తనిఖీలు ముమ్మరం చేస్తాం. ప్రజలు కూడా నాణ్యత పాటించకుంటే నేరుగా ఫిర్యాదు చేయొచ్చు వివరాలు గోప్యంగా ఉంచుతాం. సిబ్బంది కొరత గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఆహారశాలల నిర్వాహకులు శుభ్రత, నాణ్యత పాటించకుంటే కఠినంగా వ్యవహరిస్తాం.

జ్యోతిర్మయి, ఫుడ్ కంట్రోల్ అధికారిణి, నల్గొండ

తనిఖీలు 105 కేసులు 22 జరిమానా 65 లక్షలు

# చట్టం.. బాల్యానికి ఛత్రం


సూర్యాపేట : నేటి బాలలే రేపటి పౌరులు. దేశ భవిష్యత్తు, అభివృద్ధి చిన్నారుల చేతుల్లోనే ఉంది. భారత రాజ్యాంగం ప్రతి చిన్నారికి రక్షణ, విద్య, ఆరోగ్యం, గౌరవప్రదమైన జీవనానికి హక్కు కల్పిస్తుంది. ఈ హక్కులను కాపాడేందుకు భారత ప్రభుత్వం అనేక చట్టాలను చేసింది. కానీ అవగాహన సరిగా లేక చట్టాలు పుస్తకాలకే పరిమితం అవుతున్నాయి. ఆచరణలో నిలిపి చట్టాల అమలు ద్వారా చిన్నారులకు రక్షణ కల్పించడంతోపాటు వారికి చదువు, ఆరోగ్యం అందించటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత. బాలల రక్షణతోనే దేశ భవిత. చిన్నారులూ.. ఈనెల 14న జాతీయ బాలల దినోత్సవం ఉంది కదా.. ఈ సందర్భంగా బాలల రక్షణకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొన్ని ముఖ్యమైన రక్షణ చట్టాలు తెలుసుకుందామా..

జువైనల్ జస్టిస్ చట్టం.. ఇది 2015లో అమలులోకి వచ్చింది. 18 ఏళ్లలోపు వయసున్న వారంతా బాలలే. నేరాల్లో చిక్కుకున్న లేదా రక్షణ అవసరమైన పిల్లలకు న్యాయపరమైన రక్షణ కల్పించేందుకు ప్రతి జిల్లా కేంద్రంలో జువైనల్ జస్టిస్ బోర్డులు ఏర్పాటయ్యాయి. బాలల సంరక్షణ కమిటీలు, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.

విద్యా హక్కు.. బడి ఈడు పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యను అందించేందుకు కేంద్రం 2009లో ఈ చట్టాన్ని చేసింది. 6-14 ఏళ్ల బాలలకు కుల, మత, జాతి, ఆర్థిక అసమానతలకు అతీతంగా విద్యనందించేందుకు విద్యను హక్కుగా గుర్తించి అమలు చేస్తున్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిరోధక : 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టడం నేరంగా భావిస్తూ 1986లో బాల కార్మిక నిరోధక చట్టాన్ని అమలులోకి తెచ్చింది. 14-18 ఏళ్ల బాలలను ప్రమాదకర ఉద్యోగాలలో పెట్టడాన్ని ఈ చట్టం నిరోధించింది.

బాల్య వివాహ నిషేధం (2006): 18 ఏళ్ల కంటే తక్కువ వయసున్న అమ్మాయిలు, 21 ఏళ్ల కంటే తక్కువ వయసున్న అబ్బాయిలకు పెళ్లిళు చేయడం నేరం. ఒక వేళ ఇలాంటి వివాహం జరిగినా దానిని



చెల్లకూడని పెళ్లిగా చట్టం నిర్దేశిస్తుంది.

రక్షణగా 1098: ఎవరైనా చిన్నారి ప్రమాదంలో ఉన్నారనిపిస్తే చైల్డ్‌లైన్ నెంబరు 1098కు ఫోన్ చేస్తే సంబంధిత అధికారులు స్పందించి రక్షణ కల్పిస్తారు. ఈ నెంబర్ 24 గంటలు అందుబాటులో ఉంటుంది.

అత్యాచారాల నుంచి రక్షణ: లింగ వివక్ష లేకుండా.. ఎవరైనా పిల్లలు(18 ఏళ్ల లోపు) లైంగిక దాడులు, వేధింపులకు గురైతే వారికి రక్షణ కల్పించడమే పోక్సో చట్టం(2012) ఉద్దేశం. నేర తీవ్రతనుబట్టి జీవిత ఖైదు లేదా ఉరిశిక్ష కూడా విధించే అవకాశం ఉంది. కేసుల విచారణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేసింది. ఉచిత న్యాయ సహాయం: న్యాయసేవాధికార చట్ట ప్రకారం బాలలందరూ ఉచిత న్యాయ సహాయానికి అర్హులే. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టులలో న్యాయసేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చు.

పిల్లలను చైతన్య పరిస్తే లక్ష్యం నెరవేరుతుంది

బాలల రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నప్పటికీ, వాటిపై అవగాహన లేకపోవటం వల్ల సరైన న్యాయం పొందలేకపోతున్నారు. పిల్లలను చైతన్యపరిచే ఉద్దేశంతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలలో న్యాయవిజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నాం. సమాజంలోని ప్రతి ఒక్కరూ చట్టాలు తెలుసుకొని తమ పిల్లలను చైతన్యపరిస్తే లక్ష్యం నెరవేరుతుంది. ఈ మేరకు కృషి చేయాల్సిన బాధ్యత పెద్దలపై ఉంది.

పి.లక్ష్మీశారద, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, సూర్యాపేట

# మోత మోగుతోంది



హైదరాబాద్: రాజేంద్రనగర్, కార్వాన్, నార్సింగి, మణికొండ ప్రాంతాల్లో శబ్ద అవధి 100 డెసిబుల్స్ దాటింది. ఇది సురక్షిత పరిమితి కంటే రెట్టింపు. మోడిఫైడ్ బైక్ సైలెన్సర్లు, డీజే హారన్ స్పీకర్లతో ఆయా ప్రాంతాల్లో మోత మోగుతోంది. ఇదిలాగే కొనసాగితే వినికిడి లోపం కేసులు పెరిగే అవకాశముంది. నవజాత శిశువులు, వృద్ధులపై ఎక్కువ ప్రభావం పడుతుంది. పరిమితికి మించి.. జూబ్లీహిల్స్, తార్నాకలు నివాస ప్రాంతాలుగా, అబిడ్స్, జేఎన్టీయూ(కూకట్‌పల్లి), ప్యారడైజ్‌ను వాణిజ్య, సనత్‌నగర్, జీడిమెట్లను పారిశ్రామిక ప్రాంతాలుగా జూపార్కు, గచ్చిబౌలి, హెచ్‌సీయూను సున్నిత ప్రదేశాలుగా గుర్తించి పీసీబీ శబ్ద అవధిని లెక్కిస్తోంది. పారిశ్రామిక ప్రాంతాల్లో ఉదయం 75, రాత్రి 70 డెసిబుళ్లు ఉండాలి. వాణిజ్య ప్రాంతాల్లో ఉదయం 65, రాత్రి 55, నివాస ప్రదేశాల్లో ఉదయం 55, రాత్రి 40, సున్నిత ప్రాంతాల్లో ఉదయం 50, రాత్రి 40 డెసిబుళు ఉండాలి. కానీ పరిమితికి మించి నమోదవుతున్నాయి.

**కారణాలు..**ట్రాఫిక్- 2019 నుంచి 2025 మధ్య వాహనాల సంఖ్య 50శాతం పెరిగింది. అనవసరంగా హారన్ కొట్టడం, మార్చిన బైక్ సైలెన్సర్లు, భారీ ట్రాఫిక్‌తో శబ్ద అవధి పెరుగుతోంది.

నిర్మాణాలు, పట్టణీకరణ - గచ్చిబౌలి, తెల్లాపూర్, కోకాపేట్‌లో నిర్మాణ రంగం వృద్ధి చెందుతోంది. ఇక్కడ నిత్యం డ్రిల్లింగ్, ఎక్స్కవేషన్ శబ్దాల మోత మోగుతోంది.

పబ్‌లు - సౌండ్ ప్రూఫ్ లేని పబ్‌ల నుంచి వెలువడే సంగీతం.

విక్రేతలు - విక్రేతలు వినియోగించే స్పీకర్లు.

ఇతరాలు - పారిశ్రామిక కార్యకలాపాలు.

హద్దు మీరితే..

చప్పుడు మితిమీరితే గుండె కొట్టుకునే వేగం, రక్తపీడనం పెరుగుతుంది. 65 డెసిబుళ్ల చప్పుడు మీరితే గుండె జబ్బులు, వినికిడి లోపం రావచ్చు. శక్తిని కోల్పోవడం, నిద్రలేమి, తలనొప్పి, అలసట.

సీపీసీబీ నివేదిక ప్రకారం ఇటీవల నమోదైన శబ్ద అవధి (డెసిబుళ్లలో)

ఏం చేయాలి..శబ్ద తీవ్రత ఎక్కడ నుంచి వెలువడుతుందో గుర్తించే యాకోస్టిక్ కెమెరాలు సున్నిత, నివాస ప్రాంతాల్లో అమర్చాలి. బాధ్యులపై భారీగా జరిమానాలు విధించాలి. హారన్ వినియోగాన్ని తగ్గించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. రియల్ టైమ్ నాయిస్ మానిటరింగ్ కేంద్రాలను పెంచాలి. పబ్ ఇతర ప్రదేశాల్లో సౌండ్ ప్రూఫింగ్‌ను తప్పనిసరి చేయాలి.

# వనరుల్లో మేటలు.. డంపుల్లో ఊటలు



మల్లాపూర్ : గోదావరి తీర ప్రాంతాలతో పాటు వాగుల నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలించొద్దని జిల్లా స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా క్షేత్ర స్థాయి యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. దీంతో మల్లాపూర్ మండల పరిధిలో వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లలో ఇసుక తరలిపోతోంది.

**ఎక్కడెక్కడ?**

గతంలో ఎన్నడూ లేనంతగా గోదావరికి రెండు నెలలు నిరాటంకంగా వరద ప్రవాహం కొనసాగడంతో నదిలో భారీగా ఇసుక మేటలు వేశాయి. పెద్దవాగులోనూ గతంలో కంటే అధికంగా ఇసుక నిల్వలు పేరుకుపోయాయి.

మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లోని గోదావరి తీర ప్రాంతాలతో పాటు పెద్దవాగు పరిసర గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇసుక డంపులే దర్శనమిస్తున్నాయి.

అక్రమార్కులు రాత్రి వేళల్లో ఇసుక తరలించేందుకు అనువుగా ఉన్న పలు ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారు.

టిప్పర్లు, ట్రాక్టర్లు నదిలోకి దిగే అవకాశం లేకపోవడంతో రవాణాదారులు ఒడ్డున ఉన్న ప్రాంతాల్లో భారీగా ఇసుక డంప్‌లు ఏర్పాటు చేసి అక్కడి నుంచి దూర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం రాత్రి వేళల్లో ఇసుక తరలిపోతున్నా మైనింగ్ అధికారులు స్పందించకపోవడం వెనక మతలబు ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న ప్రాంతాలను మైనింగ్ అధికారులు గుర్తించి రీచ్‌లు ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరనుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వాల్గొండ శివారులోని గోదావరి వద్ద ఓ రైతు పొలంలో రెండు రోజుల కిందట ఇసుక ట్రాక్టర్ బోల్తా పడి పంట నష్టం జరిగింది.

వాహనాల వినియోగంలోనూ ఉల్లంఘన

ఇసుక రవాణాదారులు వాహనాల వినియోగంలోనూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. వ్యవసాయ అవసరాల కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. రవాణా సమయంలో అధికారులు పట్టుకుంటారని వేగంగా వెళ్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇసుక ట్రాక్టర్లకు నంబర్ ప్లేట్లు లేకపోవడం, రాత్రి వేళ వాటిని గుర్తించేలా ముందు, వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు, ఇండికేటర్లు లేకపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

**టాస్క్‌ఫోర్స్ బృందాలతో పర్యవేక్షణ**

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా నిరోధానికి రెవెన్యూ, మైనింగ్, పోలీస్, ఆర్టీయే అధికారులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాం. గత నాలుగు నెలల్లో 56 ట్రాక్టర్లను పట్టుకొని రూ.7.97 లక్షల జరిమానా విధించాం. మొదటిసారి పట్టుబడితే రూ.25 వేలు, రెండోసారి రూ.50 వేల చొప్పున జరిమానా విధిస్తున్నాం. జయసింహ, మైనింగ్ ఏడీ, జగిత్యాల

# స్వామీ.. లడ్డూ రుచి లేదేమి?

కరీంనగర్ : వేములవాడ రాజన్న ప్రసాదం లడ్డూ ఇది. ఇందులో కిస్‌మిస్, కాజు, ఇలాచీల జాడ తక్కువగానే కనిపిస్తోంది. ధర మాత్రం లడ్డుకు రూ.20. కొన్నిసార్లు అప్పటికప్పుడు తయారు చేస్తూ కౌంటర్లకు తెస్తుండటంతో చేతికి చేరే లోపు విచ్చుకుపోతోంది. ఇది కొండగట్టు అంజన్న ప్రసాదం. ఈ లడ్డూలోనూ ఘుమఘుమలు కరవయ్యాయి. కాజు, కిస్‌మిస్‌ల ఆనవాళ్లు అయిదారు లడ్డూల్లో వెతికితే ఒక్కదాంట్లో దొరుకుతాయి. రుచి కూడా గతంలోలా లేదు. ఇక ధర మాత్రం రూ.25. లడ్డూ పట్టుకోగానే విచ్చుకుపోతోందని భక్తులు వాపోతున్నారు. ఇది.. ధర్మపురి లక్ష్మీనరసింహాస్వామి దేవాలయంలోని లడ్డూ. ప్రసాదం సువాసన గతంలోలా ముక్కుపుటాలను తాకట్లేదు. నాణ్యత విషయంలోనూ స్పష్టమైన తేడా ఉందని భక్తులు పేర్కొంటున్నారు. రూ.20 వసూలు చేస్తున్నా.. అందుకు తగిన విధంగా రుచి ఉండటం లేదు. ఇష్టదైవం సన్నిధిలో ఇష్టంగా కొనుగోలు చేసే లడ్డూ ప్రసాదం సువాసన గతంలోలా లేదు. వేములవాడ, ధర్మపురి, కొండగట్టు పుణ్యక్షేత్రాల్లో ఈ పరిస్థితి నెలకొంది. రోజుకు సగటున 3 వేలు, శని.. ఆదివారాల్లో 4 వేలకుపైగా భక్తులు లడ్డూలు కొనుగోలు చేస్తుంటారు. కొన్ని నెలల కిందట తిరుమలలో లడ్డూ నాణ్యత విషయంలో దుమారం చెలరేగిన తరువాత ఇక్కడ కూడా తయారీకి వాడే నెయ్యిని మార్చారు.

**నాణ్యత.. పరిమాణం!**

రుచి, శుచి, నాణ్యత, పరిమాణం విషయంలో స్పష్టంగా తేడాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం సరఫరా అయ్యే నెయ్యిని కిలోకు రూ.609 ధరతో ఆలయాలకు సరఫరా చేస్తున్నారు. గతంలో వాడే నెయ్యికి రూ.621 చెల్లించేవారు. 10 కిలోల లడ్డూ తయారీకి విధిగా 7 కిలోల




నెయ్యి వాడాలి. కానీ ఇంతకన్నా తక్కువ వాడుతున్నట్లు అర్థమవుతోంది. 20 కిలోల చక్కెర, 700 గ్రాముల కాజు, 750 గ్రాముల కిస్‌మిస్‌లు, 100 గ్రాముల యాలకులు, 10 గ్రాముల కర్పూరం, 10 గ్రాముల జాజికాయ, 500 గ్రాముల మిశ్రి వేయాలి. కానీ యాలకుల ధర పెరగడంతో వాటి వినియోగం తగ్గుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో మునుపటి సువాసన, రుచి కనపడటం లేదు. కేవలం లడ్డూ విక్రయాల ద్వారా ఈ మూడు ఆలయాల్లో ఏడాదికి రూ.6 కోట్లకుపైగా ఆదాయం వస్తుంది. ఇందుకు తగినట్లుగా నాణ్యతపై దృష్టి సారిస్తే భక్తులకు మేలు జరగనుంది.

**ఫిర్యాదులు రాలేదు**

లడ్డూ ప్రసాదాల నాణ్యత విషయమై ధర్మపురి, కొండగట్టు ఆలయాల ఈవోలు సంకటాల శ్రీనివాస్, శ్రీకాంతరావులతో మాట్లాడగా ప్రసాదాల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు భక్తుల నుంచి తమకెలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు. రుచి, సువాసన విషయం పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

# బయో.. భయం

సూర్యాపేట : జిల్లాలో బయోవ్యర్థాల నిర్వహణ లోపాలు ప్రజలకు శాపాలుగా మారుతున్నాయి. ఎక్కడ పడితే అక్కడ కన్పిస్తుండటం, పలు చోట్ల పేరుకుపోతుండటంతో జనం ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కంట్రాక్టు పొందిన వారు నిర్దేశిత సమయంలో సేకరించడంలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.

ఆసుపత్రికి సంబంధించిన వ్యర్థాలను ఎరుపు, పసుపు, నీలి, నలుపు నాలుగు రకాలుగా విభజించి సేకరిస్తారు. ఎరుపు అంటే సిరంజ్‌లు, గ్లూకోజ్ సీసాలు, పసుపువి రక్తం మరకలతోకూడిన వ్యర్థాలు, నీలి రంగుకు సంబంధించినవి గాజు సీసాలు, నలుపు రంగులో మున్సిపాలిటికీ సంబంధించిన వ్యర్థాలుంటాయి.

సూర్యాపేట పురపాలికలో బయోవ్యర్థాల రీసైక్లింగ్ ప్లాంటు ఏర్పాటుకు నోచుకోవడం లేదు. ఇక్కడ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వ్యర్థాలను




రోమా ఇండస్ట్రీస్ కంపెనీ వారు సేకరిస్తున్నారు. పట్టణంలోని అన్ని ఆసుపత్రుల నుంచి నిత్యం 200 కిలోల వరకు వ్యర్థాలను సేకరిస్తున్నట్లు రోమా ఇండస్ట్రీస్ ప్రతినిధి అనిల్‌కుమార్ తెలిపారు. ఇక్కడ సేకరించిన బయోవ్యర్థాలను భువనగిరి పరిధిలోని వ్యర్థాల నిర్వహణ కేంద్రానికి తరలిస్తారు. అక్కడ కాల్చివేసి బూడిదను పూడ్చివేస్తారు. ప్రైవేటు ఆసుపత్రులకు సంబంధించి 30 పడకలకు కిలోకు రూ.9, 50 పడకలకు రూ.12 చొప్పున వసూలు చేస్తారు. ఈ వాహనం రెండురోజులకు ఒకసారి వస్తుంది.

హుజూర్‌నగర్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బయోవ్యర్థాల నిర్వహణ జరుగుతోంది. రోజుకు 7 నుంచి 8 కిలోల వ్యర్థాలను గుత్తేదారు సేకరిస్తున్నారు. ఇందుకు ప్రత్యేకమైన వాహనం వస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల నుంచి విధిగా సేకరిస్తున్నారు.

అపరిశుభ్రత: నేరేడుచర్ల: నేరేడుచర్ల పురపాలికలో బయోవ్యర్థాల రీసైక్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయలేదు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాల్సి ఉన్నా ఆచరించడం లేదు. పాత నేరేడుచర్లలో రోడ్డు పక్కన డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసి పోస్తున్న వ్యర్థాలను పందులు చిందరవందర చేస్తుండటంతో రోడ్డుపైకి చేరుతున్నాయి. కొన్ని వ్యర్థాలను కాల్చివేస్తుండటంతో పొగ.. కాలుష్య సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేరేడుచర్ల పీహెచ్‌సీలో ఎరుపు(ప్లాస్టిక్ వ్యర్థాలు), పసుపు(రక్తసంబంధిత), నీలి(గ్లాసులు), నలుపు(ఇతర వ్యర్థాలు) వేసేందుకు ఆసుపత్రి వెనుక ప్రత్యేకంగా నిర్మాణం చేపట్టారు. జిల్లా నుంచి రోమా ఇన్‌ఫ్రా వాహనం 15 రోజులకోసారి వ్యర్థాలు తీసుకెళ్లాల్సి ఉండగా నెలరోజులుగా రావడం లేదు. వ్యర్థాల నిర్వహణకు వారు ప్రత్యేకంగా కవర్లను అందించాల్సి ఉంది.

ఈ విషయాన్ని పీహెచ్‌సీ వైద్యాకారిణి డా.నాగిని దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా పక్షం రోజులకోసారి సేకరించాల్సి ఉండగా నెలరోజులుగా రావడంలేదని, సేకరించే కవర్లు కూడా లేవని తెలిపారు.

# క్షేత్రంపై.. నిఘానేత్రం

యాదగిరిగుట్ట: దిల్లీ ఘటన నేపథ్యంలో పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో పోలీసులు అప్రమత్తమవుతున్నారు. ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. క్షేత్రంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఆలయ భద్రత కోసం ప్రభుత్వం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్) సిబ్బందిని ఏర్పాటు చేసింది. 66 మందిని కేటాయించినా, ప్రస్తుతం 43 మంది జవాన్ల ద్వారా భద్రత కొనసాగుతోంది. మూడంచెల విధానంలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. గుట్ట పరిసరాలు, పట్టణంతో పాటు క్షేత్రంలో శాంతి భద్రతల కోసం ఆర్‌ఐ పర్యవేక్షణలో తృతీయ దశ.. బాంబ్, డాగ్ స్క్వాడ్ సోదాలతో ద్వితీయ దశ.. హోం గార్డులతో ప్రథమ దశలో భద్రతా చర్యలు అమలవుతున్నాయి. బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు భక్తుల లగేజీ, అనుమాన ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాయి. కమాండ్ కంట్రోల్ ద్వారా ప్రధానాలయం, పాతగుట్ట అనుబంధ ఆలయాల చెంత 148 సీసీ కెమెరాలతో నిఘా కొనసాగుతోంది.

పంచనారసింహుల గర్భాలయంపై గల స్వర్ణవిమానం, మహాముఖ మండపంలోని స్వర్ణధ్వజ స్తంభం గల ప్రధాన దేవాలయం వద్ద నలుగురు సాయుధ పోలీసులతో గస్తీ కొనసాగుతోంది.

సీసీటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ నుంచి సిబ్బంది పర్యవేక్షణ నిత్యం ఉంటోంది. అనుమానాస్పదంగా ఎవరు వ్యవహరించినా వెంటనే భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేస్తారు. స్వర్ణవిమానం భద్రత కోసం సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.



**మరిన్ని చర్యలు: ఈవో**

ఉగ్రవాద చర్యలు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకునేందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు గుట్టలో మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు ఆలయ ఈవో వెంకట్రావు తెలిపారు. కొండపైకి వచ్చే ప్రతీ వాహనాన్ని నిశితంగా పరిశీలించేందుకు స్కానింగ్ పద్ధతిని ప్రవేశ పెడతామన్నారు. పోలీసు, ఎస్పీఎఫ్, బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలతోనే కాకుండా సాయుధ పోలీసు బలగాలతో బందోబస్తు చర్యలు నిరంతరం చేపడుతున్నట్లు వివరించారు.

విధుల్లో ఉండే సిబ్బంది వివరాలు

రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ - 1

ఎస్సై- 2

ఏఎస్‌ఐ - 5

హెడ్ కానిస్టేబుళ్లు - 9

హోం గార్డులు - 25

ఎస్ఎల్ఆర్ వెపన్స్‌తో - 4

చురకలు



# భవితకు భరోసా

ముస్తాబాద్ : ఎవరో ఒకరు తోడుంటే కానీ అడుగు కూడా వేయలేరు. సొంత అవసరాలు కూడా తీర్చుకోలేరు. ఇలా ప్రత్యేకావసరాలు కలిగిన శారీరక, మానసిక, వైకల్యం ఉన్న దివ్యాంగ చిన్నారులకు భరోసా కల్పించడం కోసం.. విద్యా, వైద్య సేవలు అందించేందుకు భవిత కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వైకల్యంతో పుట్టిన చిన్నారుల భవితవ్యం తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తూ వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్నాయి.

**మండలానికో కేంద్రం..**

ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో ఒక భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. జిల్లాలో 13 భవిత కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లో కలిపి 988 మంది ప్రత్యేకావసరాల పిల్లలు ఉన్నారు.

ఒక్కో కేంద్రంలో ఇద్దరు టీచర్లు, ఒక ఫిజియోథెరపిస్ట్, ఒక ఆయా ఉండాలి. కానీ.. జిల్లాలోని 13 కేంద్రాల్లో 10 కేంద్రాల్లో ఉపాధ్యాయులు (ఐఆర్‌పీలు).. ముగ్గురు ఫిజియోథెరపిస్టులు ఉన్నారు.

సిరిసిల్ల, వేములవాడ, గంభీరావుపేట కేజీటూ పీజీలో పక్కా ప్రత్యేక భవిత కేంద్రం భవనాలు ఉన్నాయి. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, రుద్రంగి మండలాల్లో ఐఆర్‌పీలులేక ఇన్‌ఛార్జిలతో కొనసాగుతున్నాయి.

ప్రతి వారంలో రెండు రోజులు ఫిజియోథెరపీ నిర్వహిస్తారు. కేంద్రాలకు రాని పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి విద్యాబోధన సేవలందిస్తున్నారు.

కేంద్రాలకు వచ్చే బాలికలకు రూ.700, బాలురకు రూ.500 రవాణా భత్యం కూడా ఇస్తున్నారు. పాఠశాలల్లో వారికి ఐఆర్‌పీలు విద్యాబోధన



చేస్తున్నారు.

**21 రకాల సేవలు**

విద్యార్థుల మానసిక, శారీరక పరిస్థితి అనుగుణంగా శిక్షణ, విద్యాబోధన ఉంటుంది. 5 నుంచి 18 ఏళ్ల మధ్య వయసుగల వారు 21 వైకల్యాలలో ఏదైనా ఒకదానితో బాధపడినా ఈ పాఠశాలల్లో ప్రవేశానికి అర్హులు. వినికిడి లోపం ఉన్నవారికి సైగలు, ఆటిజంతో బాధపడేవారికి స్పర్శ, సంగీతం, మాటలురానివారికి ధ్వనితో తమ పనులు తాము చేసుకునేలా సేవలు అందుతున్నాయి.

**పిల్లలు పాఠశాలకు వచ్చేలా చర్యలు**

ముందుగా గ్రామాల్లో ప్రత్యేకావసరాల పిల్లలను గుర్తిస్తాం. పాఠశాలకు (భవిత) కేంద్రానికి వచ్చేందుకు సంసిద్ధులుగా (స్కూల్ రెడీనెస్ ప్రోగ్రాం) నిర్వహిస్తాం. పాఠశాలకు వచ్చేలా చూస్తాం. ఫిజియోథెరపీ చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. సదరం లేని పిల్లలను గుర్తించి సదరం క్యాంపునకు హాజరయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి శనివారం భవిత కేంద్రానికి రాలేని పిల్లలను గుర్తించి వారి ఇంటి వద్దకే వెళ్లి విద్యను అందిస్తున్నాం.

గౌతమి, ఐఆర్‌పీ, ముస్తాబాద్

**ఫిజియోథెరపీతో మార్పు** ప్రత్యేకావసరాల పిల్లలకు ప్రతి శుక్ర, శనివారాల్లో ఫిజియోథెరపీ చేస్తున్నాం. సానుకూల ఫలితాలు వస్తున్నాయి. పిల్లల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి మండల కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను తప్పనిసరిగా వినియోగించుకోవాలి. పిల్లల్లో సానుకూల మార్పు కోరుకోవాలి. అర్హులందరూ సద్వినియోగం చేసుకుంటే సత్ఫలితం ఉంటుంది. బొగన్నగారి రాజేశ్, ఫిజియోథెరపిస్ట్

# అందని శ్వాస.. చలితో గజగజ

పెద్దపల్లి : వాతావరణంలో మార్పులు, కాలుష్య కారకాలతో పిల్లలు, వృద్ధులు నిమోనియా బారినపడుతున్నారు. వైరస్, బ్యాక్టీరియా లక్షణాలు సోకి ఊపిరితిత్తుల సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. పుట్టిన బిడ్డకూ లక్షణాలు సోకడం ఆందోళన కలిగిస్తోంది. చలి నేపథ్యంలో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా మారుతోంది. నేడు 'ప్రపంచ నిమోనియా దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం.

**15 శాతం మందికి..**

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే ప్రతీ వంద మంది పిల్లలు, వృద్ధుల్లో పదిహేను శాతం మందికి నిమోనియా లక్షణాలు ఉన్నట్లు వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. చలికాలంలో చిన్నారులు, వృద్ధుల్లో శ్వాసకోశ సంబంధ వ్యాధుల తీవ్రత పెరగనుంది. రెండేళ్లలోపు పిల్లల్లో అధికంగా సమస్య ఉంటుంది. బరువు తక్కువగా పుట్టిన, పోషకాహారలోపం ఉన్న ఏడాదిలోపువారు అస్వస్థతకు గురవుతుంటారు. చలితో ఊపిరితిత్తులు బిగుసుకుపోతుంటాయి. శ్వాసతీసుకోవడానికి ఇబ్బంది పడుతుంటారు. చలికి దూరంగా ఉంచడం, వెచ్చదానికి మాస్కులు ధరించేలా చూస్తే కాస్త ఉపశమనం పొందొచ్చు.. కారణాలు ఇవి సిగరెట్, తంబాకు, బీడీ, మద్యపానం తాగడం. వాయు కాలుష్యం, పరిశ్రమల పొగ, భరించలేని దుమ్ము,



ధూళి సూక్ష్మ కారకాలు.

వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, బలహీనులు.

తల్లి నుంచి పుట్టిన బిడ్డకు సోకే అవకాశం ఉంటుంది.

**లక్షణాలు ఇలా..**

వైరల్, బ్యాక్టీరియా, ఫంగస్ ఇలా మూడు రకాలుగా ఊపిరితిత్తులకు సోకుతుంది. తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు, గొంతు నొప్పి. చెమట, తీవ్రత ఎక్కువైన వారిలో ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది. సకాలంలో వైద్యులను సంప్రదించాలి

ఊపిరితిత్తులకు వైరస్, బ్యాక్టీరియా సోకి శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుంది. పిల్లలు, వృద్ధుల్లో సమస్య తీవ్రంగా ఉంటుంది. రక్తపోటు, మధుమేహం, కిడ్నీ, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న వారిలో ఇది అధికం. దీనికి అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. సకాలంలో చికిత్స చేస్తే నయం కానుంది.

డాక్టర్ వినయ్ కుమార్, పల్మనాలజిస్టు, కరీంగర్

సొంత వైద్యం వద్దు

ఏడాదిలోపు బరువు తక్కువగా ఉన్న పిల్లలు, పోషకాహారలోపం ఉన్న వారిలో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయి. పాలు తాగకపోవడం, వేగంగా శ్వాస తీసుకోకపోవడం, దగ్గుతో ఇబ్బంది పడుతుంటారు. సొంత వైద్యం తీసుకోకుండా ఆసుపత్రిలో సంప్రదించాలి.

# ఆదాయమెంత.. ఆమోదమెంత?



హైదరాబాద్: ప్రతిపాదనలు రావడమే ఆలస్యం.. జీహెచ్‌ఎంసీ కమిషనర్ కార్యాలయం పచ్చజెండా ఊపేస్తోంది. గతంలో ఏడాది పొడవునా రూ.1,100కోట్ల నిర్వహణ పనులకు ఆమోదించేవారు. గడిచిన ఆరు నెలల్లోనే జీహెచ్‌ఎంసీ ఆ రికార్డును పూర్తి చేసింది. కమిషనర్ కార్యాలయం తీసుకుంటున్న దూకుడు నిర్ణయాలపై జోనల్ కమిషనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీకి వస్తోన్న ఆదాయం, తక్షణం చేపట్టాల్సిన ప్రాజెక్టులు, అధ్వానంగా మారిన రహదారుల గురించి పట్టించుకోకుండా.. జరుగుతాయో, లేదో తెలియని పనులను వందల సంఖ్యలో ఆమోదించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**చార్మినార్‌కు రూ.500 కోట్లపైనే..**

జీహెచ్‌ఎంసీలో 6 జోన్లు ఉన్నాయి. రహదారులు, వరద నీటి కాలువలు, కాలిబాటలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, చెరువుల సుందరీకరణ, నాలాల నిర్వహణ, ఇతరత్రా పనులను జోన్లవారీగా చేపట్టాల్సి ఉంటుంది. ప్రతిపాదనలను జడ్సీ, ఇంజినీర్లు కేంద్ర కార్యాలయానికి పంపిస్తే కమిషనర్లు తనిఖీ చేయించేవారు. పనులు పూర్తయ్యాక కొత్త వాటిని ఆమోదిస్తామని ప్రజాప్రతినిధులకు నచ్చజెప్పేవారు. ఇప్పుడు మెజార్టీ ప్రతిపాదనలు నేరుగా ఆమోదం పొందుతున్నాయి. 6 నెలల్లో చార్మినార్ జోన్ రూ.500 కోట్లకుపైగా ఆమోదాలతో మొదటిస్థానంలో ఉంది. రూ.200 కోట్లతో శేరిలింగంపల్లి, ఖైరతాబాద్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కూకట్‌పల్లి, ఎల్బీనగర్, సికింద్రాబాద్ నామమాత్రమే.

**పని చేయకుండానే..**

ఎక్కువ పనులను ఆమోదించుకోవడం, టెండర్లు పిలిచి, గుత్తేదారులకు పనులు అప్పగించడంపైనే ప్రజాప్రతినిధులు దృష్టి పెడుతున్నారు. పనులు చేయించడంపై ఆసక్తి చూపట్లేదనే విమర్శలున్నాయి. పనులు చేయకుండా బిల్లులు తీసుకున్న ఏజెన్సీలు, బిల్లులు ఇచ్చిన ఇంజినీర్ల విషయమై ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఇటీవల కమిషనర్‌కు లేఖ రాశారు. పని చేయకుండానే సింగరేణికాలనీలో సీసీ రోడ్డు, ఓ కమ్యూనిటీహాల్, వరద నాలా నిర్మించినట్టు బిల్లులు తీసుకున్న గుత్తేదారు, ఆమోదించిన ఇంజినీర్ల అవినీతిని సైదాబాద్ కార్పొరేటర్ వెలుగులోకి తెచ్చారు. ఇలాగే కొనసాగితే 2025-26 ఆర్థిక సంవత్సరం ఆమోదాల విలువ రూ.2 వేల కోట్లకు చేరుకుంటుందని, ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సి ఉంది.

అప్పుల కుప్ప..జీహెచ్‌ఎంసీ వార్షిక ఆదాయం రూ.4,500 కోట్లు

అప్పులు రూ.5,000 కోట్లు

ఉద్యోగుల జీతాలు, పింఛన్లు రూ.120 కోట్లు

ప్రతినెలా అప్పులకు చెల్లించే కిస్తీ రూ.320 కోట్లు (ఎస్సార్డీపీ ప్రాజెక్టు, ట్రైడ్స్ కార్యక్రమం)

# సజ్జనారే సరిదిద్దాలి!




హైదరాబాద్: దిల్లీలో భారీ పేలుడు నేపథ్యంలో నిత్యం ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసిపోయే ఎంజీబీఎస్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరమెంతైనా ఉంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాదిలోని పలు జిల్లాలకు ఇక్కడి నుంచి నిత్యం సుమారు లక్ష మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రోజూ నాలుగు వేలకు పైచిలుకు రాష్ట్ర, అంతరాష్ట్ర బస్సులు నడుపుతున్నారు. పండగలు, పెళ్లిళ్లు, విద్యా సంస్థల సెలవుల సమయంలో రద్దీ అధికంగా ఉంటోంది. గతంలో గాంధీ విగ్రహం వద్ద మెటల్, హ్యాండ్ డిటెక్టర్లు ఉండేవి. వాటిని కొన్నేళ్ల క్రితమే ఆర్టీసీ అధికారులు తొలగించారు. గతంలో ఒక ఎస్సై, నలుగురు కానిస్టేబుళ్లు, మఫ్టీ పోలీసులు అన్ని ఫాట్‌ఫారాలు, అనుమానిత వ్యక్తులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో పని చేసేవారు. సిబ్బంది కొరత కారణంగా ప్రస్తుతం ఎంజీబీఎస్‌లోని పోలీసు అవుట్ పోస్టులో కేవలం ఒక కానిస్టేబుల్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఎంజీబీఎస్‌లోని అన్ని ఫ్లాట్‌ఫారాలు, పోర్టికో, అలైటింగ్ పాయింట్ల వద్ద రూఫ్‌నకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పావురాలు ఎక్కువగా సంచరిస్తుండటం వల్ల సీసీ కెమెరాలకు అమర్చిన కనెక్షన్లు లూజ్ అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. విజిలెన్స్ విభాగం అధికారుల పర్యవేక్షణలో ప్రయాణికుల భద్రతకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతోంది. గతంలో టీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించిన వీసీ. సజ్జనార్ ఇటీవలే నగర పోలీసు కమీషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి పరిస్థితిలపై ఆయనకు పూర్తి అవగాహన ఉంది. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల్లో జన సమ్మర్దం అధికంగా ఉంటుంది. ఈ ప్రాంతాలే ఉగ్రవాదుల లక్ష్యంగా ఉండటంతో ప్రయాణికుల భద్రతపై మరింత రక్షణ చర్యలు, పకడ్బందీ విధానాలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎంజీబీఎస్‌లోని ప్రధాన ప్రవేశ మార్గం నుంచి ప్లాట్‌ఫారాల సమీపం వరకూ ప్రయాణికులను తరలించేందుకు బ్యాటరీ సహాయంతో నడిచే రెండు వాహనాలు ఉండేవి. వాటి బ్యాటరీలు చెడిపోవడంతో కొన్ని రోజులుగా మూలన పడేశారు.

బస్‌స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల సంఖ్య 64

మూడు షిఫ్టులుగా పని చేసే సెక్యూరిటీ సిబ్బంది 80

సీసీ కెమెరాల సంఖ్య మొత్తం 125, వీటిలో పాడైనవి 10

**నాంపల్లిలో పోలీసుల విస్తృత సోదాలు**

రెడ్ అలెర్ట్ నేపథ్యంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్), గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్‌పీ) పోలీసులు అప్రమత్తమయ్యారు. మంగళవారం నాంపల్లి రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన, జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో పోలీసు బలగాలు, జాగిలాలతో ప్లాట్‌ఫామ్‌లు, వెయిటింగ్ రూమ్‌లు, సర్క్యులేటింగ్ ఏరియా, పార్సిల్ కౌంటర్లు, రైలు బోగీలు, బుకింగ్ కార్యాలయం, వాహనాల పార్కింగ్ స్థలం, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలతో పాటు ప్రతి ప్రయాణికుడిని, లగేజీలను తనిఖీ చేశారు.

**భద్రతా ప్రమాణాలు పెంపొందించేందుకు కృషి**

గతంలో ఉన్న మెటల్, హ్యాండ్ డిటెక్టర్లు మళ్లీ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే బ్యాటరీ వాహనాలకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెస్తాం. సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ ద్వారా నిరంతరం విజిలెన్స్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. టీజీఎస్‌ఆర్టీసీ ఈడీ, ఆర్‌ఎం, విజిలెన్స్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ప్రయాణికులకు మెరుగైన రవాణా సదుపాయాలతో పాటు సురక్షిత ప్రయాణం, ఎంజీబీఎస్‌లో అన్ని సదుపాయాలు మెరుగుపరుస్తున్నాం. వై.సుఖేందర్‌రెడ్డి, సీఆర్‌ఎం, ఎంజీబీఎస్

# వసతులు భ్రాంతి.. రైతుకేదీ విశ్రాంతి?



హైదరాబాద్:నగరంలో పెద్దదైన బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో గతంలో ఏర్పాటు చేసిన రైతుల విశ్రాంతి భవనం నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు తీసుకొచ్చే రైతులు సేదదీరేందుకు పరిపాలన భవనం పక్కనే ఉన్న క్యాంటీన్ పైఅంతస్తులో దీనిని ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు కూరగాయలు, ఇతర పంటల విక్రయాలు పూర్తి చేసుకుని తిరిగి వెళ్లేందుకు కొన్ని రోజులు ఇక్కడ ఉండాల్సి ఉంటుంది. దీంతో వారు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన భవనంలో తొలుత అన్ని వసతులు కల్పించారు. అనంతరం దీని నిర్వహణను మార్కెట్ కమిటీ అధికారులు, ప్రతినిధులు పట్టించుకోక పోవడంతో అధ్వానంగా తయారైంది.

**నిత్యం వేలాది మంది రైతుల రాక**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2002లో 174 దుకాణాలు, మార్కెట్ కమిటీ కార్యాలయం, క్యాంటీన్, రైతులు, హమాలీల విశ్రాంతి భవనాలతో ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇరు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది రైతులు నిత్యం ఈ మార్కెట్‌కు 30 వేల నుంచి 35 వేల క్వింటాళ్ల కూరగాయలు తీసుకొస్తుంటారు. వీరు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన భవనంలోని ఫ్యాన్లు దెబ్బతిన్నాయి. మంచాలు శిథిలావస్థకు చేరాయి. భవనంలో అపరిశుభ్రత నెలకొంది. తాగునీటి వసతి లేదు. మరుగుదొడ్ల పరిస్థితి దయనీయంగా మారింది.

**వారం రోజులుగా ఇబ్బంది పడుతున్నా**

పల్లీల విక్రయం కోసం వారం కిందట మార్కెట్‌కు వచ్చా. అప్పటి నుంచి దుకాణం వద్దే ఉంటున్నా. గతంలో ఇక్కడి రైతు విశ్రాంతి భవనం ఎంతో బాగుండేది. ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం.

నారాయణప్ప, అనంతపురం జిల్లా శింగనమల

రూ.10 లక్షలతో ప్రతిపాదనలు

శిథిలావస్థకు చేరిన రైతు విశ్రాంతి భవనాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.10 లక్షలతో ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపాం. అప్పటి వరకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు సేదదీరేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. రాగిరి ఆనంద్‌బాబుగౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్

# కామర్స్‌కే మొగ్గు..

కరీంనగర్ : ఇంటర్ పూర్తయిన తరువాత చాలా మంది విద్యార్థులు డిగ్రీలో ఉపాధి లభించే కోర్సులను ఎంపిక చేసుకోవడానికి మొగ్గు చూపుతున్నారు. విపణిలో త్వరగా ఉపాధి లభిస్తుందని కామర్స్ కోర్సు తీసుకుంటున్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గల డిగ్రీ కళాశాలల్లో గత మూడేళ్లలో బీకాం కోర్సులో చేరిన విద్యార్థుల సంఖ్యే అధికంగా ఉంది. దీన్ని బట్టి ఈ కోర్సు ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

**ఏ గ్రూపు వారైనా చేరవచ్చు**

శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్, ఫైనాన్స్, బిజినెస్ అకౌంటెన్సీ, రిటెయిల్ ఆపరేషన్స్ కోర్సులున్నాయి. ఇవి పూర్తి చేసినవారికి విపణిలో.. ముఖ్యంగా వ్యాపార రంగంలో అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. విద్యుత్తు శాఖలో జేఏఓగా ఈ కోర్సు చదివిన విద్యార్థులే 60 శాతం మంది ఉద్యోగాలు సాధిస్తున్నారు. అలాగే కార్పొరేట్ సంస్థల్లో, టాక్స్ కన్సల్టెంట్ వద్ద అకౌంటెంట్‌గా



చేరిపోవచ్చు. ఎంకాం పూర్తి చేసిన విద్యార్థులు బోధన రంగం వైపు వెళ్లవచ్చు. ఎంబీఏ చేస్తే మరింత మెరుగైన ఉద్యోగావకాశాలను పొందడానికి అవకాశం ఉంటుంది. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఆర్ట్స్ గ్రూపుల్లో ఏది పూర్తి చేసిన వారైనా డిగ్రీలో బీకాంలో చేరడానికి అవకాశం ఉంటుంది. ఈ కారణాలతోనే మెజార్టీ విద్యార్థులు ఈ కోర్సులో చేరుతున్నారు.

**అకౌంటెంట్‌గా ఉద్యోగం చేస్తా..**

మాది మల్కాపూర్. అమ్మ వ్యవసాయ పనులు చేస్తుంటుంది. నాన్న గతంలోనే మరణించారు. బీకాం పూర్తి కాగానే ఏదైనా సంస్థలో అకౌంటెంట్‌గా చేరి అమ్మకు సాయపడవచ్చని ఈ కోర్సులో చేరా. చాలా మంది నా తోటి విద్యార్థులు కూడా ఇలాగే కోర్సులో చేరినట్టు చెబుతుంటారు. ప్రస్తుతం కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరం చదువుతున్నా. మరో రెండేళ్లు కష్టపడి ఉద్యోగంలో చేరి కుటుంబానికి అండగా నిలబడతా.

చాట్ల సమత, బీకాం, ఎస్సారార్ డిగ్రీ కళాశాల

**దోస్త్ ప్రవేశాల్లో ప్రథమ స్థానం**

బీకాం కోర్సు వైపే విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. దోస్త్ ప్రవేశాలను పరిశీలిస్తే ప్రథమ స్థానం బీకాం కోర్సుకే దక్కుతుంది. ప్రస్తుతం ప్రతి కార్పోరేట్ సంస్థలో తప్పనిసరిగా అకౌంటెంట్ అవసరం ఉంటుంది. దీంతో బీకాం చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కోర్సు పూర్తవగానే చాలా మంది ఉద్యోగాల్లో చేరిపోతుంటారు. టి.రాజయ్య, బీకాం, హెచ్‌ఓడీ, ఎస్సారార్ కళాశాల

# 'భౌ'బోయ్.. బతకలేం..!

సూర్యాపేట: క్రీడా సముదాయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, బస్, రైల్వేస్టేషన్లు తదితర జనసందడి, బహిరంగ ప్రదేశాల్లో వీధి శునకాలు సంచరించకుండా చేయండి. ఆయా సంస్థల ప్రాంగణాల్లోకి అవి చొరబడకుండా కంచెలు నిర్మించాలి. క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలి. వీధి కుక్కలను తక్షణమే షెల్టర్లకు తరలించాలి..' - సుప్రీంకోర్టు ఆదేశం సూర్యాపేట 43వ వార్డు నెహ్రూనగర్‌లో ఆదివారం పిచ్చికుక్క ఐదుగురిని తీవ్రంగా గాయపరిచింది. వీటితోపాటు బాతులు, మేకలపై దాడిచేసింది. యువకుడి చేతికి, వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులు చికిత్స పొందారు. వీరి పరిస్థితిని చూసైనా అధికారులకు కనువిప్పు కలగాలి.

పిచ్చికుక్కలు కరిస్తేనే తెలుస్తుంది బాధ. వాటి దాడితో మరణించిన కుటుంబాల దయనీయ పరిస్థితి ఎవరికీ తెలియదు. కానీ అధికారులు వీటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల సుప్రీంకోర్టు కూడా వీధి కుక్కలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసింది. నేటికీ పురపాలికల్లో చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. కనీసం ఆదేశాల మేరకు నడుచుకోవాలనే ఆలోచన కూడా రావడం లేదు. దీంతో వీధుల్లో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బయటకు వెళ్లాలంటేనే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులు ఇంటికి చేరుకొనే వరకు వారి తల్లిదండ్రుల్లో ఆందోళన ఉంటుంది.

**టీకాలు శూన్యం**

వీధి శునకాలకు ఎక్కడా టీకాలు వేయడం లేదు. జూనోసిస్ డే సందర్భంగా ఒక్కరోజు మాత్రమే పదుల సంఖ్యలో వేస్తున్నారు. కానీ అధికారులు మాత్రం అన్నింటికీ టీకాలు వేసినట్లు చెబుతున్నారు. ఒక్కో వార్డులో వందల సంఖ్యలో



సంచరిస్తున్నాయి. కొన్ని పిచ్చి సోకినవీ ఉన్నాయి. వీటిని గుర్తించి చికిత్స చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

కుక్కల నియంత్రణకు త్వరలో చర్యలు తీసుకుంటామని పుర కమిషనర్లు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

**సంరక్షణ కేంద్రాలేవి?** ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలు ఉన్నాయి. ఒక్క సూర్యాపేట పురపాలికలో మాత్రమే కుక్కల సంరక్షణ కేంద్ర నిర్మాణం చేపట్టారు. ఇక్కడ వార్డుల్లో సంచరిస్తున్న వాటిని పట్టుకొని కు.ని. శస్త్రచికిత్సలు అడపాదడపా చేస్తున్నారు. మిగతా పురపాలికల్లో రెండేళ్ల క్రితం కోర్టు ఆదేశాల మేరకు నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నా నేటికీ ఎలాంటి అతీగతి లేదు. నియంత్రణ కేంద్రాలున్న ప్రాంతాలకు తరలించాలంటే రవాణా భారంతో పాటు ఒక్కో చికిత్సకు రూ.1650 ఖర్చవుతుంది. దీన్ని మోయలేక పురపాలికలు చేతులెత్తేశాయి.

# వ్యాధుల కాలం.. జర పైలం

మెదక్: వాతావరణ మార్పులతో వ్యాధులు సంభవిస్తాయి. చాలా మంది ఫ్లూ ఇన్‌ఫెక్షన్ బారిన పడుతుంటారు. ముక్కు కారడం, జలుబు, తేలికపాటి జ్వరం, గొంతు నొప్పి, శ్వాస కోశ వ్యాధులు, వివిధ అలర్జీలు వస్తుంటాయి. ఈ సమయంలో ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించాలి. బృందం ఆసుపత్రులను సందర్శించగా ఏఏ వ్యాధులతో బాధపడున్నారో తెలిసింది.

**చర్మవ్యాధులు అధికం...**

నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి నిత్యం 200-300 వరకు రోగులు వస్తున్నారు. ఎక్కువగా వైరల్ జ్వరాలు, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, టైఫాయిడ్, మలేరియా, డెంగీ కేసులు వస్తున్నాయి. చిన్నపిల్లల్లోనూ ఈ రకమైన వ్యాధులు కనిపిస్తున్నాయి. వీరిలో అధికంగా చర్మవ్యాధులు ఉంటున్నాయని పిల్లల వైద్యుడు తెలిపారు. నిత్యం 30-50 మంది వస్తున్నారు. చల్లని ప్రదేశాల్లో తిప్పవద్దు: సూరినేని చంద్రశేఖర్, పిల్లల వైద్య నిపుణులు, మెదక్ చలికాలం ఆరంభం కావడంతో జాగ్రత్తలు తీసుకోవాలి. జలుబు, దగ్గుతో పాటు జ్వరాలు సోకుతున్నాయి. ఐదేళ్ల



లోపు చిన్నారులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. చల్లని ప్రదేశాల్లో తిప్పరాదు. చల్లని వస్తువులు ఇవ్వవద్దు. గోరు వెచ్చని నీటిని తాగించాలి. చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. డీ హైడ్రేషన్ కాకుండా ఎప్పటికప్పుడు నీటిని తాగించాలి. చర్మం పొడి బారకుండా మాయిశ్చరైజ్ క్రీమ్‌లు రాయాలి.

**జ్వరం, ఒళ్లు నొప్పులు...**

చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోగుల సంఖ్య పెరిగింది. గతంలో ప్రతిరోజు 60 మంది మాత్రమే వచ్చేవారు. కానీ ఇప్పుడు వందమంది వరకు వస్తున్నారు. ఎక్కువగా జ్వరం, దగ్గు, జలుబు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు.

పాపన్నపేట పీహెచ్‌సీలో నిత్యం 80 ఓపీ నమోదవుతోంది. అందులో పది మంది వరకు జ్వరాల బారిన పడిన వారు ఉంటున్నారు. మిగతా వారు జలుబు, ఒళ్లు నొప్పులు, బీపీ, మధుమేహం పరీక్షలకు వస్తున్నారు. పొడ్చన్‌పల్లి ఆరోగ్య కేంద్రంలో 70 ఓపీ నమోదవుతోంది. ఎక్కువగా వైరల్ జ్వరాల కేసులు వస్తున్నాయి.

శివ్వంపేటలో గర్భిణులు, పిల్లలు, మధుమేహం, రక్తపోటు సమస్యలు, శరీర నొప్పులు, ఇతర ఆరోగ్య సమస్యలతో దవాఖానాకు వస్తున్నారు.

**జిల్లాలో ఆసుపత్రులు ఇలా...**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 21
ఉప కేంద్రాలు 59
పల్లె, బస్తీ దవాఖానాలు 98, 2
సర్వజన, ప్రాంతీయ ఆసుపత్రులు 1, 1
సామాజిక వైద్యశాల 3
ఈ నెలలో చిక్సిలు పొందిన రోగులు 32,390

# పక్కాగా నిషేధిత జాబితా నవీకరణ

ఖమ్మం: జిల్లాలో సర్కారు, అసైన్డ్ భూములు ఎక్కడెక్కడ ఎన్ని ఉన్నాయో రెవెన్యూ అధికారులు పక్కాగా లెక్కలు తీస్తున్నారు. దస్త్రాలను జల్లెడ పట్టి మిగులు భూములు వెలికితీస్తున్నారు. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాలయ భూములతోపాటు రహదారులు, వివిధ నిర్మాణాలకు సేకరించిన స్థలాలు, సీలింగ్ భూములను నిషేధిత జాబితా(సెక్షన్-22(ఎ)(1)లోకి చేర్చుతారు. ఈ వివరాలను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే భవిష్యత్తులో అక్రమ రిజిస్ట్రేషన్లకు తావుండదు. 2017 నుంచి జాబితాను సక్రమంగా సవరించకపోవడంతో కొందరు ఆక్రమణకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో దస్త్రాన్ని పక్కాగా రూపొందించడానికి 20 రోజులుగా జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ అధికారులు పాత రికార్డులతో కుస్తీ పడుతున్నారు.

**ప్రయోజనం ఇలా..**

దాదాపు ఎనిమిదేళ్లుగా నిషేధిత జాబితాను సవరించలేదు. ఇటీవల పలు ప్రాంతాల్లో ప్రభుత్వం వ్యవసాయ భూములు సేకరించి రహదారులు, సాగునీటి కాల్వలు నిర్మిస్తోంది. నూతన కార్యాలయాలూ వెలిశాయి. ఈ సర్వే నంబర్ల పేరుతో అక్రమ రిజిస్ట్రేషన్లు కాకుండా ఉండాలంటే వీటన్నింటిని నిషేధిత జాబితాలోకి చేర్చాలి. జిల్లాలో జాబితా సవరణ జోరుగా సాగుతోంది. గ్రామాల వారీగా తహసీల్దార్లు పంపిన దస్త్రాలను కలెక్టర్, అదనపు కలెక్టర్ల సంతకాలతో వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు.

**అయిదు పద్ధతుల్లో దస్త్రాలు**

1. జిల్లాలోని ప్రభుత్వ, పోరంబోకు, బంచరాయి, అసైన్డ్ భూముల వివరాలు 22(ఏ)(1)(ఏ) రిజిస్టర్‌లో పొందుపరుస్తారు. ప్రభుత్వ భూమి సుమారు 1,84,189.28 ఎకరాల్లో ఉంది. ఇందులో అత్యధికంగా సత్తుపల్లి మండలంలో, తక్కువగా బోనకల్లు మండలంలో ఉంది. అసైన్డ్ భూమి 47,442.66 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. వీటిల్లో అత్యధికంగా సత్తుపల్లి, తక్కువగా కామేపల్లి మండలంలో ఉన్నాయి. ప్రభుత్వ, అసైన్డ్ భూములను పేదలకు పంచడంతోపాటు ప్రభుత్వ కార్యాలయాల కోసం కేటాయించారు. అవి పోను ఇంకా ఎంతమేర మిగిలి ఉన్నాయో అధికారులు సర్వే చేస్తున్నారు. చెరువులు, గుట్టలు, ఇళ్ల స్థలాలకు సంబంధించిన వ్యవసాయేతర భూమి ఎంతుందో దస్త్రాలను పరిశీలిస్తున్నారు.

2. ప్రభుత్వ భూముల్లో రైల్వేలు, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, అన్ని రకాల ప్రభుత్వ కార్యాలయాలు, నీళ్లట్యాంకులు, ఆసుపత్రులు నిర్మించారు. నూతనంగా ఖమ్మం-దేవరచర్ల గ్రీన్‌ఫీల్డ్, నాగ్‌పుర్-విజయవాడ జాతీయ రహదారులు నిర్మిస్తున్నారు. సీతారామ ఎత్తిపోతల కాల్వలు తవ్వుతున్నారు. వీటిన్నింటిని 22(ఏ)(1)(బి) రిజిస్టర్‌లోకి చేర్చి నిషేధిత జాబితాలో ఉంచుతారు. తద్వారా రైతుభరోసా నిధులు దుర్వినియోగమయ్యే ఆస్కారం

ఉండదు. 3. వక్ఫ్, దేవాదాయ శాఖలకు సంబంధించిన భూములను 22(ఏ)(1)(సి) రిజిస్టర్‌లో చేర్చుతారు. వీటిల్లో వ్యవసాయ భూములతోపాటు కల్యాణ మండపాలు, దుకాణాలు, కార్యాలయాలు నిర్మించారు. ఈ రిజిస్టర్‌ను ఆయా శాఖలు రెవెన్యూ అధికారులకు అందించినట్టు తెలిసింది. 4. సీలింగ్, సర్‌ప్లస్ ల్యాండ్లను 22(ఏ)(1)(డి) రిజిస్టర్‌లో నమోదు చేయాలి. సీలింగ్ భూముల్లో కొన్నింటిని పేదలు పంచింది. ఇవిపోగా మిగులు భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో ఆరాతీస్తూ రిజిస్టర్ రూపొందిస్తున్నారు. 5. నోటిఫై భూములను 22(ఏ)(1)(ఈ) రిజిస్టర్‌లో పొందుపరుస్తున్నారు. నయీమ్, అగ్రిగోల్డ్ స్థలాలతోపాటు సీబీఐ, సీఐడీ సంస్థలు జప్తు చేసిన వాటిని ప్రభుత్వం నోటిఫై చేస్తుంది.

# ఆరోగ్య పరీక్ష.. అతివకు రక్ష



సంగారెడ్డి : ఇంటి పనులు, పిల్లల పోషణ, ఇతరత్రా బాధ్యతలతో గృహిణులు నిత్యం తీరిక లేకుండా ఉంటున్నారు. మరికొందరు ఇంటి బాధ్యతలతో పాటు ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయం తదితర పనులతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. వీరు వేళకు తినకపోవడం, సరిపడా నిద్ర లేకపోవడం తదితర కారణాలతో అనారోగ్యానికి గురవుతున్నారు. సకాలంలో వైద్యం చేయించుకోక పోవడం వల్ల ఒక్కోసారి ప్రాణాలకూ ముప్పు వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో మహిళలకు బాసటగా నిలవాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'ఆరోగ్య మహిళ' పేరిట ఉచితంగా ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి అవసరమైతే జిల్లా ఆసుపత్రికి.. లేదంటే హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. సకాలంలో వైద్యం అందేలా కృషి చేస్తున్నారు.

**జిల్లాలోని 13 పీహెచ్‌సీల్లో..**

జిల్లాలోని 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. బిలాల్‌పూర్, బొల్లారం, హత్నూర, ఝరాసంగం, జిన్నారం, కల్హేర్, కంది, కంగ్టి, కానుకుంట, కొండాపూర్, మునిపల్లి, న్యాల్‌కల్, రామచంద్రాపురంలోని పీహెచ్‌సీల్లో ఈ కార్యక్రమం పేరిటి ప్రతి మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా వివిధ రకాల క్యాన్సర్ల అనుమానితులు, థైరాయిడ్ సమస్య, సూక్ష్మ పోషక లోపాలు, రక్తహీనత తదితరాలపై దృష్టి సారిస్తున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. వ్యాధి తీవ్రత ఆధారంగా ఇతర ఆసుపత్రులకు పంపిస్తున్నారు. క్యాన్సర్ రోగుల కోసం ఇప్పటికే సంగారెడ్డిలో 20 పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొచ్చారు.

**'ఆరోగ్య మహిళ' పరీక్షలు ఇలా..**

(ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు)
ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాలు: 13
పేర్లు నమోదు చేసుకున్నవారు: 22,582
క్యాన్సర్ కేసులు: 19
మూత్రాశయ సమస్యలు: 1971
పోషక లోపం: 2399
థైరాయిడ్ సమస్యలు: 3608
రక్తహీనత: 5905
పీహెచ్‌సీల నుంచి పై ఆసుపత్రులకు తరలించిన రోగులు: 976

జాగ్రత్తలు పాటించాలి

మహిళలు పనుల్లో తీరిక లేకుండా ఉంటున్నప్పటికీ ఆహారం, ఆరోగ్యానికి తప్పనిసరిగా కొంత సమయాన్ని కేటాయించాలి. సమతుల ఆహారం తీసుకోవాలి. కనీసం 6-8 గంటలు నిద్రపోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. వయసుకు తగిన బరువు ఉండేలా చూసుకోవాలి. తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తినాలి. శరీరంలో అనారోగ్య మార్పులు గమనిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. నాగనిర్మల, జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి

# ఉత్తరం రాయండి.. ఉత్తమంగా నిలవండి



మెదక్ : గతంలో ఉత్తరాలు రాసి బంధువులు, స్నేహితుల యోగ క్షేమాలు తెలుసుకునే వారు. ప్రస్తుతం చరవాణి ద్వారా సమాచారాన్ని పంపుతున్నాం, తెలుసుకుంటున్నాం. కార్యాలయాలు, కంపెనీలు, సంస్థలైతే ఉత్తర, ప్రత్యుత్తరాలు మెయిల్ ద్వారా పంపిస్తున్నారు. గూగుల్ మీట్ ద్వారా సమావేశాలు నిర్వహిస్తున్నారు. విద్యాలయాల్లోనూ డిజిటలైజేషన్ కొనసాగుతోంది. ఇలాంటి తరుణంలో చేతిరాత మరుగున పడుతోంది. ఈ విషయాన్ని తపాలా శాఖ గ్రహించి, ఉత్తరాల ద్వారా సమాచారం పంపే పద్ధతిని మళ్లీ తెరపైకి తెచ్చింది. వ్యాసాన్ని రాసి లేఖలు పంపాలని "ఢాయి ఆఖర్" అనే కార్యక్రమానికి 2017లో తపాలా శాఖ శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది సైతం సర్కిల్ (రాష్ట్ర), జాతీయ స్థాయిల్లో పోటీలకు ఉత్తరాలను ఆహ్వానిస్తోంది.

**రాయాల్సిన అంశాలు...**

'లెటర్ టూ మై రోల్ మాడల్' అను అంశంపై లేఖ రాయాలి.
హిందీ, ఆంగ్లం ఏ భాషలోనైనా రాయవచ్చు
ఎన్వలప్ కవర్‌లో రాసేవారు ఎ-4 సైజ్ తెల్ల కాగితంలో వెయ్యి పదాలకు మించకుండా రాయాలి
ఇన్‌లాండ్ లెటర్‌లో 500 పదాలు మించకూడదు.
రెండు విభాగాల్లో పోటీలు
ఈ పోటీలను రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నారు. మొదటిది 18 ఏళ్లలోపు వారికి, రెండోది 18 ఏళ్లు దాటిన వారికి (ఇన్‌లాండ్ లెటర్, ఎన్వలప్) విడివిడి పోటీల్లో పాల్గొని లేఖలు రాయవచ్చు.

**లేఖ పంపాల్సిన చిరునామా....**

లేఖ కవరుపై వయసు రాసి అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాలి.
ద చీఫ్‌పోస్ట్‌మాస్టర్ జనరల్, ఫిలటెల్లి సెక్షన్ (ఢాయి ఆఖర్) తెలంగాణ సర్కిల్ హైదరాబాద్-500001 చిరునామాకు డిసెంబరు 8వ తేదీలోపు పంపాలి.

**బహుమతులు ఇలా...**

సర్కిల్ స్థాయిలో ప్రథమ స్థానం రూ.25 వేలు, ద్వితీయ స్థానం రూ.10 వేలు, తృతీయ స్థానంలో రూ.5 వేలు, జాతీయ స్థాయిలో ప్రథమ రూ.50 వేలు, ద్వితీయ రూ. 25 వేలు, తృతీయ స్థానంలో రూ.10 వేలు చొప్పున నగదు పురస్కారం అందిస్తారు.

**ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

దస్తూరికి పూర్వవైభవం తీసుకు వచ్చేందుకే తపాలా శాఖ ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. దీని వల్ల లేఖలు రాసే సంప్రదాయం అలవడడంతో పాటు ఉత్తమంగా రాసిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతో పాటు నగదు పురస్కారం సైతం ఉండడంతో డివిజన్ పరిధిలోని విద్యార్థులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పోస్టు చేయడంలో ఇబ్బందులుంటే నేరుగా ప్రధాన తపాలా శాఖలో సంప్రదించవచ్చు. శ్రీహరి, ఇన్‌ఛార్జి తపాలా పర్యవేక్షకులు, మెదక్ డివిజన్

# జనరిక్ దుకాణం.. రుణంతో సాకారం

సంగారెడ్డి : పేదరిక కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యం బారినపడితే ఆర్థికంగా ఎదురయ్యే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లినా మందులు(ఔషధాలు) ఎక్కువగా బయటే కొనాల్సిన పరిస్థితి ఉండటమే కారణం. పేదలు అప్పులు చేసి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇలాంటి వారికి ఊరట కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జనరిక్ మందుల దుకాణాలు నిర్వహిస్తోంది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో మండలానికి ఒకటి చొప్పున జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తున్నారు.

**రూ.3 లక్షల స్త్రీనిధి రుణం**

జిల్లా వ్యాప్తంగా ప్రజలకు జనరిక్ ఔషధాలు అందుబాటులోకి తీసుకురావాలని అధికార యంత్రాంగం ముందుకు సాగుతోంది. మహిళా సంఘాల సభ్యుల్లో అర్హులకు దుకాణాల ఏర్పాటుకు స్త్రీనిధి రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని నిర్ణయించారు. ఒక్కో దుకాణం ఏర్పాటుకు రూ.3లక్షల రుణం అందించనున్నారు. తొలివిడతలో మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

**మంజూరు ఇలా..**

స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాలు కావడంతో పాటు వారి కుటుంబం, దగ్గరి బంధువుల్లో ఎవరైనా డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎంఫార్మసీ విద్యార్హత కలిగి ఉండాలి.

రుణం పొందడానికి ముందు.. సభ్యురాలి సంఘం, గ్రామైక్య సంఘం తీర్మానం తప్పనిసరి.

స్త్రీనిధి అధికారులు దరఖాస్తులు పరిశీలించి అర్హులుగా భావిస్తే వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు.

జనరిక్ దుకాణం కోసం తీసుకునే రుణాన్ని ప్రతినెలా వాయిదాల రూపంలో ఐదేళ్లలోపు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

దుకాణం నిర్వహణకు సంబంధిత డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనుమతి, ధ్రువీకరణ పత్రం, కొటేషన్, విద్యార్హత ధ్రువపత్రాలతో స్త్రీనిధి అధికారులకు దరఖాస్తు చేయాలి.

**సద్వినియోగం చేసుకోవాలి** జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు స్త్రీనిధి ద్వారా ప్రోత్సహిస్తున్నాం. తక్కువ వడ్డీకి ఇస్తున్న రుణాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి. కుటుంబంలో ఎవరైనా దుకాణం ఏర్పాటుకు అవసరమైన విద్యార్హత కలిగి ఉంటే దరఖాస్తు చేసుకోవాలి. సులభ వాయిదాల పద్ధతిలో రుణాన్ని తిరిగి చెల్లించే వెసులుబాటు ఉంటుంది. శ్రీనాథ్, స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్

జిల్లాలో మహిళా పొదుపు సంఘాలు: 18,213
సభ్యులు: 1.90 లక్షల మంది

# భవనాలు పూర్తయ్యేదెన్నడో..!

ఇల్లంతకుంట: సొంత భవనాల్లో కొన్ని, అద్దె భవనాల్లో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. కొన్నింటికి నిధులు మంజూరైనా పనులు సాగక చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**ఇదీ పరిస్థితి**

ఇల్లంతకుంట మండలంలోని 35 గ్రామాలలో 64 అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. అందులో 35 సొంత భవనాల్లో 17 పాఠశాలల్లో మిగతావి 12 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు.

అద్దె భవనాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇందులోని చిన్నారులకు అవస్థలు తప్పడంలేదు. పైగా కిరాయి తక్కువ ఉండటంతో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

అద్దె భవనాల్లో చిన్నారుల ఆటల కోసం ఏర్పాటు చేయాల్సిన పరికరాలను స్థలాభావంతో ఏర్పాటు చేయడం లేదు. దీంతో పిల్లలు ఆటాపాటతో కూడిన విద్యకు దూరమవుతున్నారు.

మండలంలోని ముస్కానిపేట, ఇల్లంతకుంటలో పనులు ప్రారంభించినా.. కొన్నేళ్లుగా ముందుకు సాగడంలేదు. ప్రస్తుతం ఈ రెండింటికి టెండర్లు పిలిచేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

కొత్తగా ఎనిమిదింటికి ఒక్కో దానికి రూ.12 లక్షల చొప్పున నిధులు నెల క్రితం మంజూరయ్యాయి. ఇందులో ఈజీఎస్‌లో రూ.8 లక్షలు, గ్రామ పంచాయతీ 15వ కమిషన్ కింద రూ.2 లక్షలు, ఐసీడీఎస్ కింద రూ.2 లక్షలు వెచ్చిస్తారు.



కొన్నిచోట్ల భవనాలకు అనుకూలంగా ఉన్నా.. మరికొన్ని చోట్ల స్థలం లేక పనులు ప్రారంభించడం లేదు. గతంలో నిర్మాణాలు ప్రారంభించిన 6 భవనాల మిగులు పనులకు సైతం నిధులు మంజూరుకాగా పనులు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి.

తెనుగువానిపల్లెతోపాటు ఎర్నాస్‌పల్లెలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.5 లక్షల చొప్పున మంజూరు కాగా మిగతా నాలుగు భవనాల మిగులు పనులకు రూ.9 లక్షలు మంజూరు చేశారు కానీ.. పనులు వేగవంతంగా లేకపోవడంతో పాటు నిర్మాణం పూర్తయ్యేనా అన్న సందేహాలు కలుగుతున్నాయి.

పనులు దక్కించుకున్న గుత్తేదారులు నిధులు సరైన సమయంలో అందకపోవడంతో పనుల్లో వేగవంతం చేయలేకపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలను త్వరితగతిన పూర్తి చేయించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**చిన్నారుల ఇబ్బందులు తీరుస్తాం**

– ఉమారాణి, ఐసీడీఎస్ సీడీపీవో సొంత భవనాలు లేనిచోట అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటిని దృష్టిలో పెట్టుకొని ప్రతిపాదనలు పంపిం చాం. కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాలకు ఇటీవలే నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని గ్రామాల్లో మిగిలిపోయిన భవనాలకు నిధులు మంజూరు కాగా పనులు కొనసాగుతున్నాయి. త్వరితగతిన పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. త్వరలో చిన్నారుల ఇబ్బందులు తీరుస్తాం.

# యాప్ వేదిక.. మద్దతు ధరల సూచిక

సిరిసిల్ల: విత్తుకునే సమయంలో అనావృష్టి.. పూత, కాయల దశలో అతివృష్టి.. అన్నీ తట్టుకొని ఎదిగిన పంటపై చీడపీడల దాడి.. ఈ ఏడాది పత్తి రైతులను కోలుకోకుండా చేసింది. ఇక చేతికందిన పంటను వ్యాపారుల జిమ్మిక్కులకు తట్టుకుని నిలబడి మద్దతు ధరకు విక్రయించిన వారికే ఈ ఏడాది సం'పత్తి'. ఈసారి ఉమ్మడి జిల్లాలో సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) 23 చోట్ల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. కలెక్టర్లు జిన్నింగ్ మిల్లుల్లోని భద్రతా పరమైన ఏర్పాట్లను పరిశీలించాకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా సన్నాహాలు జరుగుతున్నాయి. ఇదిలా ఉంటే.. కేంద్రం పత్తి రైతుకు మద్దతుధర లభించేలా 'కపాస్ కిసాన్' అనే యాప్‌ను తీసుకొచ్చింది. దీంతో రైతుల అనుకూలమైన సమయంలో తమకు నచ్చిన మిల్లులో పత్తిని విక్రయించుకునే అవకాశం ఉంది.

**ఆచరిస్తేనే ప్రయోజనం**

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 11 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. 'కపాస్ కిసాన్' యాప్‌ను రైతులు విస్తృతంగా వినియోగించినప్పుడే దాని లక్ష్యం నెరవేరుతుంది. తొలుత ఈ యాప్‌ను రైతులు సెల్‌ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకొని, స్లాట్ బుక్ చేసుకునేందుకు తన పంట వివరాలు నమోదు చేయాలి. ఏఈవోలు పంట నమోదులో తీసుకున్న ఫోన్ నంబరు, ఆధార్‌కార్డుకు అనుసంధానం చేసినదీనికే ఓటీపీ వస్తుంది. దీనిలో సవరణకు ఏఈవోలను సంప్రదించాలి.

యాప్‌లో స్లాట్ బుక్ చేసుకునే సమయంలోనే తేదీ, ఇతర వివరాలు వస్తాయి. దీనిపై రైతులకు అవగాహన అంతంత మాత్రమే.

నిబంధనల ప్రకారం తేమ 8 శాతంలోపు ఉంటేనే క్వింటాకు రూ.8,110 లభిస్తుంది. రైతులు మిల్లుకు తీసుకొచ్చే నాటికే 8 నుంచి 12 తేమ సరిచూసుకోవాలి. లేదంటే కొనుగోళ్ల ప్రక్రియ మొదటికొస్తుంది. గతంలోనూ టోకెన్ విధానం అమలులోనూ ప్రతికూల పరిస్థితులు తలెత్తాయి. దీంతో రైతులు మిల్లులు, మార్కెట్ యార్డుల ఎదుట ఆందోళనకు దిగారు.

వచ్చేది శీతాకాలం. పత్తిలో 12 శాతంలోపు తేమ రావడం గగనం. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు రవాణాభారంతో వెనక్కి వెళ్లలేక, అయినకాడికే మిల్లుల్లోనే అమ్మేస్తుంటారు.

రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లోని కొందరు రైతులు క్వింటాకు రూ.6 వేల నుంచి రూ.6500 ధరలకు దళారులకు అమ్మేస్తున్నారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో పెట్టుబడి ఖర్చులు ఇచ్చిన అడ్తీదారులు, ఎరువులు, విత్తనాల దుకాణదారుల మధ్యవర్తులకు విక్రయిస్తున్నారు. వీటన్నింటిని పర్యవేక్షించే ఉమ్మడి జిల్లా మార్కెటింగ్‌శాఖలో డీఎంవో (జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారుల)ల కొరత ఉంది. జగిత్యాల డీఎంవోకు రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు బాధ్యతలు అప్పగించారు. వరంగల్ మార్కెట్లోని సీనియర్ అసిస్టెంటుకు కరీంనగర్ డీఎంవో అదనపు బాధ్యతలిచ్చారు. కామారెడ్డి డీఎంవోకు పెద్దపల్లి మార్కెట్ బాధ్యతలు అప్పగించారు. కార్యాలయాల్లోని అరకొర సిబ్బందితో కొనుగోళ్లపై పర్యవేక్షణ గగనంగా మారనుంది.

## బాలికా విద్యాలయాలు..
# సమస్యల లోగిళ్లు

కర్నూలు : విద్యా బోధన.. ఫలితాల సాధనలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు ముందుంటున్నాయి. దీంతో వీటిలో తమ కుమార్తెలను చేర్పించేందుకు చాలామంది తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. పోటీ పెరగడంతో వీటిలో సీటు కోసం సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే, మంత్రుల వరకు సిఫార్సు చేయిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇంత ప్రాధాన్యమున్న కేజీబీవీల్లో సమస్యలు తిష్టవేశాయి. విద్యార్థినులు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో పాటు సిబ్బంది మధ్య సఖ్యత లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికితోడు వసతుల కొరత వేధిస్తోంది. జిల్లా పర్యటనకు వచ్చిన కేజీబీవీ రాష్ట్ర డైరెక్టర్ దేవానందరెడ్డి 26 కేజీబీవీల ఎస్‌వోలతో మంగళవారం సమావేశమయ్యారు. కేజీబీవీల్లో నెలకొన్న సమస్యలను వారు ఆయన ఎదుట ఏకరువుపెట్టారు. కేజీబీవీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆయన డీఈవో శామ్యూల్‌పాల్, జీసీడీవోను ఆదేశించారు.

**ఎస్‌వోలు చెప్పిన సమస్యలు**

చాలా మండలాల్లోని కేజీబీవీలకు ప్రహరీలు లేవు. మురుగునీరు బయటికి వెళ్లే మార్గం లేదు. దీంతో విద్యాలయ ఆవరణలోనే మురుగు నిలిచి దుర్వాసన వస్తోందని ఎస్‌వోలు డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పంచలింగాల, కోసిగి, కౌతాళం, మద్దికెర, నందవరం, మంత్రాలయం కేజీబీవీల్లో బోరు ఉన్నప్పటికీ సరిపడ నీళ్లు అందడం



లేదు. పంచలింగాల కేజీబీవీకి చెందిన విద్యుత్తు నియంత్రిక నుంచి బయటి వ్యక్తులు కనెక్షన్ తీసుకున్నారు. దీంతో బడిలో ఉన్న ఫ్యాన్లు, బల్బులు తరచూ పాడవుతున్నాయి. షార్ట్ సర్క్యూట్ సమస్యలు తలెత్తుతున్నాయి. కోసిగి కేజీబీవీలోనూ విద్యుత్తు సమస్య నెలకొంది. కోడుమూరు, కృష్ణగిరి కేజీబీవీలకు ఏఎన్ఎం లేక బయట ఉన్న వైద్యులను సంప్రదించాల్సి వస్తోంది.
జిల్లాలోని 26 కేజీబీవీల్లో బోధనేతర సిబ్బంది పూర్తిస్థాయిలో లేరు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్‌వోలు వివరించారు.
**ఆటలకు చోటేదీ..**? విద్యార్థినులను చదువుతో పాటు క్రీడల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం చెబుతోంది. కస్తూర్బా విద్యాలయాలకు క్రీడా మైదానాలు లేక బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. కేజీబీవీలో ఉన్న హాల్‌లోనే క్రీడల్లో శిక్షణ తీసుకుంటున్నారు. అరకొర వసతుల మధ్య శిక్షణ తీసుకున్న శిక్షణతోనే రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. వీరికి క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి తేవడంతో పాటు అవసరమైన పరికరాలు సమకూర్చాల్సిన అవసరం ఉంది.

# చెమ్మగించేను

కోవెలకుంట్ల: రబీ సీజన్ ప్రారంభమై నెల రోజులైనా శనగ సాగు అంతంతమాత్రంగానే ఉంది. భారీ వర్షాలు కురవడం.. భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో విత్తు వేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈనెల 15వ తేదీతో గడువు ముగియనుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో రబీ సీజన్‌లో రైతులు శనగ ఎక్కువగా సాగు చేస్తుంటారు. సాధారణ విస్తీర్ణం 1.55 లక్షల ఎకరాలు కాగా.. గతేడాది 1,28,137 ఎకరాల్లో వేశారు. ఈ ఏడాది 1,43,247 ఎకరాలు సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో భాగంగా రాయితీపై 12 వేల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశారు. ఒక్క కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో లక్ష ఎకరాల్లో శనగ సాగవుతుందని అంచనా వేశారు. ఇందులో భాగంగా 7,900 క్వింటాళ్ల విత్తనం అందించారు.

**సీజన్ ప్రారంభం నుంచి..**

ఈ ఏడాది రబీ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి వర్షాలు పడుతూనే



ఉన్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో కొన్నిచోట్ల విత్తనాలు కొట్టుకుపోగా.. మరికొన్ని ప్రాంతాల్లో అరకొరగా మొలకలు వచ్చాయి. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. తుపాను ప్రభావంతో జిల్లాలో 20 వేల ఎకరాల్లో మొలక దశలో ఉన్న శనగ దెబ్బతిందని అధికారుల ప్రాథమిక అంచనా. 'ఈ ఏడు రబీ ప్రారంభమైనప్పటి నుంచి వర్షాలు కురుస్తూనే ఉండటంతో శనగ సాగుకు ఇబ్బందిగా మారింది. ప్రత్యామ్నాయంగా తక్కువ కాలపరిమితి ఉన్న మినుము, కొర్ర, పెసర, కుసుమ, ఆవాలు, పొద్దుతిరుగుడు వంటి పంటలు సాగు చేయొచ్చు' అని కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్ చెప్పారు.

## ఇంటి వద్దే కొలువు.. ఆసక్తి ఉంటే రండి..

భీమవరం : పకం: కౌశలం ఉద్దేశం: యువతకు విద్యార్హత ఆధారంగా ఇంటి వద్దే ఉపాధి కల్పిస్తారు. ఇందుకు చేపట్టిన కౌశలం సర్వేలో ఉమ్మడి జిల్లాలో 2,03,329 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1,49,029 మంది వివరాలను పరిశీలించారు. వీరిలో ఆసక్తి చూపిన వారు విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలనకు ముందుకొచ్చారు. నైపుణ్య శిక్షణ 18 ఏళ్లు పైబడి, పదో తరగతి, ఆపై విద్యార్హతలున్న వారు సర్వేలో తమ వివరాలు అందజేశారు. వీరిలో ఐటీఐ, డిప్లొమా, గ్రాడ్యుయేషన్, పోస్టుగ్రాడ్యుయేషన్, పీజీ డిప్లొమా, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారు ఉన్నారు. వీరి విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలను పరీక్ష ద్వారా తెలుసుకుని అవసరమైన వారికి నైపుణ్య శిక్షణ ఇస్తారు. తర్వాత ఇంటి వద్దనే ఆదాయం పొందేలా ఉపాధి కల్పిస్తారు. సమూహ పరీక్ష ఈ నెల 10, 11 తేదీల్లో సచివాలయాల్లో కౌశలం మాక్ టెస్ట్ పెట్టినట్లు జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి తెలిపారు.

# కిట్టు ఉంటే ఒట్టు



చిత్తూరు : ప్రమాదాల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో అత్యవసర ఏర్పాట్లు కరవయ్యాయి. ప్రధానంగా ప్రథమ చికిత్స కిట్లు లేకపోవడం విడ్డూరంగా ఉంది. కొన్ని బస్సుల్లో పెట్టెలున్నా మందుల్లేవు. మరికొన్నింట్లో పెట్టెలే లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల జరుగుతున్న బస్సు ప్రమాదాలు కలవరపెడుతున్నాయి.
జిల్లాలోని ఆర్టీసీ 11 డిపోల పరిధిలో సుమారు 855 బస్సులు ఉన్నాయి. రోజూ లక్ష నుంచి 1.20 లక్షల మంది ప్రయాణికులు వివిధ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. ఆయా బస్సుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రయాణికులకు సూచించే విధంగా బస్సులో ప్రథమ చికిత్స పరికరాలు (ఫస్ట్ ఎయిడ్ కిట్) ఏర్పాటు చేయాల్సి ఉంది.

కానీ జిల్లాలోని ఒక్క బస్సులోనూ కనిపించడం లేదు. కొన్ని బస్సుల్లో పరికరాలను ఉంచే డబ్బాలు ఖాళీగా దర్శనమిస్తుండగా, మరికొన్ని బస్సుల్లో కనీసం ఆ డబ్బాలు కూడా కనిపించకపోవడం విచారకరం.
ప్రధానంగా భక్తులు రాకపోకలు సాగించే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో (తిరుమల ఘాట్ రోడ్డు), చెన్నై, బెంగళూరు అంతర్రాష్ట్ర సర్వీసులైన ఏసీ వోల్వో బస్సుల్లోనూ లేకపోవడంపై ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.
ప్రతి బస్సులోనూ ఫస్ట్ ఎయిడ్ కిట్ పెట్టెలు ఉంటూ.. అందులో కాటన్ బ్యాండేజీ, దూది, వాటర్ ప్రూఫ్ ప్లాస్టర్, టించర్, యాంటీసెప్టిక్ క్రీం వంటివి ఉండాల్సి ఉంది. అయితే.. పల్లెవెలుగు మొదలు దూరప్రయాణం చేసే ఇంద్రా బస్సుల వరకు కిట్లు ఉండటం లేదు.
జిల్లాలోని డిపోలు : చిత్తూరు-1,2, పలమనేరు, పుంగనూరు, కుప్పం
ప్రయాణికులు: నెలకు 46 లక్షలమంది, ఆదాయం రూ.20 కోట్లు
ఈ ఏడాదిలో ఇప్పటి వరకు బస్సు ప్రమాదాలు మొత్తం : 32, మరణాలు : 18, క్షతగాత్రులు : 67
కిట్‌లో ఉండాల్సినవి కాటన్ బ్యాండేజీ, దూది, వాటర్ ప్రూఫ్ ప్లాస్టర్, టించర్, యాంటీసెప్టిక్ క్రీం వంటివి
మొత్తం బస్సులు- 452 (ఆర్టీసీ 381, అద్దెవి 71)

**వారం రోజుల్లో ఏర్పాటు చేస్తాం**

ప్రతిబస్సులో ప్రథమ చికిత్స పరికరాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ, ఆర్టీసీ ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారుల ఆదేశాలిచ్చారు. వాటికి అనుగుణంగా జిల్లాలో చర్యలు చేపడుతున్నాం. సంస్థ, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో వారం రోజుల్లో అన్ని బస్సుల్లో ఏర్పాటు చేస్తాం. జగదీష్, జిల్లా ప్రజారవాణాధికారి

# ఉపాధిలో ప్రధాన 'భూమి'క!



విశాఖపట్నం : ఇంటికో పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దాలని, యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో దశల వారీగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కులు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సీ)లను అభివృద్ధి చేయనున్నారు.
భూములు అందుబాటులో ఉన్న చోట పారిశ్రామిక పార్కుగా, తక్కువ భూమి ఉంటే ఎఫ్ఎఫ్‌సీగా నిర్మిస్తున్నారు. గాజువాక నియోజకవర్గంలోని పెదగంట్యాడలో నిర్మించిన ఎఫ్ఎఫ్‌సీని తాజాగా ప్రారంభించారు. విశాఖ పశ్చిమం, పెందుర్తి నియోజకవర్గాల్లో ఎఫ్ఎఫ్‌సీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయా పార్కుల్లో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.
**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో..** 1. 70 శాతం కేంద్ర ప్రభుత్వం, 30 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వీటి నిర్మాణం చేపట్టనున్నారు. ఆయా పార్కుల్లో అభివృద్ధి చేసిన దుకాణాలను అద్దె ప్రాతిపదికన కేటాయించనున్నారు. 2. ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసే పార్కులకు ప్రోత్సాహకాలు అందిస్తుంది. ఇవి అందుబాటులోకి వస్తే.. పెట్టుబడులు రావడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. చిన్న పరిశ్రమల నిర్వాహకులపై పెట్టుబడి భారాన్ని తగ్గించేందుకు ప్లగ్ అండ్ ప్లే విధానంలో మౌలిక సదుపాయాలు కల్పించ నున్నారు. 3. వెంకటాపురం, ముడసర్లోవలో ఎఫ్ఎఫ్‌సీలు మరో ఆరు నెలల్లో అందుబాటులోకి రావొచ్చు. విశాఖ ఉత్తరం, దక్షిణ నియోజకవర్గాల్లో ఏర్పాటుకు స్థలాలు గుర్తించే పనిలో ఉన్నారు.
4.'పెదగంట్యాడ ఎఫ్ఎఫ్‌సీలో మొత్తం 29 దుకాణాలను నిర్మించాం. వాటి వివరాలను ఏపీఐఐసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాం. అవసరమైనవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే, పరిశీలించి కేటాయిస్తాం' అని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సింహాచలం తెలిపారు.
'భీమిలి'లో రెండు నెలల్లో..: భీమిలి నియోజకవర్గం పద్మనాభం మండలం కృష్ణాపురంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు 63 ఎకరాలు ఎంపిక చేశారు. రూ.12.4 కోట్లతో పనులను ఈ ఏడాది మేలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. మొదటి విడతగా 23.72 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. 12.83 ఎకరాల్లో 163 ప్లాట్లు, మిగిలిన స్థలాన్ని రోడ్లు, పార్కింగ్, ఇతర సదుపాయాలకు కేటాయించనున్నారు. ప్రస్తుతం రోడ్లు, డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. రెండు నెలల్లో అందుబాటులోకి రావొచ్చు.

# చలితో చిన్నారులకు చేటు



అనకాపల్లి : అనకాపల్లికి చెందిన 11 ఏళ్ల బాలుడు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నాడు. నడుస్తుంటే ఆయాసం వస్తోంది. మందులు వాడి తల్లిదండ్రులు మిన్నకుండిపోయారు. కొద్ది రోజులకు జ్వరం రావడంతో ఆసుపత్రిలో చేర్చారు. పరీక్షించగా న్యుమోనియా అని తేలింది. కశింకోటకు చెందిన ఓ వ్యక్తి సిగరెట్లు ఎక్కువగా కాలుస్తున్నాడు. ఇతనికి తరచూ దగ్గు వస్తుండేది. నిర్లక్ష్యం చేయడంతో ఉపిరితిత్తులు దెబ్బతిని న్యుమోనియా బారిన పడ్డాడు. మార్టూరుకు చెందిన మహిళకు న్యుమోనియా సోకింది. క్రషర్ బుగ్గి, వాతావరణ కాలుష్యంతో పలువురు అనారోగ్యానికి గురవుతున్నారని పరిశీలనలో తేలింది. చలికాలంలో చిన్నారులు తరచూ జలుబు, దగ్గుతో బాధపడుతుంటారు. శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుంటారు. ఈ సీజన్‌లో అప్రమత్తంగా లేకుంటే చిన్నారులు న్యుమోనియా గురయ్యే ప్రమాదముంది. గతేడాది జిల్లాలో 160 మంది ఈ వ్యాధి బారిన పడ్డారు. జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగుల్లో రోజూ 30 నుంచి 40 మంది తీవ్రమైన దగ్గు, ఆయాసం, ఊరితిత్తుల సమస్యలతో బాధపడుతున్న వారే ఉంటున్నారు. ఈ వ్యాధి చిన్నారుల్లో అధికమవడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ ఏడాది నవంబరు 12 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు సర్వే చేపట్టి రోగులను గుర్తించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో 1,20,534 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారు. ఆరు నెలలు, 14 నెలలు, తొమ్మిదేళ్లలోపు వయసున్న చిన్నారులకు ఉచితంగా టీకాలు వేస్తారు. నేటి నుంచి ఇంటింటా సర్వే ప్రారంభంకానుంది. 1,467 మంది ఆశా కార్యకర్తలు ఒక్కొక్కరు తమ పరిధిలోని 1000 నుంచి 1500 ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించనున్నారు. శ్వాస సంబంధ సమస్యలతో బాధపడుతున్న చిన్నారులుంటే వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందిస్తారని డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి చెప్పారు.
కొవిడ్ అనంతరం చాలా మందిలో ఊపిరితిత్తుల సమస్యలు పెరుగుతున్నాయి. ఇది టీబీ, న్యుమోనియాకు దారితీస్తోంది. దగ్గు, ఆయాసం, జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక వైద్యం అందించేలా ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటు చేసి మందులను అందుబాటులో ఉంచుతున్నాం. 50 ఏళ్లు దాటిన వారంతా ఈ టీకాలు వేయించుకుంటే మేలని జిల్లా టీకాల అధికారి డాక్టర్ చంద్రశేఖర్‌దేవ్ పేర్కొన్నారు.

# నిబంధనలు బట్టీంచుకోరు

నంద్యాల : నంద్యాల జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇటుకల బట్టీలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నిర్వాహకులు పలువురికి ముడుపులు అందిస్తూ తమ వ్యాపారానికి ఇబ్బందులు లేకుండా చేసుకొంటున్నారు. నంద్యాల పట్టణ పరిధిలోని పొన్నాపురం, అయ్యలూరు మెట్ట, అయ్యలూరు, మహానంది వెళ్లే మార్గంలో అబండతండా వరకు 100కు పైగా ఇటుకల బట్టీలు ఉన్నాయి. వీటిల్లో చాలావాటికి సరైన అనుమతులు లేవు. నంద్యాలతోపాటు వివిధ మండలాల పరిధిలోని పలు గ్రామాల నుంచి మట్టిని అక్రమంగా బట్టీలకు తరలిస్తున్నారు. భూ యజమానుల నుంచి కొంతమేర అనుమతులు తీసుకుని పదింతల మట్టిని తవ్వేస్తున్నారు. కుందూ నది ఒడ్డు, చెరువులు, వంకల నుంచి తవ్వి బట్టీలకు సరఫరా చేస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలు సమృద్ధిగా ఉండటంతో అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

**అధికారులు దృష్టి సారించక..**



నిబంధనల ప్రకారం ముందుగా భూమిని వ్యవసాయం నుంచి వాణిజ్య అవసరాలకు మార్చుకోవాలి. సంబంధిత గ్రామ పంచాయతీకి దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలి. కాలుష్య నియంత్రణ మండలి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకోవాల్సి ఉంటుంది. వాణిజ్య విభాగం కింద విద్యుత్తు కనెక్షన్ ఏర్పాటు చేసుకోవాలి. జల వనరుల శాఖకు దరఖాస్తు చేసుకుని వారి అనుమతి తీసుకోవాలి. రకరకాల నిబంధనలు ఉండటంతో నిర్వాహకులు వీటన్నింటికి తిలోదకాలిచ్చారు. అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. వ్యవసాయానికి ఇచ్చే ఉచిత విద్యుత్తునే బట్టీలకు వినియోగిస్తున్నారు. మట్టిని తవ్వేందుకు సంబంధిత శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోవడం లేదు. నంద్యాల సమీపంలోని పెద్దకొట్టాల, అయ్యలూరు, సీతారామాపురం తదితర ప్రాంతాల్లో బట్టీల వద్ద పెద్దఎత్తున మట్టి నిల్వ చేసుకుంటున్నారు. టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. ఒక్కో టిప్పరులో 13 క్యూబిక్ మీటర్ల ఎర్రమట్టి పడుతుంది. ఈ నేపథ్యంలో పలు చెరువులు, వివిధ ప్రాంతాల నుంచి తవ్వి తరలిస్తున్నారు.

# ఖర్చు గెలంత.. ఆదాయం కాయంత

తణుకు : అరటి సాగు సంక్షోభంలో పడింది. కార్తిక మాసం వచ్చిందంటే రైతుల కళ్లలో ఆనందానికి హద్దులుండవు. కానీ ఈ సారి పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. మొంథా తుపాను ప్రభావం వల్ల కురిసిన భారీ వర్షాలకుతోడు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు నిలిచిపోవడంతో సరైన గిట్టుబాటు ధర లేక అరటి రైతులు విలవిల్లాడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పచి మార్కెట్‌కు గెలలు తీసుకొచ్చే రైతులకు చేదు అనుభవం ఎదురవుతోంది. మరోవైపు వాతావరణం అనుకూలించక గెలలు తోటల్లో ముగ్గిపోయి పాడవుతున్నాయని.. కనీసం పెట్టుబడులైనా వస్తాయోరావోనని పలువురు రైతులు వాపోతున్నారు. జిల్లాలో సుమారు 2000 ఎకరాల్లో అరటి పంట సాగు చేస్తున్నారు. ఇందులో ఎక్కువ భాగం కర్పూరం రకం పండిస్తున్నారు. తణుకు, పోడూరు, పెనుగొండ, ఆచంట, యలమంచిలి, పాలకొల్లు మండలాల్లో ఎక్కువగా అరటి సాగు చేస్తున్నారు. అనేక గ్రామాల్లో కొబ్బరికి అంతరపంటగా అరటి పండిస్తున్నారు.
పెట్టుబడికి ఆదాయానికి పొంతనే లేదు.. నేను అయిదెకరాల్లో కర్పూర రకం సాగు చేశాను. ఎకరాకు రూ. 80 వేల వరకు పెట్టుబడి పెట్టాను. ఎకరా తోటకు 700 నుంచి 800 వరకూ గెలలు తెగుతాయి. కారణాలేవైనా గిట్టుబాటు ధర లేక గెలకు రూ.100 లోపు మాత్రమే వస్తోంది. దీంతో పెట్టుబడి కూడా రాక నష్టం చవిచూడాల్సి వస్తోంది. కనీసం రూ.200 నుంచి రూ.300కు కొనుగోలు చేస్తేనే రైతులకు ధర ఆశాజనకంగా ఉంటుంది. చిల్లర వర్తకులు మాత్రం హస్తం రూ.40 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు.

**పసుపులేటి రాంబాబు, ముక్కామల, పెరవలి మండలం**

ఎరువులు, కిరాయి ఖర్చులూ రావడం లేదు.. నేను రెండు ఎకరాల్లో కౌలుకు సాగు చేస్తున్నాను. పంట చేతికి రావాలంటే కనీసం నాలుగు సార్లు ఎరువులు వినియోగించాలి. ఈ మేరకు రూ.27,200 ఖర్చవుతుంది. ఎకరాకు కౌలు రూ.35 వేలు చెల్లించాలి. వెదురు ఖర్చు ఉండనే ఉంది. ఇంత మొత్తంలో ఖర్చవుతున్నా సరకు మార్కెట్‌కు తరలిస్తే కిరాయి కూడా రావడం లేదు.
కాకరపర్తి కిరణ్, తాడిపర్రు, ఉండ్రాజవరం మండలం

# డబ్బులిస్తే మీకే ముందు!

ఏలూరు : ప్రైవేటు ఆస్పత్రుల నుంచి వచ్చినా డబ్బులిస్తే ఏలూరు జీజీహెచ్ లో.. వెనువెంటనే వైద్య పరీక్షల సేవలు అందుతాయనడానికి నిదర్శనాలు ఇవి. మరో పక్క పరీక్షల నుంచి ఫిల్మ్‌లు, రిపోర్టుల వరకు రోజుల తరబడి జీజీహెచ్ రోగులకు జాప్యం జరుగుతున్నా ఆసుపత్రి అధికారులు పట్టించుకోవడం లేదు. సగటున రోజుకు 20-30 ఎమ్మారై, సీటీ స్కాన్లు 50-60 దాకా జీజీహెచ్ వైద్యులు రాస్తారు. వీటికి 2-3 రోజులు ఆగి రావాలని సూచిస్తున్నారు. బాగా అత్యవసరమైతేనే వెంటనే చేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల రోగులకు ఒక రోజులోనే పరీక్షలు చేసి రిపోర్టులు, ఫిల్ములు చేతికిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ఒక్కో ఫిల్మ్‌కు రూ.300 తీసుకుని రోగికి ఇస్తారు. ఏలూరులో రోగి ఫోన్‌లో వీడియో షేర్‌చేస్తున్నారు. ఏలూరుకు చెందిన ఓ యువతి బైకుపై నుంచి పడి తీవ్ర గాయాలుపాలవగా జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. కాలి బొటన వేలు తెగిపోయింది. తలకు గాయమై నెత్తురోడుతోంది. వైద్యులు మెదడుకు సీటీ స్కాన్ చేయించుకుని రావాలని సూచించటంతో చాలాసేపు క్యాజువాల్టీలోనే ఉండిపోయింది. తీరా ఆ యువతికి సీటీ స్కాన్ వద్దకు తీసుకెళ్లి పరీక్ష చేయించటానికి సిబ్బంది లేక సకాలంలో వైద్యసేవలకు నోచుకోలేదు.
ఆకివీడుకు చెందిన లక్ష్మి చేయి లాగేస్తోందని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా ఎమ్మారై రాసి జీజీహెచ్‌లో తక్కువ ఫీజుకే చేస్తారని చెబితే.. అక్కడి నుంచి వస్తే రూ.3500 తీసుకుని మధ్యాహ్నానికి రిపోర్టు ఇచ్చారని వివరించారామె.

**పీపీపీ విధానంలో సేవలు..**

ఏలూరు జీజీహెచ్‌లో 2018 నుంచి ఎమ్మారై, సీటీస్కాన్ పరీక్షలు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో కొనసాగుతున్నాయి. జీజీహెచ్ రోగులకు ఇవి ఉచితమే. పరీక్షల నిర్వహణలో వీరికే తొలి ప్రాధాన్యమివ్వాలి. ఆ తర్వాతే ప్రైవేటు రోగులకు చేయాలి. ఎంత ఛార్జి వసూలు చేయాలో ఒప్పందంలో ఉంది. చర్యలకు సిఫార్సు చేస్తాం.. 'జీజీహెచ్ రోగులకు ఎమ్మారై, సీటీ ఏదైనా ఉచితంగానే చేయాలి.

# రొయ్యలకు బీమా.. రైతులకు ధీమా

కోట : అమెరికా సుంకాలతో ఆక్వా సాగు వ్యయం పెరిగింది. ప్రకృతి విపత్తులతో మరింత నష్టపోయారు. ఇక రొయ్యల్లో వచ్చే వ్యాధులు, వైరస్‌లతో పూర్తిగా నష్టాల ఊబిలో మునుగుతున్నారు. ఈక్రమంలో ప్రభుత్వం బీమాతో భరోసా కల్పిస్తోంది. వ్యవసాయ బీమా సంస్థ(ఏఐసీ) సహకారంతో చేపట్టే పథకంలో చేరితే వ్యాధులు, వైరస్‌ల నుంచి రక్షణ పొందొచ్చు.

**ఈ వివరాలు సరిచూసుకోండి**

ఎకరాకు రూ.4 లక్షల వరకు ఖర్చు చేస్తున్న రైతులు బీమా కోసం రూ.8-12 వేలు వెచ్చిస్తే చాలు.

15-130 రోజుల వరకు ఉన్న రొయ్యలకు బీమా వస్తుంది.

కోస్తా ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతులు తప్పనిసరిగా ఉండాలి.

అన్ని అనుమతులుంటే జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ ద్వారా ప్రీమియంలో 40 శాతం రాయితీ ఇస్తారు.



అధికవేడితో చనిపోవడం, విష ప్రయోగాలు, పేలుళ్లు, వరదలు, తుపాన్లకు సాధారణ బీమా చేస్తారు.

వైరస్‌లు, తెగుళ్లు, వ్యాధులకు మరో బీమా చేస్తారు. రెండింటికీ కలిపి కూడా చేయవచ్చు.

జిల్లాలో సాగు: 3,822.96 హెక్టార్లలో

రైతులు: 2 వేల మంది

వర్తింపు: వనామీ, టైగర్, స్కాంపి, పీనస్, ఇండికస్

రైతులు అనుమతులు పొందాలి

జిల్లాలో 2,250 హెక్టార్లలోని రైతులే ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతులు పొందారు. మిగతా రైతులు కూడా పొంది ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలి.

రాజేష్, జిల్లా మత్స్యశాఖాధికారి

# విశాఖలో మరో కిడ్నీ రాకెట్ కలకలం!!

విశాఖపట్నం : పేదల ఆర్థిక అవసరాలే ఆసరాగా చేసుకొని కిడ్నీలు కొట్టేసే ముఠాలు విశాఖలో పాగా వేశాయి. రూ.లక్షలు ఆశ చూపి కిడ్నీలు అమ్మేస్తున్నారు. తాజాగా మరో కిడ్నీ రాకెట్‌తో నగరంలో కలకలం రేగింది. మధురవాడకు చెందిన యమున అనే మహిళ కిడ్నీ తీసుకునేందుకు అన్నమయ్య జిల్లా మదనపల్లె తీసుకువెళ్లారు. అక్కడ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేసి కిడ్నీ తీస్తుండగా ఆమె మృతి చెందింది. ఈ విషయం తిరుపతిలో ఉన్న భర్తకు తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కిడ్నీ రాకెట్ వెలుగులోకి వచ్చింది. ఓ ముఠా ఏకంగా విశాఖ నుంచి జిల్లాలు దాటించి కిడ్నీలు అమ్మే స్థాయిలో నెట్‌వర్క్ ఏర్పాటు చేయడంపై పోలీసులు దృష్టిసారించి ముఠా సభ్యులపై ఆరా తీస్తున్నారు. **దళారి... గాజువాక మహిళ:** కిడ్నీకి రూ.8 లక్షలు ఇస్తామని ఆశ చూపి యమునను మదనపల్లె తీసుకెళ్లారు. ముఠాలో గాజువాకకు చెందిన పద్మ కీలక దళారిగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. మదనపల్లెలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి సిబ్బందితో ముందుగా ఒప్పందం చేసుకొని ముఠా రంగంలోకి దిగింది. యమునను ఒప్పించి మదనపల్లెకు తీసుకెళ్లగా అనుకోని రీతిలో ఆమె



ప్రాణాలు కోల్పోయింది.

ఎన్నో ఘటనలు రెండేళ్ల క్రితం కిడ్నీ ఇస్తే రూ.8.50 లక్షలు ఇస్తామని మధురవాడ వాంబే కాలనీకి చెందిన డ్రైవర్‌ను నమ్మించారు. పెందుర్తిలోని ఓ క్లినిక్‌లో కిడ్నీ తీసి రూ.2.50లక్షలే ఇచ్చారు. డ్రైవర్‌కు సరైన వైద్యం అందక ఆరోగ్యం క్షీణించడంతో పోలీసులకు జరిగిందంతా చెప్పారు. అదే కాలనీలో ఓ యువకుడు ఇంట్లో గొడవపడి మద్యం మత్తులో ఆరుబయట నిద్రిస్తుండగా, రూ.లక్షలు ఆశచూపి, బైకు కొనిస్తామంటూ ఎర వేసి కిడ్నీ తీసేసుకున్నారు.

ఇదే ప్రాంతానికి చెందిన ఓ మహిళ నుంచి కిడ్నీ తీసుకుని రూ.4లక్షలే ఇవ్వడంతో ఆమె పోలీసులనాశ్రయించింది. బీ గతేడాది జులైలో ద్వారకా స్టేషన్ పరిధిలో ఓ ప్రైవేటు నెఫ్రాలజిస్టు రూ.27 లక్షలకు బేరం కుదుర్చుకొని కిడ్నీ సమకూర్చకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# నీరుంది.. నిర్వహణే లేకుంది

ఈ చిత్రంలో కనిపిస్తున్నది.. ఎడమ పంట కాల్వ. దీని కింద సుమారు 3,752 ఎకరాల ఆయకట్టు ఉంది. రబీ సీజన్‌లో పంట కాల్వలకు నీటిని విడుదల చేస్తుంటారు. 0 కి.మీ నుంచి 2 కి.మీ. వరకు కాల్వలో గడ్డి, జమ్ము విపరీతంగా పెరిగిపోయింది. ఫలితంగా నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది ఎగువ ప్రాంతాల్లో వర్షాలు సమృద్ధిగా పడటంతో గాజులదిన్నె ప్రాజెక్టు నీటితో కళకళలాడుతోంది. దీనికింద సుమారు 24 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. సాగునీటి కాలువలకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పంటలకు సాగునీరు అందించే డిస్ట్రిబ్యూటరీ కాల్వల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఫలితంగా పొలాలకు నీరందడం గగనంగా మారింది.

**అన్నదాతలపైనే భారం**

గాజులదిన్నె జలాశయం పరిధిలో 11 సాగునీటి సంఘాలున్నాయి. వీటి పరిధిలో పిల్ల కాల్వలున్నాయి. నిర్వహణ కరవవడంతో రైతులపై భారం పడుతోంది. వారే స్వయంగా తలా ఓ చేయి వేసుకొని పిల్ల కాల్వల్లో ముళ్ల పొదలు, పూడికతీత పనులు చేపడుతున్నారు. కాల్వల అభివృద్ధికి నిధులు సమకూరడం లేదని సాగునీటి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

ఈ ఏడాది అతివృష్టి, అనావృష్టి కారణంగా చాలామంది రైతులు నష్టపోయారు. ఖరీఫ్‌లో చాలావరకు పంటలు చేతికిరాలేదు. ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం పూర్తిస్థాయికి చేరడంతో కర్షకులు రబీ సాగుపై ఆశలు పెంచుకున్నారు.

# నర్సులేరీ.. సేవలేవీ?



హిందూపురం : హిందూపురంలో వైద్య విధాన పరిషత్ జిల్లా ఆసుపత్రి ఉంది. అందులో ఉన్న సిబ్బందిని చూస్తే ఇది ఆస్థాయి అసుపత్రేనా అన్న సందేహం కలుతుగుంది. గతంలో ఇక్కడ 48 మంది నర్సులు పని చేసేవారు. జగన్ ప్రభుత్వం వచ్చాక పాఠశాలల్లోనే కాదు. ఆసుపత్రుల్లోను క్రమబద్ధీకరణ పేరుతో వైద్యులు, సిబ్బంది సంఖ్యను తగ్గించింది. ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుల పోస్టులను 40కి కుదించింది. ఆ తరువాత బదిలీలు ఇతరత్రా కారణాలతో చాలా మంది ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రస్తుతం 27 మంది మాత్రమే పని చేస్తున్నారు. మరో 13 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**సేవలు.. గొడవలు**

ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవతో ఇటీవల కాలంలో ఆసుపత్రికి అనేక సదుపాయాలు సమకూరడంతోపాటు వైద్యులు వచ్చారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య గతంలో కన్నా భారీగా పెరిగింది. నర్సుల సంఖ్య మాత్రం పెరగలేదు. ఉన్న వారిపై పనిభారం పెరిగింది. సెలవులు లేకుండా పని చేయాల్సి వస్తోంది. ఉదయం పూట విధులకు వచ్చిన నర్సులు మళ్లీ రాత్రి డ్యూటీకి రావాల్సి వస్తోంది. విరామం లేకుండా పని చేయాల్సి రావడంతో వారు నాణ్యమైన సేవలు అందించలేక పోతున్నారు. వారిపై రోగులు మండిపడుతున్నారు. వైద్యం అందించినా నర్సులు పని చేయడం లేదంటూ తరచూ గొడవలకు దిగుతున్నారు. అత్యవసర వైద్యం కోసం వచ్చిన వారిని, ప్రమాదాల్లో గాయపడిన వారికి వైద్య సేవలు అందించలేక బెంగళూరు, అనంతపురం ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు.

# కస్తూర్బాలకు మహర్దశ



కళ్యాణదుర్గం : కూటమి ప్రభుత్వం రాకతో జిల్లాలోని కస్తూర్బా విద్యాలయాల(కేజీబీవీ)కు మహర్దశ పట్టింది. ఒక్కో కేజీబీవీకి అదనంగా 6 గదుల సముదాయంతో కూడిన వసతి భవనాలు నిర్మిస్తుండటంతో ఇరుకు గదుల కష్టాలు తీరనున్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థినులు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 32 కేజీబీవీలు ఉన్నాయి. ఇందులో 6 నుంచి 10 తరగతుల్లో మొత్తంగా సుమారు 200 మంది విద్యార్థినులున్నారు. మూడేళ్ల కిందట వైకాపా ప్రభుత్వం అన్ని కేజీబీవీలను జూ.కళాశాలలుగా ఉన్నతీకరించడంతో మరో రెండు తరగతులు, ప్రయోగశాలలు పెరిగినప్పటికీ ఉన్న గదుల్లోనే సర్దుకోవాల్సిన స్థితి నెలకొంది.

**భోజనశాలల్లోనే బోధన**

అదనపు గదులు నిర్మించకుండా ఇంటర్‌లో ప్రవేశాలు తీసుకోవడంతో విద్యార్థినుల కష్టాలు రెట్టింపయ్యాయి. 'నాడు- నేడు' పథకంలో అదనపు గదులు మంజూరు చేసినా.. నిధులు మాత్రం మంజూరు కాకపోవడంతో పనులు పూర్తికాలేదు. ప్రతీ కేజీబీవీలో ఇంటర్ తరగతులను వసతి గృహాలు, భోజనశాల గదుల్లో తరగతులు కొనసాగించాల్సి వస్తోంది. రాత్రుళ్లు సుమారు 280 మంది విద్యార్థినులు తరగతి గదుల్లో నిద్రిస్తూ.. అవస్థలు పడుతున్నారు.

**యుద్ధప్రాతిపదికన పనులు**

కూటమి ప్రభుత్వం కేజీబీవీలలో వసతి గదుల నిర్మాణంపై దృష్టి సారించింది. గతంలో నిర్మించిన 10 కేజీబీవీలను మినహాయించి కణేకల్లు, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, డి.హీరేహాళ్, ఉరవకొండ, కూడేరు తదితర ప్రాంతాల్లోని 22 కేజీబీవీలకు అదనంగా 6 గదుల సముదాయ వసతి భవనాలు మంజూరు చేసి పనులకు శ్రీకారం చుట్టారు. త్వరలో విద్యార్థులకు గదులు అందుబాటులోకి తెచ్చేలా పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగిస్తున్నారు. దీనివల్ల ఇంటర్‌లో విద్యార్థినులు ఎక్కువ సంఖ్యలో ప్రవేశాలు పొందడానికి ఆసక్తి చూపుతారు.

# నీరందేనా.. పండేనా!



తాడిమర్రి : పీఏబీఆర్ కుడికాలువలో నీరు ప్రవహిస్తే వేలాది ఎకరాలకు ప్రయోజనం చేకూరుతుంది. పీఏబీఆర్‌లో ప్రస్తుతం 5 టీఎంసీలకు పైగా జలాలు ఉన్నాయి. తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవరం మండలాల పరిధిలోని కుడికాలువకు ఈసారైనా నీరు అందుతాయా అనే ప్రశ్న రైతుల్లో తలెత్తుతోంది. విడుదల అయ్యాక ఎటువంటి ఆటంకాలు లేకుండా వస్తే వేలాది మంది రైతులకు ఏడాది పొడవున ఉద్యాన, స్వల్పకాలిక పంటలను సాగు చేసేందుకు అవకాశం ఉంది. కుడికాలువ ద్వారా నవంబరు, డిసెంబరు మాసాల్లో పలు చెరువులు, కుంటలకు నీటిని అందిస్తారు. మూడేళ్లుగా అరకొరగా విడుదల చేస్తుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈసారి నీరు ఆశాజనకంగా నిల్వ ఉండటంతో కాలువలోకి చేరితే.. భూగర్భజలాలు పెరిగి, బోర్లు రీఛార్జి అవుతాయి. దీంతో 20 వేల ఎకరాల్లోని పంటలకు నీరు అందుతుంది.

**42 చెరువులు, కుంటలకు నీరు**

పీఏబీఆర్ కుడికాలువ ఉమ్మడి జిల్లాలో 112 కి.మీ మేర విస్తరించి ఉంటుంది. కాలువ ద్వారా 42 చెరువులు, కుంటలు నింపుతారు. తాడిమర్రి మండలంలోని అగ్రహారం చెరువుకు తొలుత నీటిని విడుదల చేస్తారు. 87 కి.మీ నుంచి ప్రారంభమై.. ప్రవాహం ధర్మవరం నియోజకవర్గంలోని చెరువులకు చేరుతుంది.

**ఎన్నో ఆశలు**

నీరు వదిలితే ఉద్యాన పంటలే కాకుండా స్వల్పకాలిక పంటలను సాగు చేసే రైతులు అధికంగా ఉన్నారు. గతంలో టమాటా, మిర్చి, బెండ, ఆకుకూరలు, వంకాయ, వరి తదితర పంటలను వేసేవారు. సరైన సమయంలో కుడికాలువకు నీటిని విడుదల చేయకపోవడం, పూర్తిస్థాయిలో చెరువులను నింపకపోవడంతో పంటలను సాగు చేసేందుకు వెనుకడుగు వేశారు. దీనికి తోడు గత వైకాపా పాలనలో కుడికాలువ మరమ్మతులకు ఏమాత్రం నిధులను మంజూరు చేయలేదు. కాలువ అధ్వానంగా తయారై నీరంతా వృథాగా పక్కకు పోయి.. పొలాల్లోకి చేరి పంటలను ముంచేసింది.

కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద కాలువల్లో కొన్నిచోట్ల పూడికలు తీయించి, శుభ్రం చేయించడంతో ప్రవాహంపై రైతుల్లో ఆశలు నెలకొన్నాయి.

**సన్నాహాలు చేస్తున్నాం** ఈనెల 25న నీటి విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం. గేట్ల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వాటి పనులనూ త్వరగతిన పూర్తి చేస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సుధాకర్, ఎస్ఈ, హెచ్ఎల్‌సీ

# ఆయకట్టు రైతుల్లో కలవరం

అనంతపురం : హెచ్చెల్సీ-ఎంపీఆర్ దక్షిణ కాలువ గేటు ఉన్నఫళంగా కిందకు దిగిపోయింది. దీంతో ఒక్కసారిగా కాలువలో నీటి ప్రవాహం పూర్తిగా ఆగిపోయింది. ఆ గేటును మళ్లీ పైకి ఎత్తడానికి నానా కష్టాలు పడుతున్నా ఫలితం కనిపించడం లేదు. ఐదు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

**రాడ్ విరిగిపోవడంతో...**నీటి సరఫరా ఆగడంతో ఆయకట్టుదారుల్లో ఆందోళన నెలకొంది. కాలువ కింద దాదాపు 35వేల ఎకరాలకుపైగా వరి సాగు చేశారు. పంటకు నిరంతరం నీరు అందించాల్సి ఉంది. నీటి ప్రవాహం కోసం అన్నదాతలు నిరీక్షిస్తున్నారు. మొన్నటి మొంథా తుపాన్ సమయంలో ఎంపీఆర్ జలాశయం దక్షిణ కాలువ గేటును కొద్దిమేర కిందకు దించి నీటి ప్రవాహ సామర్థ్యాన్ని తగ్గించారు. మళ్లీ ఈనెల 7వ తేదీన నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పెంచాలన్న ఉద్దేశంతో ఆ గేటును పైకి ఎత్తడానికి యత్నించే సమయంలో ఒక్కసారిగా కిందకు దిగింది. గేటుకు కింద ఉండే రాండ్ విరిగిపోవడంతోనే ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది.

**మొరాయించిన ప్రధాన గేట్లు**ఎంపీఆర్ జలాశయం దక్షిణ కాలువకు మూడు ప్రధాన గేట్లు ఉన్నాయి. ఇవన్నీ గత వైకాపా పాలనలోనే మొరాయించాయి. ఏ ఒక్కదానికీ మరమ్మతు చేయించలేదు. ప్రస్తుత తెదేపా కూటమి ప్రభుత్వం రాగానే గతేడాది ఒక గేట్‌కు మరమ్మతు చేశారు. ఇప్పుడు ఒక్క గేటు మాత్రమే పని చేస్తుండగా తాజాగా అది కూడా మొరాయిస్తోంది.

# 'బాటిల్' బయటకెళ్తోంది..

గాజువాక : 'రక్షణ మద్యం ఇచ్చే కిక్కే వేరప్పా'... అంటారు మందుబాబులు. అందుకే బయట ఎంత మద్యం దొరికినా రక్షణ మద్యం కోసం అర్రులు చాస్తుంటారు. ధర కూడా బయటి మార్కెట్‌తో పోలిస్తే తక్కువగా ఉండటం కూడా వీరి ఆశకు మరో కారణం. అలాగని మందుబాబులందరూ రక్షణ ఉద్యోగులు కాదు. మరి వీరి చేతుల్లోకి 'రక్షణ' బాటిళ్లు ఎలా వస్తున్నాయనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. ఇటీవల తరచూ ఎక్సైజ్ పోలీసులు డిఫెన్స్ మద్యం స్వాధీనం చేసుకున్న వార్తలు చర్చనీయాంశమవుతున్నాయి. ఈ వివరాలు తెలుసుకుందాం..

**సైన్యంలో సామాజిక ఐక్యత పెంపొందించడానికి...** సైనికులు మానసిక ఒత్తిడిని జయించడానికి.. భౌగోళిక వాతావరణ పరిస్థితులను తట్టుకోవడం వంటి పలు లక్ష్యాలతో సైన్యంలో పనిచేసే సిపాయి మొదలు ఉన్నతాధికారుల వరకు రాయితీతో కూడిన మద్యం నిర్ణీత మొత్తంలో అందిస్తారు. విశ్రాంత సైనిక ఉద్యోగులకు కూడా ఈ మద్యం అందుతుంది.. క్యాంటిన్ స్టోర్స్ డిపార్టుమెంటు(సీఎస్డీ) ద్వారా దీన్ని కేటాయిస్తారు. సబ్సిడీతో లభించే ఈ మద్యం మార్కెట్ ధరల కన్నా తక్కువ. రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ లేనందున దీన్ని చౌకగా పొందుతుంటారు.



**బయటకు ఎందుకు వస్తుందంటే..:** రక్షణ/విశ్రాంత సిబ్బంది ఏదైనా వస్తువులు కొన్నప్పుడు డబ్బుల బదులు మద్యం ఇస్తుంటారు. ఇది తెలిసిన వారికే. ఉదాహరణకు.. రోజూ ఇంట్లో పాలు పోయించుకుంటే.. పాలకు డబ్బులు బదులు.. మద్యం బాటిళ్లు ఇస్తారు. పారిశ్రామిక ప్రాంతంలో ఈ తరహా మార్పిడి ఎక్కువ. రెండో విధానంలో.. ఎవరైనా దీన్ని అమ్ముకుంటారని అనుమానం ఉందో మందుబాబులు, బెల్టుషాపుల యజమానులు వారిని సంప్రదిస్తారు. ఒకసారి అమ్మితే ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ సమాచారం బయటకు వచ్చినపుడు ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి పట్టుకుంటుంటారు.

ఆ మద్యమే ఎందుకంటే..

త్రివిధ దళాల సైనికులకు మద్యం నేరుగా తయారీ కంపెనీల నుంచే డిఫెన్స్ క్యాంటీన్లకు చేరుతుందనే నమ్మకం.

బయటి మద్యం కల్తీకి ఆస్కారం ఉంటుందనే భావన

డిఫెన్స్ క్యాంటీనులో లిక్కర్ ధరకు బయటి దుకాణాల్లో రెండు నుంచి మూడున్నర రెట్లు వరకు తేడా ఉండటం

# 'తమలపాకు' పరిహారంలో అనర్హులు

పాయకరావుపేట : మొంథా తుపాను పరిహారం జాబితాల్లో అనర్హులు చొరబడ్డారు. తమలపాకు సాగు చేయకపోయినా కౌలు రైతులుగా పేర్లు నమోదు చేసుకున్నారు. నష్టపోయిన వారితోపాటు భూములు లేకున్నా, తోటలు లేకున్నా పేర్లు రాయించుకున్నారు. గత నెలలో పంజా విసిరిన మొంథా తుపాను ధాటికి అన్నదాతకు నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. ఊహించిన స్థాయిలో తుపాను ప్రభావం లేకపోవడంతో కొద్దిపాటి నష్టాలతో రైతులు గట్టెక్కారు.

పాయకరావుపేట మండలం కొత్తూరు, మాసాహెబ్‌పేట, సత్యవరం, మంగవరం తదితర గ్రామాల పరిధిలో అక్కడక్కడ ముదురు తమలపాకు తోటలు నేలకూలాయి. ఉద్యాన శాఖ అంచనా మేరకు సుమారు 140 ఎకరాల్లో తోటలు దెబ్బతిన్నాయని, 555 మందికి రైతులకు నష్టం వాటిల్లినట్లు జాబితాలు సిద్ధం చేశారు. తొలివిడతలో చేపట్టిన సర్వేలో విస్తీర్ణం తక్కువే. రైతులూ తక్కువగానే ఉన్నారు. కొంతమంది స్వార్థం వాస్తవంగా నష్టపోయిన వారికి చేటు చేస్తోంది. మాసాహెబ్‌పేట, సత్యవరం గ్రామాల్లో అనర్హుల పేర్లు జాబితాల్లోకి ఎక్కాయి. ఇసుక తిన్నెలు, తోటలు లేకుండానే ఉన్నట్లుగా రాయించుకున్నారు. ఈ రెండు గ్రామాల పరిధిలో 40 మందికిపైగా అనర్హులు ఉంటారని కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. మాసాహెబ్‌పేట గ్రామంలో జాబితాలో పేర్లను ఫ్లెక్సీలు వేసి ప్రదర్శించారు. దీంతో అనర్హుల గుట్టు బయటపడింది.

ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో మరోసారి సర్వే చేయాలని ఆదేశాలొచ్చాయి. ఉద్యానశాఖ సిబ్బంది నుంచి తోటల పరిశీలన చేపట్టారు. మొక్కుబడిగా సర్వే చేయడంతోనే అనర్హుల పేర్లు జాబితాల్లోకి వచ్చాయన్న ఆరోపణలున్నాయి. ఉద్యానాధికారిణి సాయిప్రియ మాట్లాడుతూ.. మరోసారి గ్రామాల్లో సమగ్రంగా వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

# సహకరిస్తే.. ఉపాధి సాకారం

కర్నూలు : నంద్యాల జిల్లా నందికొట్కూరు సమీపంలోని తంగడంచలో జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలనుకున్నప్పటికీ అడుగులు ముందుకు పడటం లేదు. పీవీసీ, హెచ్‌డీపీఈ పైపులు, వ్యవసాయ ఉత్పత్తులు, స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాలతో పాటు పలురకాల పండ్ల గుజ్జు తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని 2017లో ఈ సంస్థ ప్రతిపాదించింది. పది వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని ప్రకటించింది. ఈ సంస్థకు అప్పట్లో తెదేపా ప్రభుత్వం అనుమతులిచ్చి భూమి సైతం కేటాయించింది. ఒప్పందం ప్రకారం ఆ సంస్థ నిర్వహణకు అవసరమైన నీరు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలి. **వైకాపా అధికారంలోకి రావడంతో..**

2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీనిని డోన్ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేయాలని నాటి మంత్రి బుగ్గన సూచించారు. అప్పటికే భూ కేటాయింపులు జరగడం.. వసతులు సమకూర్చుకోవడంతో ప్రతిపాదనకు నిరాకరించింది. ఈ నేపథ్యంలో సంస్థ సమీపం నుంచి వేయాల్సిన ముచ్చుమర్రి-ఓర్వకల్లు పైపులైను పనులను మార్చేశారు. గత ఒప్పందం ప్రకారం.. నీటి సౌకర్యం కల్పిస్తే తొమ్మిది నెలల్లో పరిశ్రమ నిర్మాణాన్ని పూర్తిచేసి ఉత్పత్తి మొదలుపెట్టేందుకు జైన్ ఇరిగేషన్ సంస్థ సుముఖంగా ఉంది. ప్రస్తుత ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

**పది వేల మందికి ఉపాధి**సంస్థకు అవసరమైన నీరు, విద్యుత్తు అందించేలా రెండు నిర్ణయాలు తీసుకుంటే పది వేల మందికి ఉపాధి లభిస్తుంది. ముచ్చుమర్రి-ఓర్వకల్లు పైపులైను నిర్మాణ మార్గం మారిన నేపథ్యంలో నందికొట్కూరు నుంచి జైన్ ఇరిగేషన్ సంస్థ వరకు పైపులైను వేయాల్సి ఉంటుంది. ఒప్పందం ప్రకారం జైన్ ఇరిగేషన్ సంస్థ పండ్ల గుజ్జు తయారీ పరిశ్రమతోపాటు అదనంగా ఉల్లిపొడి తయారీ కూడా చేపట్టాలని నిర్ణయించింది. ఇవి సాకారమైతే ఉమ్మడి జిల్లాలో వేలాది మంది ఉల్లి, టమాటా రైతులకు సైతం మేలు చేకూరుతుంది.

చురకలు



# 'రాజ'మార్గం


బనగానపల్లి : జిల్లావాసులు రాజధానికి సులువుగా వెళ్లేలా మార్గం సుగమమైంది. అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గ పరిధిలోని బుగ్గ గ్రామం నుంచి నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం పచ్చర్ల గ్రామ శివారు వరకు గతంలో ఆర్‌అండ్‌బీ పరిధిలో రహదారి ఉండేది. దీనిని 2016లో జాతీయ రహదారి (544–డి) పరిధిలోకి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో అనంతపురం–అమరావతి రహదారిగా అభివృద్ధి చేయనున్నారు.

**రూ.4,200 కోట్లు కేటాయింపు**

అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల, బనగానపల్లి, మహానంది మీదుగా అమరావతి వరకు నాలుగు వరుసల జాతీయ రహదారి పనులు చేపట్టేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మార్గానికి కేంద్ర ప్రభుత్వం రూ.4,200 కోట్లు మంజూరు చేసింది. బుగ్గ నుంచి ప్రకాశం జిల్లా గిద్దలూరు వరకు 135 కి.మీ. దూరం ఉండగా బనగానపల్లి నియోజకవర్గంలోనే 74 కి.మీ. ఉండటం విశేషం. జిల్లామీదుగా మొత్తం 94 కి.మీ. మేర రహదారి నిర్మించనున్నారు. ఇప్పటికే అనంతపురం జిల్లాలో పనులు ప్రారంభించారు.

**గత ప్రభుత్వం పట్టించుకోక..**

బుగ్గ సమీపం నుంచి బందర్లపల్లె చెక్‌పోస్టు, కొలిమిగుండ్ల, బనగానపల్లి మండలం టంగుటూరు వరకు 74 కి.మీ. మేర ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న రహదారిని గత వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. గుంతలమయంగా మారడంతో వాహనదారులు నరకయాతన అనుభవించారు. అప్పట్లో కేవలం రూ.7 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.



కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.15 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో గుంతలన్నీ పూడ్చారు. జాతీయ రహదారి పనులు ప్రారంభమైతే పూర్తిస్థాయిలో విస్తరించనున్నారు.

**పలు ప్రాంతాల్లో బైపాస్‌ల ఏర్పాటు**

కొన్ని గ్రామాల వద్ద బైపాస్ రహదారులు నిర్మించనున్నారు. కొలిమిగుండ్ల మండలంలోని అంకిరెడ్డిపల్లె, రాఘవరాజుపల్లె, కనకాద్రిపల్లె, కొలిమిగుండ్ల, అవుకు మండలం రామాపురం, అవుకు, బనగానపల్లి, టంగుటూరు, గోస్పాడు మండలం రాయపాడు, తేళ్లపురి, ఎస్.నాగలాపురం, దీబగుంట్ల, మహానంది మండలం గాజులపల్లె తదితర ప్రాంతాల్లో బైపాస్ రోడ్లు నిర్మించనున్నారు. ఎన్‌హెచ్ 544–డిని అనుసంధానం చేసేందుకు బనగానపల్లి వద్ద రూ.50 కోట్లతో రింగ్ రోడ్డు పనులు ప్రారంభించారు.

ప్రాజెక్టు : జాతీయ రహదారి 544–డి
నిర్మాణ వ్యయం : రూ. 4,200 కోట్లు
మొత్తం పొడవు : 135 కి.మీ.
జిల్లాలో నిర్మించే వంతెనలు : 5
భూసేకరణ : 302 హెక్టార్లు
భూసేకరణకు వ్యయం: రూ. 104 కోట్లు
బైపాస్ మొత్తం : 15

# కార్తీక పూజలకు వేళాయె

నరసరావుపేట : శివ, కేశవులకు ప్రీతిపాత్రమైన కార్తిక మాసంలో కోటప్పకొండపై ఈనెల 22 నుంచి నవంబరు 20 వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తుల రాక ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో స్వామి దర్శనానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన వసతులు కల్పించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం, శీఘ్ర దర్శనం లైన్ల ద్వారా భక్తులను అనుమతిస్తారు. సోమ, ఆదివారాలు, కార్తిక పౌర్ణమి రోజుల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో స్వామికి ఆలయంలోని మండపంలో అభిషేకాలు చేస్తారు. ఆయా రోజుల్లో మూలవిరాట్టుకు వేకువజామున మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అలంకరణలు చేసి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. సాధారణ రోజుల్లో యథావిధిగా భక్తులు మూలవిరాట్టుకు అభిషేకం చేయించుకోవచ్చు. అలాగే కార్తిక పౌర్ణమి నాడు జ్వాలతోరణం ఘనంగా నిర్వహిస్తారు.

**2 లక్షల లడ్డూల తయారీ :** భక్తులకు అందించేందుకు లడ్డూ, అరిసె ప్రసాదం తయారీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. 2లక్షల లడ్డూలు, 80వేల అరిసెలు చేయిస్తున్నారు. అవసరమైతే మరిన్ని చేయించేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు. స్వామి వారికి ముందుగా నివేదన చేసిన తర్వాతే ప్రసాదాలు భక్తులకు విక్రయిస్తారు.

**పరోక్ష అభిషేకాలకు అవకాశం :** అభిషేక ప్రియుడైన శ్రీత్రికోటేశ్వర స్వామిని ప్రత్యక్షంగా దర్శించుకుని అభిషేకాలు చేయించుకోలేని వారికి దేవస్థానం పరోక్ష అభిషేకం కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. రూ.1000 చెల్లించి రసీదు పొందితే గోత్ర నామాలతో కార్తిక మాసంలో



ప్రతిరోజూ నిత్యం అభిషేకం, పూజలు చేస్తారు. మాసానంతరం భక్తులకు స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదాన్ని కొరియర్ ద్వారా పంపేందుకు ఏర్పాటు చేశారు. అంతే కాకుండా రసీదు పొందిన భక్తులు ప్రతి రోజు స్వామినిపర్యాయం దర్శించుకునేందుకు అనుమతి స్తారు.

**తాగునీరు, పారిశుద్ధ్యంపై దృష్టి**

భక్తులు స్వామిని ప్రశాంతంగా దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. తాగునీరు, పారిశుద్ధ్యంపై దృష్టిపెడుతున్నాం. అలాగే ఆనందవల్లి, మేధా దక్షిణామూర్తి ఆలయం, రావిచెట్టు వద్ద పూజలు, పొంగళ్లు వండుకునేందుకు ఏర్పాట్లు, నాగేంద్రస్వామి ఆలయం వద్ద కూడా ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. కొండపై ఉన్న రెండు ఆర్వో ప్లాంట్ల ద్వారా తాగునీరు అందిస్తున్నాం. దాసరి చంద్రశేఖరరావు, సహాయ కమిషనర్, త్రికోటేశ్వరస్వామి దేవస్థానం, కోటప్పకొండ

# సాగు..'కట్ట'మే



ఆళ్లగడ్డ : తెలుగుగంగ ఉప కాలువల కట్టలు బలహీనంగా మారాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో తరచూ గండ్లు పడుతున్నాయి. పనులు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించింది. ప్రారంభించిన కొద్ది రోజులకే కాలువలకు నీరు వదలడంతో పనులు ముందుకు సాగని పరిస్థితి.

**నిర్వహణ కరవై..**

వివిధ ప్రాంతాల్లో తెలుగు గంగ ఉప కాలువలకు గండ్లు పడడం సర్వసాధారణంగా మారింది. పలుమార్లు కట్టలు తెగిపోతుండటంతో వందల ఎకరాల్లో పంటలు మునిగిపోతున్నాయి. అన్నదాతలకు అపార నష్టం జరుగుతోంది. కట్టలు దెబ్బతింటున్న నేపథ్యంలో నీరు ముందుకు ప్రవహించక పంటలు ఎండిపోతున్నాయి. ఉప కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతోనే ఈ సమస్య ఏర్పడుతోందని అన్నదాతలు పేర్కొంటున్నారు. మరోవైపు కొందరు రైతులు ఇష్టానుసారంగా తూముల వద్ద గేట్లు ఎత్తడం, ప్రవాహానికి ఇసుక సంచులు అడ్డేసి నీటిని మళ్లించుకుంటున్నారు. ఫలితంగా కట్టలు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో తెగిపోతున్నాయి.

**రూ.1.20 కోట్లు మంజూరైనా..**

ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో తెలుగుగంగ ఉప కాలువలకు మరమ్మతులు చేపట్టేందుకు రూ.1.20 కోట్లు మంజూరయ్యాయి. నీటి సంఘాల ఆధ్వర్యంలో రూ.30 లక్షల విలువైన పనులు చేశారు. అంతలోనే కాలువలకు సాగు నీరు విడుదల చేశారు. ఫలితంగా పనులు మధ్యలోనే ఆగిపోయాయి.

**తరచూ గండ్లు పడుతూ..** శ్రీరంగాపురం వద్ద 17వ బ్లాక్‌లోని మైనర్ కాలువకు గతేడాది గండి పడింది. అధికారులు పట్టించుకోకపోవడంతో చివరికి రైతులే చందాలు వేసుకుని పూడ్చుకున్నారు.

రుద్రవరం పరిధిలోని 21వ బ్లాక్‌లో మూడు నెలల కిందట ప్రధాన కాలువ లైనింగ్ కూలిపోవడంతో కట్ట బలహీనపడి ప్రమాదకరంగా ఉంది.

రుద్రవరం పరిధిలోని అప్పనపల్లె వద్ద 19వ బ్లాక్ మైనర్ కాలువకు గతేడాది ఆగస్టులో గండి పడింది. తిరిగి ఈ నెలలో అదే బ్లాక్ డ్రాప్ వద్ద మరోసారి గండి పడి నీరంతా వృథాగా పోయింది. పంటలకు నీరు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు.

# ఇంట్లోనే ఉన్నట్లు..



విజయనగరం : విద్యార్థులు హాయిగా నిద్రించడానికి పరుపులు.. తాగేందుకు రక్షిత నీరు.. దోమలు కుట్టకుండా కిటికీలకు మెష్‌లు.. మరుగుదొడ్లకు తలుపులు.. ఇదీ వసతి గృహాల్లో మారుతున్న పరిస్థితులు. గత ప్రభుత్వం బాలల వసతి గృహాలవైపు కన్నెత్తి చూడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వసతులపై ప్రత్యేక దృష్టి సారించింది.

తొలి దశలో ఎస్సీ, బీసీ వసతి కేంద్రాల్లో కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రభుత్వం సర్వే చేయించింది. అధికారుల నివేదిక ఆధారంగా జిల్లాలో 23 ఎస్సీ వసతి గృహాలకు రూ.4.67 కోట్లు, 20 బీసీ వసతి కేంద్రాలకు రూ.60 లక్షలు కేటాయించింది. ఆయా నిధులతో విద్యుత్తు, భవనాలకు మరమ్మతులు, మరుగుదొడ్లు, వంటగదులు, కిటికీలు, తలుపులు ఇలా ప్రతి ఒక్కటీ మార్పు చేస్తున్నారు. ఇప్పటికే 95 శాతం పనులు పూర్తిచేసినట్లు బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖాధికారులు సుధారాణి, వెంకటేశ్వర్లు తెలిపారు. అద్దె భవనాల్లో నడుస్తున్నచోట కొంత ఇబ్బందులున్నాయని, వాటిని మార్పు చేయాలని యాజమానులకు చెబుతున్నామని తెలిపారు.

**ఎస్సీ వసతి గృహాల్లో ఇలా..**

జిల్లాలో మొత్తం 30 వసతి కేంద్రాల్లో 2,550 మంది విద్యార్థులున్నారు. పీఎం అజయ్ పథకంలో భాగంగా కొత్త భవన నిర్మాణాలకు గజపతినగరం, ఎస్.కోట బాలికల కేంద్రాలకు రూ.6 కోట్లు పంపారు. కూటమి ప్రభుత్వం రాగానే జిల్లాలో 23 వసతి కేంద్రాల్లో మరమ్మతులకు రూ.4.67 కోట్లు మంజూరు చేసింది. ఆయా నిధులతో తెర్లాంలో వసతి కేంద్రం మినహా మిగిలినచోట్ల మరమ్మతులు చేపట్టారు. రక్షిత నీటికి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. తెర్లాం, రామభద్రపురం, బొబ్బిలిలో భవనాలు కోసం రూ.9 కోట్లతో పంపిన ప్రతిపాదనలకు ఆమోదం రావాల్సి ఉంది.

**బీసీ వసతిగృహాల్లో..**

జిల్లాలో మొత్తం 51 బీసీ వసతిగృహాలున్నాయి. వీటిలో పిరిడి, విజయనగరం, గంట్యాడ, అలుగోలు, జొన్నవలస, భోగాపురం ప్రాంతాల్లో నూతన భవనాల కోసం రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. పరిపాలనా ఆమోదం రావాల్సి ఉంది. విజయనగరం, జొన్నవలసలోని వసతి కేంద్రాల కోసం ఇటీవల ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.4 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. మరో 20 వసతి గృహాల్లో మరమ్మతుల కోసం రూ.60 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటితో 19 చోట్ల పనులు పూర్తి చేశారు.

**కాస్మొటిక్ ఛార్జీల చెల్లింపు**

జిల్లాలో బీసీ, ఎస్సీ వసతి కేంద్రాల్లో విద్యార్థులకు కాటుక, బొట్టు, సబ్బు, నూనె తదితరాలకు అవసరమైన కాస్మొటిక్ ఛార్జీలను ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు దఫాలుగా విడుదల చేసింది. మెనూ ప్రకారం భోజనం అందించేందుకు ఆగస్టు వరకు నిధులొచ్చాయి.

# అనుమతి లేని బ్యారన్లు.. అడిగేవారు లేరు



టంగుటూరు : కేంద్ర ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులను తగ్గించే దిశగా అడుగులు వేస్తోంది. అధిక పంట సాగు చేయవద్దని ఆదేశాలిచ్చినా రైతులు మాత్రం ప్రత్యామ్నాయం లేక పొగాకు సాగుచేస్తున్నారు. కొందరు ఇష్టానుసారంగా అనధికారిక బ్యారన్‌లు నిర్మిస్తూనే ఉన్నారు. తద్వారా బోర్డు అధికారులు రైతులకు, వ్యాపారు లకు నోటీసులిచ్చి మిన్నకున్నారు. పశ్చిమ ప్రకాశంలో నెలకొన్న ఇలాంటి పరిస్థితిని కొలిక్కితెచ్చే దిశగా అధికారులు సత్వర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. **మూడేళ్లల్లో 320 నిర్మాణాలు** పశ్చిమ ప్రకాశంలోని కొండపి, టంగుటూరు పొగాకు వేలం కేంద్రాల పరిధిలో 6,828 మంది రైతులు ఏటా పొగాకు సాగు చేస్తుంటారు. 5,803 బ్యారన్‌ల లైసెన్స్‌లను పునరుద్ధరణ పొందుతుంటారు. 20 ఏళ్లుగా పొగాకు ఉత్పత్తులను నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త బ్యారన్లకు లైసెన్స్‌లను నిలిపివేసింది. నాటి నుంచి అడపాదడపా నిర్మిస్తుండటం, మరో రైతు లైసెన్స్‌లు కొనుగోలు చేయడం చేస్తున్నారు. మూడేళ్లుగా పొగాకు ధరలు మంచి ఆదాయాన్ని తెచ్చి పెట్టడంతో బ్యారన్లను ఇష్టానుసారంగా నిర్మించారు. కొండపి బోర్డు పరిధిలో గడిచిన ఏడాది సుమారు 200 బ్యారన్‌లను అక్రమంగా నిర్మిస్తే, టంగుటూరు పరిధిలో 120 వరకు నిర్మించారు. **రెవెన్యూ అధికారులకు చేరిన జాబితా.** .గ్రామాల్లో ఏదైనా నిర్మాణాలు చేపట్టాలన్నా పంచాయతీ అనుమతి తప్పనిసరి. క్షేత్ర స్థాయిలో నిర్మాణాలు జరుగుతుంటే పంచాయతీ అధికారులు అడ్డుకుని రెవెన్యూ, బోర్డు అధికారులకు సమాచారం ఇవ్వాలి. కానీ పంచాయతీ అధికారులు మౌనం వహించడంతో అధిక పొగాకు పంట సాగుకు అడ్డుకట్ట పడటం లేదు. బోర్డు అధికారులకు అక్రమ బ్యారన్‌లపై చర్యలు తీసుకునేందుకు హక్కు లేకపోవడంతో చేసేదేం లేక నిర్మాణాల జాబితాను రెవెన్యూ అధికారులకు అందించినట్లు టంగుటూరునిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు.

# సేవలు అందేలా.. పర్యవేక్షణ పెంచేలా..

చీపురుపల్లి: గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సుస్థిర పాలన అందించడంతో పాటు సంక్షేమ పథకాల పర్యవేక్షణపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఆ దిశగా ఒక్కో అడుగు ముందుకు వేస్తోంది. ఇప్పటికే రెవెన్యూ డివిజన్ స్థాయిలో డీడీవో కార్యాలయాలను ఏర్పాటు చేసింది. తాజాగా గ్రామ, వార్డు సచివాలయలకు పర్యవేక్షణ అధికారులను నియమించింది. డిప్యూటీ ఎంపీడీవో, మండల పరిషత్తు కార్యాలయ పరిపాలన అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించింది. జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలు : 626
మండలాలు : 25
నియమించిన అధికారులు : 25

గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినా పర్యవేక్షణను గాలికొదిలేసింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం చర్యలు




ప్రారంభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ గ్రామ పరిపాలనపై ప్రత్యేక దృష్టి సారించారు. దీనిలో భాగంగా మండల సచివాలయ అధికారులను నియమించారు. మండలాల్లో డిప్యూటీ ఎంపీడీవో స్థాయిలో ఇద్దరు పనిచేస్తారు. ఒకరు పంచాయతీలను, మరొకరు సచివాలయాల వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో గ్రేడ్–1 కార్యదర్శులు, సీనియర్ సహాయకుల్లో అర్హులకు పదోన్నతులు కల్పించి పూర్తిస్థాయిలో సచివాలయ అధికారులను నియమించనున్నారు. ప్రజలకు పాలన మరింత చేరువ చేసేందుకు ప్రభుతం ఈ చర్యలు తీసుకుందని చీపురుపల్లి డివిజన్ అధికారి హేమసుందర్ చెప్పారు. సేవలు సక్రమంగా అందే అవకాశముంటుందన్నారు.

# కాస్త ఊరట.. మరికాస్త ఆశ..

కొవ్వూరు : అయిదేళ్లుగా ఆశగా ఎదురుచూసిన రైలు ప్రయాణికులకు కాస్త ఊరట కలగనుంది. తాజాగా రైల్వే బోర్డు నిర్ణయంతో తిరుమల, విశాఖ– మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్‌లు కొవ్వూరులో ఆపేందుకు తీసుకున్న నిర్ణయం శుభ పరిణామంగా కనిపిస్తోంది. కరోనా ముందు మాదిరిగా ముఖ్య రైళ్లన్నీ ఒక్కొక్కటిగా ఆగుతాయని ఆనందం వ్యక్తమవుతోంది. కొవ్వూరు నియోజకవర్గ ప్రజలకే కాకుండా గోపాలపురం, పోలవరం పరిధిలోని సుమారు 120 గ్రామాల ప్రయాణికులకు ఇది ఉపయోగం. 2020 మార్చి 22న లాక్‌డౌన్ విధించడంతో అన్ని రైళ్లూ రద్దయ్యాయి. ఆంక్షల తర్వాత దశల వారీగా అన్ని స్టేషన్లలోనూ రైళ్లను పునరుద్ధరించినా కొవ్వూరు స్టేషనుకు ఆ భాగ్యం దక్కలేదు. ఎన్నో రకాల ఉద్యమాలు చేసి వినతులిచ్చినా ముఖ్య రైళ్లు ఆగడం గగనంగా మారింది.




**ఎన్నికల వేళ ప్రధానాంశమై..**

కరోనాకు ముందు ఆగిన అన్ని రైళ్లను నిలుపుదల చేయాలంటూ ఇక్కడ ప్రజానీకం గతేడాది ఎన్నికల ముందు అన్ని రాజకీయ పార్టీలనూ డిమాండ్ చేశారు. మన కొవ్వూరు– మన బాధ్యత పేరుతో రైల్వే పరిరక్షణ సమితి వినతులందిస్తూ, నిరసనలు తెలియజేసింది.

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రైళ్ల నిలుపుదలపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చారు. నాయకులతో కలసి జీఎం, రైల్వే మంత్రిని పలుమార్లు స్వయంగా కలిశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఎంపీని, రైల్వే అధికారులను కలసి రైళ్ల హాల్ట్‌ల కోసం కృషి చేశారు. ఇక్కడి పారిశ్రామిక వేత్తలు, నాయకులు భాగస్వామ్యం అయ్యారు.

# కట్టిస్తామన్నారు.. చేతులెత్తేశారు!

అమలాపురం : గృహ నిర్మాణదారులకు అప్పటి వైకాపా ప్రభుత్వం మూడు ఐచ్ఛికాలు ఇచ్చింది. మొదటిది లబ్ధిదారుడే నిర్మించుకోవడం, రెండవది ఇసుక, సిమెంటు, ఇనుము, ఇతర సామగ్రి అందించడం, మూడవది ప్రభుత్వమే పూర్తిగా నిర్మించి అందివ్వడం. జిల్లాలో అమలాపురం, రామచంద్రపురం, మండపేట పట్టణాల పరిధిలో మొత్తం 2,608 మంది మూడవ ఐచ్ఛికం ప్రకారం ముందుకొచ్చారు. వీటిలో ఇప్పటివరకు కేవలం సుమారు 304 గృహాలే పూర్తిచేశారు. మిగిలిన గృహాలు పునాదులకే పరిమితం కావడం గమనార్హం.

**బిల్లులు చెల్లించాలి...**

అమలాపురం, రామచంద్రపురం పట్టణాల్లో అజయ వెంచర్ అనే సంస్థకు 234 ఇళ్ల నిర్మాణాలు అప్పగించారు. వీరికి నిర్మాణాల ఆధారంగా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించారు. ఒక్కటి కూడా పూర్తిచేయలేదు. మిగిలిన వాటిని స్థానికంగా పనులు చేసేవారికి అప్పగించారు. వీరిపై అధికారులు ఒత్తిడి తీసుకువచ్చి వేగవంతం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు కాకుండా లబ్ధిదారుల అదనంగా మరో రూ.1.20 లక్షలు ఇచ్చేలా గుత్తేదారులతో ఒప్పందం చేసుకున్నారు. అయినా ఎక్కడా పూర్తిచేయలేదు.

**సామగ్రి రికవరీ అయ్యేనా..**

అజయ వెంచర్ సంస్థకు గత వైకాపా నాయకుల సిఫార్సులతో అప్పటి అధికారులు 133.55 మె.టన్నుల సిమెంట్, 1180 మె.టన్నుల ఇసుక, 4.16 టన్నుల ఇనుము ముందస్తుగా అందించారు. వీటిని ఈ సంస్థ పేదల గృహనిర్మాణాలకు కాకుండా సొంత అవసరాలకు వినియోగించుకుంది. తాజాగా ఆ సంస్థ నుంచి సామగ్రిని రికవరీ చేసేందుకు అధికారులు సిద్ధపడుతున్నారు.

**పర్యవేక్షిస్తున్నాం**

జిల్లాలో ఆప్షన్–3 ఇళ్లతో పాటుగా అన్ని నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిసారించాం. ఆప్షన్–3లో నిర్మాణాలను వేగవంతం చేయాలని గుత్తేదారులకు సూచిస్తున్నాం. అజయ వెంచర్ సంస్థ నుంచి ముందస్తుగా ఇచ్చిన సామగ్రిని రికవరీ చేసేందుకు సిద్ధపడుతున్నాం.
నరసింహారావు, గృహనిర్మాణశాఖ పీడీ

చురకలు



# పాతాళ గంగమ్మ పైపైకి

భీమవరం : వర్షాకాలంలో పలుచోట్ల కుంభవృష్టి కురవడంతో జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాలు పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే నీటి మట్టం 1.43 మీటర్లకు చేరింది. ఈ ఏడాది మే-సెప్టెంబరు మధ్య తేడా గమనిస్తే జిల్లాలో కాళ్ల తప్ప మిగిలిన 19 మండలాల్లో నీటి మట్టాలు పెరిగాయి. దీంతో బోర్లు మీద ఆధారపడిన వ్యవసాయ ఆయకట్టుకు సాగునీరు దండిగా అందనుంది. మరో పక్క పరిశ్రమలకు, ఆక్వా రంగానికి కూడా నీటి కొరత సమస్య ఉండదని భూగర్భజలాల పరిరక్షణశాఖ అధికారులు అంచనా వేశారు. శివారు ప్రాంతాలు, కాలనీల్లో బోరు నీటితో నడుస్తున్న మంచినీటి పథకాలు,



చేతి పంపులకు భూగర్భ జలాల సమస్య ఉండదు.

జిల్లాలో గత ఏడాది నవంబరులో నీటి మట్టం సగటున 7.37 మీటర్లు లోతుగా ఉండగా, ఈ ఏడాది మే నాటికి 8.91 మీటర్లకు వెళ్లింది. సెప్టెంబరు నెలాఖరు నాటికి 7.48 మీటర్లకు పెరిగింది. దాదాపు 1.43 మీటర్ల మేర భూగర్భజలాలు పైకొచ్చాయి. తాడేపల్లిగూడెం, వీరవాసరం, తణుకు, పెనుగొండ, పాలకొల్లు, నరసాపురం మండలాల్లో నీటి మట్టం భారీగా పైకి ఉబికింది.

# నాడు బందు.. నేడు రైతుబంధు

నరసాపురం: వైకాపా సర్కారు హయాంలో అటకెక్కించిన రైతుబంధు పథకాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు ధర లేనప్పుడు పంట ఉత్పత్తులను ఈ పథకం ద్వారా మార్కెట్ యార్డు గోదాముల్లో ఆరు నెలల పాటు ఉచితంగా నిల్వ చేసుకోవడంతో పాటు బ్యాంకుల ద్వారా రుణం కూడా పొందవచ్చు. నిర్ణీత గడువులోపు రుణం చెల్లిస్తే వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు.

**లక్ష్యం రూ.8.20 కోట్లు..** జిల్లాలో ఆకివీడు, అత్తిలి, భీమవరం, పాలకొల్లు, పెనుగొండ, తాడేపల్లిగూడెం, తణుకు, ఉండి, ఆచంట, నరసాపురంలో వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో రైతు బంధు పథకం ద్వారా ఈ ఏడాది రూ.8.20 కోట్ల రుణాలు



ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లాలో దాదాపు 2.14 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. దిగుబడి వచ్చే సమయానికి మార్కెట్లో ధరలు ఆశాజనకంగా లేకపోతే రైతులు ధాన్యాన్ని మార్కెట్ యార్డుల గోదాముల్లో నిల్వ చేసుకోవచ్చు.

**బీమా సదుపాయం..** ఈ పథకంలో రుణ పరిమితి రూ.2 లక్షల వరకు పెంచారు. గోదాముల్లో నిల్వ చేసిన పంట ఉత్పత్తుల మార్కెట్ విలువలో 75 శాతం వరకు రుణం పొందొచ్చు. ఆరు నెలలు దాటితే తక్కువ మొత్తంలో అద్దె తీసుకుంటారు. దీనికి తోడు నిల్వ చేసిన ధాన్యానికి బీమా సదుపాయం వర్తిస్తుంది. రుణాలపై 180 రోజుల వరకు వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. అవసరమైన రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మార్కెటింగ్ శాఖ ఏడీ సునీల్ సూచించారు.

## ఇకపై కొనుగోలు సమయంలోనే ఈ-కేవైసీ

చింతలపూడి: జిల్లా వ్యాప్తంగా ధాన్యం పంట నూర్పుళ్లు ప్రారంభమ వుతున్నాయి. ఈ ఖరీఫ్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సరళీకృత విధానాలను అందుబాటులోకి తెస్తోంది. ఇకపై ఈ కొనుగోలు కేంద్రాల్లోనే ఈ-కేవైసీ నమోదు చేసుకునేలా మార్పులు చేపట్టింది.

సిబ్బంది సహకారంతో..

ఎన్ని సంస్కరణలు తెచ్చినా ధాన్యం కొనుగోళ్లలో మాత్రం అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. దళారులు, కమీషన్ ఏజెంట్లు రైతుల నుంచి పట్టాదారు పాసు పుస్తకాలు, బ్యాంకు ఖాతాలు, ఆధార్ కార్డులు సేకరించి సిబ్బంది సహకారంతో నమోదు చేయించేవారు. తర్వాత రైతుల వద్ద తక్కువ ధరకు ధాన్యం కొని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు విక్రయించి కనీస మద్దతు ధర పొందుతూ భారీగా లబ్ధి పొందుతున్నారు.

ఈ నెలాఖరు కల్లా.. గతంలో పౌరసరఫరాల, వ్యవసాయ శాఖలు వేర్వేరుగా రైతుల నుంచి ఈ-కేవైసీ వివరాలు సేకరించేవి. ఇక నుంచి కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు సమయంలోనే ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేసేలా నిబంధనలు సవరించారు. ఈ నెలాఖరు కల్లా జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. మెట్ట ప్రాంతాల్లో వచ్చే నెల ప్రారంభంలో కోతలు ప్రారంభమయ్యే అవకాశముండగా.. చాట్రాయి, ఉంగుటూరు మండలాల్లో ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ నెలాఖరుకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే సరిపోతుందని రైతులు చెబుతున్నారు. 'ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. 1.12 కోట్ల గోనె సంచులకు 70 లక్షలు అందుబాటులో ఉంచాం. మొత్తం 108 మిల్లులను సీఎంఆర్ కింద ఎంపిక చేశాం' అని పౌరసరఫరాల శాఖ డీఎం శివరామమూర్తి తెలిపారు.

**జిల్లాలో..**సాధారణ రకం మద్దతు ధర (క్వింటా) రూ.2,369
గ్రేడ్ 'ఏ' రూ.2,389
ఖరీఫ్‌లో ధాన్యం ఉత్పత్తి అంచనా 5.74లక్షల మెట్రిక్ టన్నులు
సేకరణ లక్ష్యం- 4.07 లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు కేంద్రాలు- 240
సీఎంఆర్ కింద ట్యాగ్ అయిన రైస్ మిల్లులు- 108

# 4 గ్రేడ్లు.. 467 పంచాయతీలు



గోరంట్ల : ప్రభుత్వ సంక్షేమ ఫలాలు, సేవలు ప్రజలకు మరింత చేరువ చేస్తూ, పంచాయతీల వ్యవస్థను బలోపేతం చేయడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా గతంలో ఆరు గ్రేడ్లుగా ఉన్న పంచాయతీలను నాలుగింటికి తగ్గిస్తూ, అందులో పని చేసే అధికారుల స్థాయిని పెంచుతోంది. ఈ విధానంతో ఓవైపు అధికారులకు ఉద్యోగోన్నతులు, మరోవైపు అదనంగా సిబ్బంది వస్తారని ఆశాఖ వర్గాలు పేర్కొంటున్నారు. గతంలో ఉన్న క్లస్టర్ల వ్యవస్థను రద్దు చేస్తూ ఆ స్థానంలో గ్రేడ్ల వ్యవస్థను తీసుకొస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం.. మంత్రివర్గంలో ఆమోదం పొందడం పూర్తి కావడంతో కార్యాచరణ ముగింపు దశకు చేరుకుందని, త్వరలోనే ప్రక్రియ ప్రారంభం కావచ్చని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని 467 పంచాయతీలను డివిజన్ల వారీగా గ్రేడ్ల పద్ధతిలో ఏర్పాటుకు పంపిన ప్రతిపాదనలు ఇలా ఉన్నాయి.

**గ్రేడ్ల విభజన ఇలా**

స్పెషల్ గ్రేడ్: 10 వేలకుపైగా జనాభా కలిగిన లేదా రూ.కోటికిపైగా ఆదాయం ఉన్న పంచాయతీలు స్పెషల్ గ్రేడ్‌లోకి వస్తాయి. గిరిజన ప్రాంతాల్లో 5000కుపైగా జనాభా ఉంటే చాలు. గతంలో ఇక్కడ ఉన్న గ్రేడ్-1 కార్యదర్శి స్థాయిని పెంచుతూ డిప్యూటీ ఎంపీడీవోను నియమిస్తున్నారు.

గ్రేడ్-1: పంచాయతీ జనాభా 4000 నుంచి 10 వేలలోపు, ఆదాయం రూ.30 వేల నుంచి రూ.కోటిలోపు ఉన్నవి. గిరిజన ప్రాంతాల్లో 3000 నుంచి 5000లోపు జనాభా. మండల కేంద్రాల్లోని పంచాయతీలన్నీ గ్రేడ్-1 పరిధిలోకి వస్తాయి.

గ్రేడ్-2: జనాభా 2000-4000 మధ్య ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో 1500 నుంచి 3000 లోపు.

గ్రేడ్-3: జనాభా 2000లోపు, గిరిజన ప్రాంతాల్లో 1500 లోపు ఉన్న పంచాయతీలు.

పంచాయతీ కార్యదర్శి పేరును గ్రేడ్ల వారీగా ఎక్జిక్యూటివ్ అధికారి(ఈవో) గా పిలువనున్నారు.

నూతన వర్గీకరణలో క్లర్క్‌లు, బిల్‌కలెక్టర్లు, అటెండర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుద్ధ్య కార్మికులు, రాత్రి కాపలాదారుడు, ఎలక్ట్రీషియన్లు అదనంగా రానున్నారు.

ఇప్పటివరకు పంచాయతీ కార్యదర్శులు ఐదు గ్రేడ్లు, సచివాలయ ఉద్యోగులు ఆరో గ్రేడ్‌గా ఉండగా వాటిని కేవలం మూడు గ్రేడ్లుగా చేస్తున్నారు. దీంతో పదోన్నతులు త్వరగా రావడంతోపాటు ప్రస్తుతం సీనియారిటీ విషయంలో ఎదురవుతున్న సమస్యలు తొలగిపోతాయని కార్యదర్శుల నుంచి ఆనందం వ్యక్తం అవుతోంది.

# దిగుబడి ఉన్నా.. ధరలో నిరాశ



కళ్యాణదుర్గం : ఎన్నో ఆశలతో బంతిపూల సాగు చేసిన రైతులకు దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా.. మార్కెట్లో గిట్టుబాటు ధర లేమితో రైతులు నష్టాల ఊబిలో కూరుకుని పోతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని బొమ్మనహాళ్, కణేకల్లు, రాయదుర్గం, డి.హీరేహాళ్, కళ్యాణదుర్గం, ఉరవకొండ, మడకశిర, హిందూపురం, తాడిపత్రి, గుంతకల్లు తదితర ప్రాంతాలల్లో సుమారు 650 ఎకరాల్లో బంతిపూల తోటలు సాగయ్యాయి. ప్రతిఏటా విజయదశమి, దీపావళి, వినాయక చవితి, కార్తిక, శ్రావణ మాసాల్లో పండుగలతోపాటు పెళ్లిళ్ల సీజన్లలో ఎక్కువగా దిగుబడులు వస్తుంటాయి. ఈసారి పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా.. మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. గతేడాది కిలో రూ.100 నుంచి రూ.120 వరకు ఉన్న పూలు ఇప్పుడు కిలోకు రూ.40 నుంచి రూ.50 లోపే ఉండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**గతేడాదితో పోల్చితే ధర లేదు**

గతేడాదితో పోలిస్తే సగం ధర కూడా లేదు. ఇప్పటి వరకు పెట్టుబడులు కూడా రాలేదు. పెట్టుబడులకు తగ్గట్టుగా పూల రైతులకు గిట్టుబాటు ధరల కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
వీరేష్, 75ఉడేగోళం

**రైతులను ఆదుకోవాలి**

బంతిపూల సాగు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. అన్నదాతలకు విత్తనాలు, డ్రిప్పు సౌకర్యం, రసాయన ఎరువులు రాయితీపై ఇవ్వాలి. కనీసం కిలో రూ.100 ఉంటే తప్పా రైతులు గిట్టుబాటు కలిగే పరిస్థితులు లేవు. శేఖర్, కల్‌హోళ

**ఆర్థిక ఊరట ఇస్తోంది**

గరుడాపురంలో పదేళ్లుగా బంతిపూలు సాగు చేస్తున్నా. పావగడ నుంచి ఒక్కోమొక్క రూ.3 చెల్లించి 4 వేల మొక్కలు తీసుకొచ్చి నాటా. దసరా నుంచి పూల దిగుబడులు వస్తున్నాయి. ఎక్కువగా బెంగళూరుకు ఎగుమతి చేస్తుండటంతో కొద్దిగా లాభాలు వస్తున్నాయి. రాజు, గరుడాపురం

# శరవేగంగా సోలార్ ప్రాజెక్టు పనులు



రామగిరి: రామగిరి పరిసరాల్లో సోలార్ పార్క్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రామగిరి, కనగానపల్లి మండలాల్లోని 1,047 ఎకరాల్లో 300 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అభివృద్ధి చేస్తోంది. సెకి 1,200 మెగావాట్ల కేటాయింపులో భాగంగా ప్రస్తుతం 300 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు పనులను సెప్టెంబరు 25న ప్రధానమంత్రి మోదీ రాజస్థాన్‌లోని బాంస్‌వాడా నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

ఈ ప్రాజెక్టు పనులను 12 నెలల కాలంలో పూర్తి చేయడానికి అమరరాజా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి అప్పగించారు. ఈపీసీ పనులను టీపీ సోలార్, అల్పెక్స్ సోలార్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. దీనికి వ్యయం రూ.1,326 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. ప్రాజెక్టుకు సంబంధించిన పనులను ప్రారంభించారు. సుమారు 27 కిలోమీటర్ల మేర కంచె వేసి, సెకీ, అమరరాజా ఇన్‌ఫ్రా కార్యాలయాలను ఏర్పాటు చేశారు. సోలార్ పలకల ఏర్పాటుకు నేలను చదును చేసి ఇనుప దిమ్మెలు నిర్మిస్తున్నారు.

**విద్యుత్తు సరఫరా ఒప్పందం ఇలా..**

సోలార్ ప్రాజెక్టు పనులు పూర్తయిన తరువాత ఇక్కడి నుంచి సరఫరా అయ్యే విద్యుత్తును కొనుగోలు చేయడానికి మధ్యప్రదేశ్ పవర్ మేనేజ్మెంట్ కంపెనీ యూనిట్ రూ.2.57 టారిఫ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. మధ్యప్రదేశ్‌కు విద్యుత్తును సరఫరా చేసేందుకు సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటి ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు కర్ణాటకలోని పావగడ వద్ద ఉన్న ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ సబ్‌స్టేషన్ ద్వారా ఒప్పందం కుదుర్చుకున్నారు.

# నకిలీ పత్రాలతో.. భూమి కాజేసే యత్నం!

ఉరవకొండ, వజ్రకరూరు, న్యూస్‌టుడే: ఓ ఉప తహసీల్దార్ నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి మీ-సేవ కేంద్రం సాయంతో రూ.కోట్ల విలువైన భూమిని కాజేసే ప్రయత్నం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అనంతపురం గ్రామీణ మండలం ఉప్పరపల్లికి చెందిన పసులూరి రమేశ్‌బాబు, రాకేశ్‌బాబు, రవికుమార్ తోపాటు వారి అక్కాచెల్లెళ్లకు అదే గ్రామంలో 13.18 ఎకరాల (సుమారు రూ.52 కోట్లు) విలువైన భూమి ఉంది. ఈ భూమిని కాజేయడానికి తాడిపత్రికి చెందిన పసలూరి రుషింగమయ్య అనే వ్యక్తి పేరుతో ఈనెల 13న వజ్రకరూరులోని మీ-సేవ కేంద్రం నుంచి భూ హక్కుల బదలాయింపున( మ్యుటేషన్)కు దరఖాస్తు చేశారు. ఈ విషయం వెంటనే ఆ భూ యజమానుల్లో ఒకరి చరవాణికి సంక్షిప్త సమాచారం వెళ్లింది. వెంటనే వారు అప్రమత్తమై ఉప్పరపల్లి వీఆర్వో జిలాన్ ఆశిక్, మండల రెవెన్యూ అధికారులను సంప్రదించారు. దరఖాస్తు వజ్రకరూరులోని మీ-సేవ ద్వారా వచ్చినట్లు వారు తెలుపగా.. భూ యజమానులు అక్కడికి వెళ్లి నిర్వాహకులను ప్రశ్నించారు. గతంలో ఈ ప్రాంతలో పనిచేసిన ఓ ఉప తహసీల్దార్ వాట్సప్ ద్వారా పత్రాలు పంపి దరఖాస్తు చేయాలని కోరగా.. అలాగే చేసినట్లు వారు తెలిపారు. వెంటనే భూ యజమానులు తమకు సంబంధం లేకుండా వచ్చిన భూ హక్కుల బదలాయింపు(మ్యుటేషన్) పత్రాలను రిజెక్టు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఆర్వోతోపాటు, ఇతర రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.సూత్రధారి ఉప తహసీల్దార్? ఉరవకొండ ప్రాంతంలో గతంలో పనిచేసి ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ఓ ఉప తహసీల్దార్ ఈ భూమిని కాజేయడానికి బినామి పేర్లతో కుట్రకు తెరలేపినట్లు సమాచారం. ఆయనే సంబంధిత నకిలీ ధ్రువపత్రాలను మీ-సేవ నిర్వాహకులకు వాట్సప్‌లో పంపి దరఖాస్తు చేయాలని సూచించినట్లు తెలిసింది.

# నిర్వహణ ఘోరం.. లక్ష్యం దూరం

భీమవరం : కొవ్వాడ డంపింగ్‌యార్డులో ఖాళీగా తొట్టెలు ఇవి. ఇప్పటి వరకు ఇక్కడ కిలో ఎరువు కూడా తయారు చేయలేకపోయారు. ఇదే మండలం చినఅమిరంలోనూ ఇదే పరిస్థితి. ఈ రెండు పంచాయతీలకు ప్రత్యేకాధికారి ఎంపీడీవోనే కావడం విశేషం. పచ్చగా.. శుభ్రంగా ఉండాల్సిన పల్లెలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నాయి. గత తెదేపా సర్కారు హయాంలో పెద్ద ఎత్తున డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేశారు. ఒక్కోదానికి రూ.5 లక్షల నుంచి రూ.14 లక్షల వరకు ఖర్చు చేశారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో వాటి నిర్వహణ గాలికొదిలేయడంతో నిరుపయోగంగా మారాయి. తాజాగా స్వచ్ఛభారత్ నినాదంతో అధికారులు పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఇస్తున్న ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. కొన్ని చోట్ల సిబ్బంది కొరత అధికంగా ఉంది. కొన్ని పంచాయతీలకు ఆదాయం నామమాత్రంగానే ఉంది. ఆదాయ వనరులు బాగున్న పంచాయతీల్లోనూ నిర్వహణ పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా మండల అధికారులు, స్థానిక పాలకవర్గాలు శ్రద్ధ తీసుకోకపోవడంతో పరిస్థితి రోజురోజుకీ దిగజారుతోంది. ఇప్పటికే వ్యాధులతో గ్రామీణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ఎక్కడికక్కడ పేరుకుపోయి..** చాలా చోట్ల నిరుపయోగంగా ఉన్నాయి.



ఫలితంగా కాలువలు, ప్రధాన రహదారుల అంచులు చెత్తకుప్పలకు నిలయాలుగా మారిపోతున్నాయి. ఉండి జనాభా 17 వేలు. ఇక్కడ పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. డంపింగ్‌యార్డు కోసం రెండెకరాల భూమి అవసరమని ఐదేళ్లుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఉప్పుగుంట ప్రాంతంలో రోజూ టన్నులకొద్దీ చెత్త పేరుకుపోతోంది. పలు చోట్ల రహదారుల వెంబడి వేస్తున్న చెత్తతో జనం అవస్థలు అన్నీఇన్నీ కావు.

**వినియోగంలోకి తీసుకొస్తాం..- రామ్‌నాథ్‌రెడ్డి, డీపీవో**

వెయ్యి కుటుంబాలకు ఒకరు చొప్పున 400 మంది రీసోర్స్ పర్సన్లను ఎంపిక చేసి తడి-పొడి చెత్త వేరు చేయడంపై వారికి ఇటీవల శిక్షణ ఇచ్చాం. వారిలో ఒక్కొక్కరు 50 కుటుంబాలను నేరుగా కలిసి అవగాహన కల్పిస్తారు. అన్ని కేంద్రాలను కచ్చితంగా వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లాలో మొత్తం పంచాయతీలు 409
ఘన వ్యర్థాల కేంద్రాలు 365
నామమాత్రంగా నిర్వహణ 30

# నైపుణ్యాభివృద్ధి 'సేతు'వు

డోన్ : యువతలో నైపుణ్యాభివృద్ధికి, ఉద్యోగాల కల్పనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రాజెక్టు సర్వ సేతు సంయుక్తంగా ఆన్‌లైన్ గ్లోబల్ స్కిల్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలో ఐటీఐ విద్యార్థులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు జర్మన్ భాషపై ఆన్‌లైన్ ద్వారా 3 నెలల పాటు ఉచితంగా శిక్షణ అందిస్తోంది. శిక్షణ అనంతరం పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణులైన వారికి జర్మనీ దేశంలో ఉన్న కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు.

**జూన్‌లో ప్రారంభం**

కర్నూలు జిల్లాలో కర్నూలులో రెండు, ఆలూరులో ఒక ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఉండగా, నంద్యాల జిల్లాలో నంద్యాల, శ్రీశైలం, డోన్, అవుకు, బేతంచెర్ల ప్రాంతాల్లో.. ఉమ్మడి జిల్లాలో ఎనిమిది ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు ఉన్నాయి.

వీటిల్లో 2 వేల వరకు విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఐటీఐ కళాశాలల్లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రాజెక్టు సర్వ సేతు సంయుక్తంగా ఆన్‌లైన్ గ్లోబల్ స్కిల్లింగ్ కార్యక్రమంలో భాగంగా విదేశాల్లో ఉపాధి కల్పనే ధ్యేయంగా జర్మన్ భాషపై ఆన్‌లైన్ ద్వారా ప్రతి సోమ, బుధవారాల్లో గంట పాటు శిక్షణ ఇస్తున్నారు.

జూన్‌లో ప్రారంభమైన శిక్షణ పూర్తయినట్లు ఐటీఐ కళాశాలల నంద్యాల జిల్లా కన్వీనర్ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. వారికి పరీక్షలు నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం రెండో బ్యాచ్‌నకు సెప్టెంబర్‌లో శిక్షణ



ప్రారంభమైంది.


**ఉద్యోగం వస్తే రూ.లక్షకుపైగా వేతనం**

ఐటీఐ కళాశాలల్లో ఫిట్టర్, టర్నర్, మెషినిస్టు, డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, వెల్డర్, డ్రాఫ్ట్స్‌మెన్, సివిల్, ఆర్‌అండ్‌ఏసీ, కోపా, టైలరింగ్ తదితర ట్రేడుల విద్యార్థులకు జర్మన్ భాషపై పట్టు సాధించేందుకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నారు. ఇందుకు సాంకేతిక నిపుణులతో పాటు జర్మనీలో నివసిస్తున్న తెలుగు నిపుణుల సహకారం అందిస్తున్నారు.

జర్మన్ భాషపై పట్టు సాధించిన వారికి జర్మనీ దేశంలోని పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశం లభించనున్నాయి. నెలకు రూ.లక్షకు పైగానే వేతనం లభించనుంది. వీసా సైతం ఆ కంపెనీల వారే సమకూర్చే ఏర్పాట్లు చేయనున్నారు. ఫీజు లేకుండానే ఉచితంగా జర్మన్ భాషపై శిక్షణ కల్పిస్తున్నారు.

## సైట్ కొడితే పక్కకు పిలిచి కుమ్మేస్తానంటోంది!

ముంబై బ్యూటీ రితికా సింగ్ సుపరిచిమతే. 'గురు'..'నీవెవరో' లాంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. ఇటీవలే రిలీజ్ అయిన కింగ్ ఆఫ్ కొత్త సినిమాలోనూ నటించింది. తమిళ్, మలయాళ చిత్రాల్లోనూ పనిచేసింది. కానీ ఏ భాషలోనూ బిజీ నటిగా మారలేకపోయింది. అందం, అభినయం గల నాయికే అయినా అవకాశాలు అందుకోవడంలో వెనుకబడింది. పోటీని తట్టుకుని మార్కెట్ లో నిలబడలేకపోతుంది. ఈ మధ్య కాలంలో అమ్మడు నటించిన సోలో చిత్రాలేవి రిలీజ్ కాలేదు. చివరిగా రజనీకాంత్ నటించిన వెట్టేయాన్‌లో నటించింది. ఆ తర్వాత రితిక అడ్రస్ లేదు. కానీ ఈ బ్యూటీలో మరో ప్రత్యేకత కూడా ఉంది. అమ్మడు మిక్స్ డు మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ తీసుకుంది. చిన్న వయసు నుంచే మార్షల్ ఆర్ట్స్ లో తర్ఫీదు పొందింది. ఆ ట్యాలెంట్ తోనే %-%గురు%-%లో బాక్సర్ పాత్రకు ఎంపికైంది. కానీ తాను రియల్ లైఫ్ లోనూ రియల్ బాక్సర్ అన్నది చాలా తక్కువ మందికే తెలుసు. మహిళలపై దాడులు



జరిగిన సమయంలో సోషల్ మీడియాలో తప్పక స్పందిస్తుంది. స్వీయా రక్షణపై అవగాహన కల్పిస్తుంటుంది. ఈ క్రమంలో నేటి జనరేషన్ మహిళలంతా తప్పకుండా బాక్సింగ్ , కరాటే, కుంగూపూ లాంటివి నేర్చుకోవాలని సూచించింది. ఇలాంటి విద్యలు తెలిస్తే తమను తాము కాపాడుకోగలుగుతారని ముందు జాగ్రత్త చెప్పింది. దేశంలో అత్యాచారాలు పెరుగుతోన్న వేళ ఇలాంటి విద్యలు తెలిస్తే వాటి నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగే తనకు ఎవరైనా సైట్ కొట్టినట్లు అనిపిస్తే ఎలాంటి భయం లేకుండా అతడిని పక్కకు పిలిచి కుమ్మేస్తానంది. అలాంటి వాటిని చూస్తూ ఊరుకోనంది. ఛాన్స్ ఇస్తేనే ఎవరైనా చూస్తారని..ఆ ఛాన్సే ఇవ్వకుండా చేతి బలం చూపిస్తే? పిచ్చి పిచ్చి వేశాలు వేసే వారు భయపడతారంది. మారుతోన్న రోజుల్లో మహిళలు కూడా అంతే మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపింది. ఈ బ్యూటీ కూడా సోషల్ మీడియాలో యాక్టివ్ గానే ఉంటుంది. ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలు షేర్ చేస్తూ కుర్ర కారులో సెగలు రేపుతుంది. చేతిలో సినిమాలు లేకపోయినా ఇప్పటికీ యువత అటెన్షన్ డ్రా చేస్తుందంటే? కారణం అమ్మ డిలో ఆ రకమైన యాంగిలే అని చెప్పాల్సిన పనిలేదు. ఇన్ స్టాలోనూ అమ్మడికి భారీ ఫాలోయింగ్ ఉంది. ఆ క్రేజ్ తో మాత్రం సినిమా అవకాశాలు అందుకోలేకపోతుంది.

## 'దీపికకు అంత టైమ్ లేదులే'.. డెబ్యూ డైరెక్టర్ సెటైర్లు..

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె కొద్ది రోజులుగా వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. బీ టౌన్ లో స్టార్ హీరోలందరితో కలిసి నటించిన అమ్మడు.. వేరే లెవెల్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుందనే చెప్పాలి. ఇప్పటి వరకు అనేక సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్న దీపిక.. ఇప్పుడు మరిన్ని చిత్రాలతో బిజీగా ఉన్నారు. కల్కి 2898 ఏడీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన దీపిక.. ప్రస్తుతం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో వర్క్ చేస్తున్నారు. కానీ ఇటీవల స్పిరిట్ తో పాటు కల్కి సీక్వెల్ ప్రాజెక్టులను చేజార్చుకున్నారు. కేవలం 8 గంటలు మాత్రమే పనిచేస్తానని దీపిక చెబుతుండడంతో ఆయా సినిమాల మేకర్స్ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో దీపిక చెబుతున్న 8 గంటలపాటు వర్క్ చేసే విషయంపై సినీ వర్గాల్లో చర్చలు జరుగుతూనే ఉన్నాయి. కొందరు ఆమెకు మద్దతు తెలుపుతుంటే.. మరికొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇంకొందరు దీపికపై సెటైర్లు



వేస్తున్నారు. ఇప్పుడు బాలీవుడ్ దర్శకురాలు ఫరాఖాన్ కూడా అదే చేశారు. రీసెంట్ గా ఆమె బీ టౌన్ నటుడు రోహిత్ సరఫ్ ఇంటికి వెళ్లగా.. ఆ సమయంలో యూట్యూబ్ వ్లాగ్ షూట్ చేశారు. అప్పుడు ఫరా ఖాన్.. రోహిత్ సరఫ్ తల్లి ఫేస్ ను రివీల్ చేశారు. ఆమెను అంతా చూడటం ఇదే తొలిసారి. దీంతో ఆ సమయంలో ఫరా.. దీపికను ఓ సినిమా కోసం ఒప్పించడానికి కూడా ఇంత టైమ్ పట్టదని వ్యంగ్యంగా మాట్లాడారు. అప్పుడే ఫరా ఖాన్ చెఫ్.. దీపిక మన షోకు ఎప్పుడొస్తారని అడిగారు. అప్పుడు ఆమెకు టైమ్ లేదని అన్నారు. రోజుకు ఎనిమిది గంటలు మాత్రమే వర్క్ చేస్తుందని అన్నారు. అందుకే షోలో పార్టిసిపేట్ చేసే అంత సమయం లేదని సెటైర్ వేశారు. అందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. కాగా.. ఇక్కడ మరో విషయమేమిటంటే.. దీపిక హీరోయిన్ గా డెబ్యూ మూవీ ఫరాఖాన్ తోనే చేశారు. షారుక్ ఖాన్ సరసన ఓం శాంతి ఓం లో నటించారు. ఆ తర్వాత న్యూ ఇయర్ మూవీకి గాను మరోసారి ఫారాతో చేతులు కలిపారు. అందులోనూ షారుకే హీరోగా నటించడం గమనార్హం. మొత్తానికి దీపిక నిర్ణయం ఫరాకు నచ్చనట్లు ఉంది. అందుకే సెటైర్ వేసినట్లు అర్థమవుతుంది.




## అఖండ 2 బుకింగ్స్.. 20 రోజుల ముందే ఇలా..



నటసింహం బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న 'అఖండ 2' కోసం ఫ్యాన్స్ ఏ రేంజ్‌లో వెయిట్ చేస్తున్నారో తెలిసిందే. ఇక డిసెంబర్ 5న ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా రిలీజ్ కానుండగా, మేకర్స్ ఇండస్ట్రీ రూల్స్‌కు భిన్నంగా, చాలా ముందుగానే ప్రమోషన్స్, బిజినెస్ డీల్స్ క్లోజ్ చేస్తున్నారు. దానికి తగ్గట్టే, ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'అఖండ 2' హడావిడి అప్పుడే మొదలైంది. సినిమా రిలీజ్‌కు ఇంకా 20 రోజులు టైమ్ ఉన్నా, యూఎస్‌ఏలో అడ్వాన్స్ బుకింగ్స్ అఫీషియల్‌గా ఓపెన్ చేసేశారు. ఇది సాధారణంగా రిలీజ్‌కు వారం, పది రోజుల ముందు స్టార్ట్ అయ్యే ప్రాసెస్. కానీ, 'అఖండ' బ్రాండ్‌పై ఉన్న నమ్మకంతో డిస్ట్రిబ్యూటర్లు చాలా ముందుగానే షోలను లిస్ట్ చేశారు. లేటెస్ట్ ట్రేడ్ రిపోర్ట్స్ ప్రకారం, ఈ 22 రోజుల ముందు ఓపెన్ చేసిన బుకింగ్స్‌తోనే 'అఖండ 2' 41,839 డాలర్ల గ్రాస్‌ను కలెక్ట్ చేసింది. ఇప్పటికే 132 లొకేషన్లలో, 394 షోలకు గాను 1442 టికెట్లు అమ్ముడయ్యాయి. ఇది ఫైనల్ నంబర్ కాదు, కానీ రిలీజ్‌కు మూడు వారాలకు పైగా సమయం ఉండగా ఈ నంబర్ రిజిస్టర్ అవ్వడం చూస్తుంటే ఫ్యాన్స్‌లో క్రేజ్ ఏ స్థాయిలో ఉందో చెప్పవచ్చు. ఈ రేంజ్ ఎర్లీ బుకింగ్స్‌కు కారణం.. 'అఖండ' మొదటి భాగం క్రియేట్ చేసిన ఇంపాక్టే. అప్పట్లో 'అఘోరా' క్యారెక్టర్, థమన్ బీజీఎం యూఎస్ ఆడియన్స్‌కు కూడా ఒక కొత్త 'పూనకం' లాంటి ఎక్స్‌పీరియన్స్ ఇచ్చాయి. ఇప్పుడు ఆ మ్యాజిక్‌ను మళ్లీ చూడాలని వాళ్లు వెయిట్ చేస్తున్నారు. దానికి తోడు, రీసెంట్‌గా రిలీజైన "అఖండ తాండవం" సాంగ్ ప్రోమో కూడా ఈ హైప్‌ను మరింత పెంచింది. అయితే, ట్రేడ్ అనలిస్టుల ప్రకారం ఇది కేవలం శాంపిల్ మాత్రమే. అసలు సిసలు మాస్ బుకింగ్స్ జాతర ఇంకా మొదలవలేదు. సాధారణంగా ట్రైలర్ రిలీజ్ అయ్యాక, సినిమాకు వారం రోజులు ఉందనగా అసలు ట్రెండ్ స్టార్ట్ అవుతుంది. కానీ, అంతకంటే ముందే 40%ఖ% డాలర్స్ మార్క్‌ను టచ్ చేయడం అనేది బాలయ్య స్టామినాకు, 'అఖండ' బ్రాండ్‌కు ఓవర్సీస్‌లో ఉన్న క్రేజ్‌కు ఒక పాజిటివ్ సిగ్నల్. బాలకృష్ణకు మెయిన్ మార్కెట్ ఎప్పుడూ తెలుగు రాష్ట్రాల్లోని మాస్ సెంటర్లే. కానీ, 'అఖండ'తో ఆ లెక్కలు మారిపోయాయి. ఇప్పుడు 'అఖండ 2'.. ఓవర్సీస్‌లో కూడా బాలయ్య కెరీర్ బెస్ట్ ఓపెనింగ్స్ ఇచ్చేలా కనిపిస్తోంది.


## ఇది క్లిక్ అయితే మోహన్ బాబు దొరకడు




ఇంకా ఎన్నేళ్లు కష్టపడడం అనుకున్నారో, బయటి సినిమాల్లో చేయడం ఇష్టం లేదో, పిల్లలకు వారసత్వాన్ని ఇచ్చేసి తాను తగ్గుదాం అనుకున్నారో.. కారణాలు ఏవైనా కానీ గత రెండు దశాబ్దాలుగా మోహన్ బాబు సినిమాలు బాగా తగ్గించేశారు.. అప్పుడప్పుడూ సొంత బేనర్లో సినిమాలు చేసినా అవి ఆయన స్థాయికి తగ్గవి కాదు. బయట యమదొంగ, బుజ్జిగాడు లాంటి సినిమాల్లో నటించగా.. వాటిలో ఆయన పాత్రలకు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. కానీ మోహన్ బాబు అలాంటివి మరిన్ని పాత్రలు చేస్తే చూడాలన్న అభిమానుల ఆశ నెరవేరలేదు. క్రమ క్రమంగా సినిమాలు తగ్గించేసి లైమ్ లైట్‌కు దూరం అయిపోయారు మోహన్ బాబు. హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా అద్భుతమైన పాత్రలు చేసి తెలుగు సినిమా చరిత్రలోనే మేటి నటుల్లో ఒకడిగా పేరు తెచ్చుకున్న నటుడు.. ఇలా సినిమాలకు దూరం అయిపోవడం టాలీవుడ్ దురదృష్టం అనే చెప్పాలి. మోహన్ బాబు అందుబాటులో ఉండి, మంచి పాత్రలిస్తే చేయడానికైనా సిద్ధం అన్నాడంటే.. ఎంతోమంది యువ దర్శకులు ఆయన కోసం రెడీగా ఉంటారనడంలో సందేహం లేదు. ఐతే మోహన్ బాబును ఎలా ఒప్పించాడో కానీ దసరా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల.. తన కొత్త చిత్రం ది ప్యారడైజ్‌లో ఆయనతో విలన్ పాత్ర చేయిస్తున్నాడు. ఈ న్యూస్ కొన్ని రోజుల ముందే బ్రేక్ అయింది. ఇప్పుడు అది అధికారికం అయింది. నాని సినిమాలో మోహన్ బాబు విలన్ అంటే మామూలుగా ఉండదంటూ.. ఈ సినిమాలో ఆయన పాత్ర కోసం ఎదురు చూస్తున్నారు అభిమానులు. ఇంతలో రెండు లుక్స్‌తో పోస్టర్లు వదిలాడు శ్రీకాంత్ ఓదెల. ఈ సినిమా హైప్‌ను ఇంకో లెవెల్‌కు తీసుకెళ్లేలా..మోహన్ బాబు అభిమానులను ఉగ్రూతలూగించేలా ఆ పోస్టర్లను డిజైన్ చేశారు. మోహన్ బాబు అంటే ఏంటో తెలియని ఈ తరం ప్రేక్షకులకు ఈ సినిమాతో మైండ్ బ్లాంక్ కావడం ఖాయమనే సంకేతాలు ఇచ్చాయి ఈ పోస్టర్లు. ఈ సినిమాలో మోహన్ బాబు పాత్ర బలంగా ఉంటే చాలు. ఆయన. పెర్ఫామెన్స్ అదరగొట్టేస్తారనడంలో సందేహం లేదు. అదే జరిగితే మోహన్ బాబుకు టాలీవుడ్లో ఒక్కసారిగా డిమాండ్ పెరిగిపోవడం, ఆయన అందరికీ దొరకనంత బిజీ అయిపోవడం ఖాయం.

## తెలుసు కదా డైరెక్టర్ పై శ్రీనిధి కామెంట్స్.. ఇన్ని టాలెంట్స్ ఉన్నాయా?

ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ నీరజాకోన తొలి దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'తెలుసు కదా'. అక్టోబర్ 17వ తేదీన భారీ అంచనాల మధ్య రాబోతున్న ఈ సినిమాలో యంగ్ హీరో సిద్దు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్నారు. అలాగే కేజీఎఫ్ , హిట్ చిత్రాలతో భారీ పాపులారిటీ అందుకున్న శ్రీనిధి శెట్టి అలాగే రాశిఖన్నా కలిసి స్క్రీన్ షేర్ చేసుకోబోతుండడంతో అంచనాలు భారీగా పెరిగిపోయాయి. ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబోట్ల నిర్మించారు. తెలుగు భాషా రొమాంటిక్ డ్రామాగా వస్తున్న ఈ సినిమాకి తమన్ సంగీతం అందించారు. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలలో పాల్గొంటున్న చిత్ర బృందం ఎన్నో విషయాలను పంచుకుంటున్నారు. అందులో భాగంగానే తాజాగా ఒక ఛానల్ కు ఇంటర్వ్యూ ఇచ్చిన హీరోయిన్ శ్రీనిధి శెట్టి సినిమా కబుర్లు చెప్పడమే కాకుండా డైరెక్టర్ గా తన కెరియర్ ను యు టర్న్ తీసుకున్న నీరజా కోన గురించి కూడా ఊహించని కామెంట్లు చేశారు. ముఖ్యంగా ఆమెలో ఉన్న టాలెంట్స్ ను బయటపెట్టి అందరిని ఆశ్చర్యపరిచారు. కాస్ట్యూమ్ డిజైనర్ గా పేరు తెచ్చుకున్న నీరజ కోన మొదటిసారి డైరెక్టర్ అయ్యారు కదా.. ఆమె సెట్ లో ఎలా ఉంటారు? ఆమె డైరెక్షన్ ఎలా ఉంది? అని



ప్రశ్నించగా శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ.. "అసలు ఆమెకు ఈ సినిమా తొలి డైరెక్షన్ అంటే ఎవరు నమ్మరు. డైరెక్షన్ విభాగంలో ఎంతో అనుభవం ఉన్న వ్యక్తిగా ఈ సినిమాను చాలా అద్భుతంగా రూపొందించారు. ఆమె డైరెక్టర్ మాత్రమే కాదు లిరిసిస్ట్ కూడా.. ఈ మధ్యనే నాకు ఈ విషయం తెలిసింది. ఆమె గతంలో కూడా కొన్ని పాటలకు లిరిక్స్ అందించారట. ఆమె కాస్ట్యూమ్ డిజైనర్ గా, స్టైలిస్ట్ గా , గేయ రచయిత్రిగా మంచి పేరు దక్కించుకున్నారు. ఇప్పుడు డైరెక్టర్ గా కూడా సక్సెస్ కాబోతున్నారు" అంటూ నీరజ కోన గురించి పలు కామెంట్లు చేసింది శ్రీనిధి శెట్టి. నీరజ కోన విషయానికి వస్తే.. అమెరికాలో 14 సంవత్సరాల పాటు ఫ్యాషన్ కోర్సులు నేర్చుకొని.. ఇండియాకి తిరిగి వచ్చి తన సోదరుడు కోన వెంకట్ ద్వారా 'గుండెజారి గల్లంతయ్యిందే' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైంది.. ఇందులో హీరో నితిన్ కి స్టైలిస్ట్ గా పనిచేసింది. ఆ తర్వాత రామయ్యా వస్తావయ్యా, అత్తారింటికి దారేది, ఎవడు, కొరియర్ బాయ్ కళ్యాణ్ వంటి చిత్రాలకు పనిచేసి.. నటి సమంత కు వ్యక్తిగత స్టైలిస్ట్ గా కూడా వ్యవహరించింది. అలాగే తిక్క, చల్ మోహన్ రంగా, మిస్ ఇండియా వంటి చిత్రాలలో కొన్ని పాటలకు గేయ రచయిత్రి గా కూడా పనిచేసింది. ఇప్పుడు తెలుసు కదా సినిమాతో డైరెక్టర్ గా అవతరించిన నీరజాకోన ఈ సినిమాతో సక్సెస్ అందుకోవాలని అభిమానులు, సెలబ్రిటీలు కూడా కోరుకుంటున్నారు.

## పచ్చని పొలాల మధ్య సందడి చేస్తున్న అనుపమ..

అనుపమ పరమేశ్వరన్.. ఒకప్పుడు చాలా సెలెక్టివ్ గా పాత్రలు ఎంచుకుంటూ చాలా పద్ధతిగా కనిపించి ప్రేక్షకులను ఆకట్టు కుంది. ముఖ్యంగా ఈ మలయాళీ ముద్దుగుమ్మకు తెలుగులో భారీగానే ఆఫర్లు వచ్చాయి. దీంతో అమ్మడు రేంజ్ స్టార్ స్టేటస్ కి పెరిగిపో తుందని అందరూ అనుకున్నారు.. కానీ అనూహ్యంగా అనుపమ పరమేశ్వరన్ కి అవకాశాలు తగ్గిపోయాయి. దాంతో కొన్నాళ్లు ఇండస్ట్రీకి దూరంగా ఉన్న ఈమె.. మళ్లీ రెట్టింపు వేగంతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఇటీవల పరదా అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈమె.. ఈ సినిమాతో పెద్దగా ఆకట్టుకోలేదు. మళ్ళీ ఇప్పుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో కలిసి 'కిష్కింధపురి' అనే సినిమా చేసింది. ఎన్నో అంచనాల మధ్య వచ్చిన ఈ సినిమా మంచి పాజిటివ్ టాక్ కూడా దక్కించుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు 'బైసన్' అనే మరో సినిమాలో నటిస్తోంది అనుపమ. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్డేట్ ను తన సోషల్ మీడియా ఖాతాలో రిలీజ్ చేస్తూ అభిమానులకు చేరువయ్యే ప్రయత్నం చేస్తుంది. అలాగే మరొకవైపు సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ వరుస ఫోటోలు షేర్ చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది ఈ ముద్దుగుమ్మ. అందులో భాగంగానే తాజాగా అనుపమ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. తాజాగా రెడ్ చుడీదార్ ధరిం చిన ఈమె.. పచ్చని పొలాల మధ్య పరవశించిపోతూ చూపరులను ఆకట్టుకుంది. ముఖ్యంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో మనసును ఉత్సాహపరిచేలా



ఫోటోలు షేర్ చేసింది అనుపమ. నిజానికి ఈ మధ్యకాలంలో ఇలాంటి ఫోటోలు షేర్ చేసి చాలా రోజులు అయింది అంటూ అభిమానులు కూడా కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా అనుపమ షేర్ చేసిన ఈ ఫోటోలు మాత్రం అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. అనుపమ కెరియర్ విషయానికి వస్తే.. 'ప్రేమమ్' సినిమాలో చిన్న పాత్ర పోషించిన అనుపమ.. ఈ మలయాళం చిత్రం తోనే తన కెరీర్ ను మొదలుపెట్టింది. ఆ తర్వాత తెలుగులో నితిన్ హీరోగా, త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన అ ఆ సినిమాలో నటించి ఆకట్టుకుంది. ఈ సినిమా తర్వాత శతమానం భవతి సినిమా చేసి ఓవర్ నైట్ లోనే స్టార్ సెలబ్రిటీ అయిపోయింది అనుపమ. మధ్యలో రంగస్థలం సినిమాలో అవకాశం వచ్చిందని ఈమెనే రిజెక్ట్ చేసిందని కొంతమంది లేనిపోని రూమర్స్ క్రియేట్ చేశారు. వాటి వల్ల ఆరు నెలల పాటు ఇండస్ట్రీకి దూరంగా ఉన్న అనుపమ మళ్లీ అన్నింటిని చక్కబెట్టుకుని వరుస అవకాశాలు అందుకుంటూ బిజీగా మారింది. అలా సౌత్ లో దాదాపు చాలామంది హీరోలతో నటించి మంచి పే రు దక్కించుకుంది. ఇప్పుడు కం బ్యాక్ లో వరుస చిత్రాలతోనే కాదు ఆ చిత్రాలతో సక్సెస్ కూడా అందుకుంటూ పాన్ ఇండియా హీరోయిన్ అయ్యే దిశగా అడుగులు వేస్తోంది. మరి ఈ అమ్మడి కెరీర్ కు మంచి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అందించే సినిమా ఎప్పుడు పడుతుందో చూడాలి

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536